సాక్షి 24|7

మంచిర్యాల

శనివారం 6-1-2018

వడ్డీ.. వర్రీ

- రెండేళ్లుగా అందని వడ్డీ రాయితీ
- 2016 జనవరి వరకే చెల్లింపులు
- జిల్లాలో 11.6 కోట్లు పెండింగ్
- సర్కారు తీరుపై సభ్యుల అసహనం



మహిళా సంఘాలు **11,480**

అందులోని సభ్యులు **1,23,241**

గ్రామైక్య సంఘాలు **532**

వడ్డీ లేని రుణాలకు అర్హులు **13,877**

రెండేళ్లలో తీసుకున్న రుణం **రూ.206 కోట్లు**

ప్రభుత్వం చెల్లించాల్సిన వడ్డీ **రూ. 11.6 కోట్లు**

మంచిర్యాలటౌన్: మహిళల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటును అందించేందుకు ప్రవేశపెట్టిన వడ్డీలేని రుణాల అమలులో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. మహిళలు మరింత ఆర్థిక పరిపుష్టి సాధించేందుకు ప్రభుత్వం 2012లో వడ్డీ లేని రుణాలను ప్రవేశపెట్టింది. దీనికి సంబంధించిన వడ్డీ రాయితీని సకాలంలో విడుదల చేయకపోవడంతో మహిళలు ఆందోళన చెందుతున్నారు. 2016 ఫిబ్రవరి నుంచి వడ్డీ బకాయిలు విడుదల కావడం లేదు. జిల్లాలో గత రెండేళ్ల వడ్డీ బకాయిలు రూ.11.60 కోట్లు పేరుకుపోయాయంటే ఈ పథకం అమలు తీరు ఏవిధంగా ఉందో ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. దీంతో జిల్లాలో మహిళలు తాము తీసుకున్న రుణానికి సంబంధించి చెల్లించిన వడ్డీ కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. మహిళా సంఘాల్లోని సభ్యులు

- మిగతా 2లో ▶







నెన్నెలలో ధర లేక ఇంట్లోనే నిల్వ ఉంచిన టమాటాలను చూపుతున్న రైతు

గిట్టుబాటు ధర లేదు..



ఎకరంలో టమాట, అర ఎకరంలో ఇతర కూరగాయల సాగు చేసిన. పెట్టుబడి ఎకరానికి రూ.20 వేల వరకు పెట్టిన. టమాట ఇరువై రోజుల నుంచి దిగుబడి వస్తుంది. పది రోజుల క్రితం కిలో రూ.25 ఉండే. ఇప్పుడు కిలో రూ.5 చెల్లిస్తున్నారు. ఈ ధక గిట్టుబాటు కావడం లేదు. తెచ్చిన టమాట ఇంటికి తీసుకెళ్ల లేక తక్కువ ధరకే అమ్ముకుంటున్నా.

- జాపాతి నారాయణ, నెన్నెల

టమాట ధర ఢమాల్..

- గతంలో కిలో రూ.60
- ఈ నెలలో కిలో రూ.6
- రూ.10కి రెండు కిలోలు
- పెట్టుబడీ రాని దుస్థితి

మంచిర్యాలఅగ్రికల్చర్: నెల క్రితం టమాట ధర వింటేనే సామాన్యులు హడలిపోయారు. కిలో రూ.60 పైనే పలకడంతో టమాట లేకుండానే వెళ్లదీశారు. సరిగ్గా నెల తిరిగేసరికి టమాట ధర తలకిందులైంది. ఏకంగా రూ.60 నుంచి రూ.6కు చేరింది. జిల్లాలో గత పది రోజులుగా టమాట ధర పతనం అవుతూ వస్తోంది. కొద్ది రోజుల క్రితం కిలో రూ.20 నుంచి రూ.30 వరకు ఉన్న ధర బుధవారం రెండు కిలోలకు రూ.10కి పడిపోయింది. సాయంత్రం సమయంలో రెండున్నర కిలోల వరకు

- మిగతా 2లో ▶



సింగరేణిలో క్రీడలకు ప్రోత్సాహమేది?

- మూడేళ్లుగా అందని స్పోర్ట్స్ మెటీరియల్
- కోల్ఇండియా వెళ్లినా ఇప్పటికీ కనీసం యూనిఫాం కరువు

- వివరాలు 10లో ▶



ఖాళీ పోస్టుల వివరాలు

సూపర్‌వైజర్	24
అంగన్‌వాడీ టీచర్	78
ఆయాలు	162
మినీ అంగన్‌వాడీ టీచర్	40

పర్యవేక్షణ ఎలా?

ఐసీడీఎస్‌లో ఖాళీల జాతర

- సగానికి పైగా ముఖ్య పోస్టుల ఖాళీ
- 39 సెక్టార్లలో 15 మందే సూపర్‌వైజర్లు
- వీరికే 24 సెక్టార్ల ఇన్‌చార్జి బాధ్యతలు
- కొరవడుతున్న పర్యవేక్షణ
- పోస్టుల భర్తీలో తీవ్ర జాప్యం

తాండూర్(బెల్లంపల్లి): సమగ్ర శిశు అభివృద్ధి పథకం (ఐసీడీఎస్)లో ఖాళీ పోస్టులు దీర్ఘకాలంగా భర్తీకి నోచుకోవడం లేదు. దీంతో ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న సిబ్బందిపై అదనపు భారం పడుతోంది. ఫలితంగా ఐసీడీఎస్ పథకాల అమలు తీరుపై ప్రభావం చూపుతోంది. జిల్లాలో బెల్లంపల్లి, మంచిర్యాల, లక్సెట్టిపేట్, చెన్నూర్ ప్రాజెక్టులు ఉన్నాయి. వీటి పరిధిలో 18 మండలాల్లో 897 అంగన్‌వాడీ కేంద్రాలు, 73 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు పని చేస్తున్నాయి. కాగా.. జిల్లాలో 24 సూపర్‌వైజర్, 78 అంగన్‌వాడీ టీచర్, 162 ఆయా, 40 మినీ అంగన్‌వాడీ టీచర్ పోస్టులు ఖాళీలున్నాయి. పథకం లక్ష్యం నెరవేరాలంటే ఎప్పటికప్పుడు ఖాళీ పోస్టుల భర్తీ చేపట్టాల్సి ఉండగా ఆ దిశగా చర్యలు కానరావడం లేదు. పోస్టుల భర్తీలో అధికార యంత్రాంగం పట్టింపులేని ధోరణితో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొత్త ప్రభుత్వం ఏర్పడి మూడున్నర సంవత్సరాలు గడిచిపోయినా ఐసీడీఎస్ పోస్టుల భర్తీకి

- మిగతా 2లో ▶

ఐసీడీఎస్ ప్రాజెక్టు పేరు	సూపర్‌వైజర్ పోస్టు			అంగన్‌వాడీ టీచర్ పోస్టులు			ఆయా పోస్టులు			మినీ అంగన్‌వాడీ పోస్టులు		
	మంజూరు	భర్తీ	ఖాళీలు	మంజూరు	భర్తీ	ఖాళీలు	మంజూరు	భర్తీ	ఖాళీలు	మంజూరు	భర్తీ	ఖాళీలు
మంచిర్యాల	10	05	05	238	218	20	238	187	51	05	03	02
లక్సెట్టి పేట	18	01	07	178	166	12	178	149	29	25	10	15
చెన్నూర్	10	05	05	218	187	31	218	177	41	27	14	13
బెల్లంపల్లి	11	04	07	263	248	15	263	222	41	16	06	10
మొత్తం	39	15	24	897	818	78	897	735	162	73	33	40

పర్యవేక్షణ ఎలా?

▶మొదటిపేజీ తరువాయి

నోటిఫికేషన్ జారీ కాకపోవడంతో అసంతృప్తి పెల్లుబికుతోంది. ఇంకెన్నాళ్లకు పోస్టులు భర్తీ అవుతాయో తేలకుండా ఉంది.

కొరవడుతున్న పర్యవేక్షణ

ఖాళీల కొరత సిబ్బందిని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. సగానికి పైగా సూపర్‌వైజర్ పోస్టులు ఖాళీగా ఉండటంతో క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కొరవడుతోంది. జిల్లాలోని 39 సెక్టార్లలో కేవలం 15 మంది సూపర్‌వైజర్లే విధులు నిర్వహిస్తున్నారు. వీరికే మిగతా 24 సెక్టార్ల ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడంతో పనిభారం పెరిగి సతమతం అమవుతున్నారు. లక్సెట్టిపేట్ ప్రాజెక్టులో ఒక్క సూపర్‌వైజరే ప్రాజెక్టు మొత్తాన్ని పర్యవేక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. ఒక్కొక్కరికి రెండు నుంచి మూడు సెక్టార్ల బాధ్యతలు కేటాయించడంతో వారు అంగన్‌వాడీ కేంద్రాలపై పూర్తిస్థాయిలో దృష్టి సారించలేకపోతున్నారు. దీంతో కొన్నిచోట్ల పథకం లక్ష్యం అనుకున్న మేర సత్ఫలితాలను ఇవ్వలేకపోతుంది.

నెలరోజుల్లో భర్తీ ప్రక్రియ చేపడతాం

సూపర్‌వైజర్ పోస్టుల భర్తీ టీఎస్‌పీఎస్సీ ద్వారా జరగాల్సి ఉంది. జిల్లా పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల పోస్టులను మరో నెలరోజుల్లో భర్తీ చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందిన వెంటనే నోటిఫికేషన్ జారీ చేస్తాం.

– రవూఫ్‌ఖాన్, జిల్లా సంక్షేమ అధికారి

రెట్టింపవుతున్న పనిభారం...

జిల్లావ్యాప్తంగా అంగన్‌వాడీ టీచర్లు, ఆయా పోస్టులు భర్తీకి నోచుకోకపోవడంతో సిబ్బందిపై పనిభారం రెట్టింపవుతోంది. అంగన్‌వాడీ ఆయా పోస్టులను భర్తీ చేయకపోవడంతో టీచర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు పలు సర్వేలు, అదనపు ప్రభుత్వ పనులతో వారు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. టీచర్ పోస్టులు ఖాళీ ఉన్న కేంద్రాలను పక్కనే ఉన్న అంగన్‌వాడీ టీచర్లకు ఇన్‌చార్జి విధులు అప్పగిస్తుండటంతో వారిపై పనిభారం పెరుగుతోంది.

భర్తీ కోసం ఎదురుచూపులు

అంగన్‌వాడీలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ ఎప్పుడు జరుగుతుందనే ఎదురుచూసే ఆశావాహుల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతోంది. గతంలో అంగన్‌వాడీ ఉద్యోగం అంటే తక్కువ జీతం, చిన్నచూపు ఉండేది. పెరిగిన జీతాలు, సమాజంలో వచ్చిన మార్పులతో ఈ పోస్టులకు పోటీ తీవ్రంగా పెరిగింది. గ్రామాల్లో అంగన్‌వాడీ టీచర్ల ఉద్యోగాల భర్తీ నోటిఫికేషన్ కోసం ఎందరో మహిళలు ఎదురుచూస్తున్నారు. ఐసీడీఎస్ పరిధిలో మరిన్ని నూతన పథకాలను అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమాయాత్తం అవుతున్న తరుణంలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ ప్రక్రియను చేపడితేనే పథకాల అమలు సఫలీకృతం అవుతుంది.

రేపే ‘సాక్షి’ ముగ్గుల పోటీలు

మంచిర్యాలటౌన్: సాక్షి మీడియా ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీ ఆదివారం మంచిర్యాల పట్టణంలోని ఫైర్‌స్టేషన్ సమీపంలో గల సెవెన్‌హిల్స్ హైస్కూల్‌లో సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా సంస్కృతి సంప్రదాయాలను మేళవించేలా ప్రతీ సంవత్సరం సాక్షి మీడియా యాజమాన్యం ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలను నిర్వహిస్తోంది. ఈసారి పోటీలో ప్రథమ బహుమతి రూ.5వేలు, ద్వితీయ బహుమతి రూ.3వేలు, తృతీయ బహుమతి రూ.2వేలు, 5 కన్సోలేషన్ బహుమతులతో పాటు పోటీలో పాల్గొనే మహిళలందరికీ బహుమతులు అందజేస్తారు. ముగ్గుల పోటీల్లో పాల్గొనేవారు ఆదివారం ఉదయం 9 గంటలలోపు వేదిక వద్దకు చేరుకుని పేర్లు నమోదు చేసుకోవాలి. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు ముగ్గుల పోటీలు జరుగుతాయి. వివరాలకు 9010299065, 9951602823 నంబర్లలో సంప్రదించాలి.

టమాట ధర ఢమాల్

▶మొదటిపేజీ తరువాయి

ఇస్తున్నారు. ఇలా రోజురోజుకు పతనం అవుతున్న ధరతో టమాట రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. టమాట సాగుకు చేసిన రైతులు పెట్టుబడి సైతం వెళ్లడం లేదని ఆవేదన చెందుతున్నారు. జిల్లాలో స్టోరేజీ సౌకర్యం లేక తక్కువ ధరకే అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు.

3,250 హెక్టార్లలో సాగు..

జిల్లాలో ఖరీఫ్‌లో టమాట సాగు తక్కువగా ఉండటంతో మార్కెట్ అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తి లేకుండా పోయింది. కూరగాయల వ్యాపారులు గత నెల వరకు ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకున్నారు. మార్కెట్‌లో టమాట కొరత, డిమాండ్ ఉండటం, రవాణా చార్జీలతో ధర కూడా ఎక్కువగా పలికింది. జిల్లాలో యాసంగి సీజన్‌లో 3,250 హెక్టార్లలో టమాట సాగు చేస్తున్నారు. ఎక్కువగా నెన్నెల, భీమిని, కన్నెపెల్లి, కోటపల్లి, వేమనపల్లి, తాండూర్, బెల్లంపల్లి, చెన్నూర్, హాజీపూర్, దండేపెల్లి, జన్నారం మండలాల్లో టమాట సాగవుతోంది. డిసెంబర్ రెండవ వారం నుంచి దిగుబడి వస్తోంది. డిసెంబర్, జనవరి మాసాల్లో జిల్లాలో మంచు కురుస్తుండటం, కనిష్ట ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల లోపే నమోదు అవుతుండటంతో దిగుబడి ఎక్కువగా వస్తోంది.

పడిపోయిన ధర

ఈ సీజన్‌లో దిగుబడి అధికంగా రావడంతో ఇదే అదునుగా కమీషన్ ఏజెంట్లు ధరలు తగ్గించారు. ఏటా టమాట సాగు చేసిన రైతులు దిగుబడి వచ్చిన సమయంలో ధర రాక ఇదే దుస్థితి నెలకొంటోంది. జిల్లాలోని మంచిర్యాల, బెల్లంపల్లి, మందమర్రి, లక్సెట్టిపేట్, చెన్నూర్ కూరగాయల మార్కెట్లకు రోజుకు 8 నుంచి 10 టన్నుల వరకు టమాట వస్తోంది. సాయంత్రం వరకు అమ్మగా మిగిలిన వాటిని రోడ్డున పారేసి వెళ్లిపోతున్నారు. టమాట సాగు ఎకరానికి విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, కూలీల ఖర్చులు కలుపుకొని రూ.20 వేల వరకు పెట్టుబడి అవుతుంది. తీరా చేతికొచ్చిన దిగుబడి అమ్మితే పెట్టుబడులు కూడా రావడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. దూర ప్రాంతాల నుంచి మార్కెట్‌కు వచ్చే వారికి రవాణా ఖర్చులు సైతం వెళ్లడం లేదని వాపోతున్నారు.

స్టోరేజీ సౌకర్యం కల్పించాలి..



మార్కెట్‌కు తీసుకవచ్చిన టమాటకు గిట్టుబాటు ధరలేనప్పుడు నిల్వ చేసుకునేందుకు కోల్డ్ స్టోరేజీ సౌకర్యం లేదు. దీంతో మిగిలిన టమాటలను పడేయాల్సి వస్తుంది. ప్రభుత్వం కోల్డ్ స్టోరేజీ సౌకర్యం కల్పిస్తే బాగుంటుంది. మార్కెట్‌కు రావడానికి ఆటో చార్జి రూ.400 అవుతుంది. ప్రస్తుత ధరతో రానుపోను ఖర్చులు కూడా రావడం లేదు.

– గురుడ్ల సత్యనారాయణ, కన్నెపెల్లి

వడ్డీ..వర్రీ

▶మొదటిపేజీ తరువాయి

స్వయం ఉపాధి పథకాలు స్థాపించేలా ప్రభుత్వం రుణాలు మంజూరు చేస్తుంది. ఈ రుణాలను వడ్డీతో సహా తిరిగి చెల్లించాలి. ఇలా సక్రమంగా చెల్లించిన సంఘాలకు ప్రభుత్వం వడ్డీని రీయింబర్స్ చేస్తుంది. ఇప్పటివరకు గత రెండేళ్లుగా మహిళా సంఘాలకు రూ.206 కోట్లను రుణాలుగా అందించారు. ఇందులో 9వేల మంది లబ్ధిపొంది, ప్రతినెలా వాయిదాలు, వడ్డీని బ్యాంకులకు చెల్లిస్తున్నారు. అయితే 2016 ఫిబ్రవరి నుంచి ఇప్పటివరకు మహిళలకు వడ్డీని ప్రభుత్వం చెల్లించలేదు. రుణాలను తాము సక్రమంగా చెల్లించినా వడ్డీ తిరిగి ఇవ్వకపోవడంతో మహిళలు నిరాశ చెందుతున్నారు. ప్రతీ మూడు నెలలకోసారి మహిళలు కట్టిన వడ్డీని ప్రభుత్వం మళ్లీ అకౌంట్లలో జమ చేయాల్సి ఉన్నా చేయకపోవడం గమనార్హం.

బ్యాంకర్లు, ప్రభుత్వం తీరుతో ఇబ్బందులు

మహిళలు తీసుకున్న రుణానికి ఎలాంటి వడ్డీ లేకుండానే తిరిగి చెల్లించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు ఉన్నాయి. కానీ రూ.1.50 వడ్డీని కట్టాలని బ్యాంకర్లు ఒత్తిడి తెస్తున్నారు. ప్రభుత్వం రీయింబర్స్ చేస్తుందో లేదోనన్న అనుమానంతో బ్యాంకర్లు వడ్డీ కట్టించుకుంటున్నారు. దీంతో మహిళలు వడ్డీ చెల్లిస్తుండగా, బ్యాంకర్లు అనుమానించినట్లుగానే ప్రభుత్వం తిరిగి ఇవ్వడం లేదు. ఇలా ప్రభుత్వం, బ్యాకంర్ల నడుమ సంఘాల సభ్యులు నలిగిపోతున్నారు. ఇక కొందరు సభ్యులు వడ్డీ కట్టలేక అసలు కూడా చెల్లించలేని పరిస్థితి నెలకొంటోంది.

నెలనెలా కట్టినా ఇస్తలేరు



మేము గ్రూపు తరుపున రూ.3 లక్షల రుణం తీసుకుని, ప్రతి నెలా వడ్డీతో పాటు, నెల కిస్తీని కట్టేశాం. అయితే ప్రభుత్వం మాకు వడ్డీని బ్యాంకు ఖాతాల్లో వేస్తానని చెబుతున్నా, రెండేళ్లుగా మాకు వడ్డీ వచ్చింది లేదు. ఇప్పటికే మేము తీసుకున్న రుణం సైతం పూర్తిగా చెల్లించినం. కానీ వడ్డీ రాకపోవడంతో ఇక మాకు వడ్డీ లేని రుణాలను ప్రభుత్వం ఇస్తున్నట్లు చెబుతున్నా ఇవ్వనట్లే అయ్యింది. మాకు రావాల్సిన వడ్డీని మా ఖాతాల్లో జమచేయాలి.

– సంపూర్ణ, కవ్వాల్, జన్నారం మండలం

ప్రభుత్వమే విడుదల చేయాలి

వడ్డీలేని రుణాల మంజూరు, తిరిగి వడ్డీని చెల్లించే ప్రక్రియ అంతా ప్రభుత్వం చేతుల్లోనే ఉంది. మహిళా సంఘాలకు వడ్డీ చెల్లింపులు పెండింగ్‌లో ఉన్నమాట వాస్తవమే. ఎంత వడ్డీ రావాలనే వివరాలను ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు నివేదిస్తున్నాం. మరోసారి ఉన్నతాధికారులకు నివేదించి త్వరలోనే అందేలా చర్యలు తీసుకుంటాం. **– శంకర్, డీఆర్డీవో**

వడ్డీ తిరిగి రావడం లేదు..



మేం డ్వాక్ర గ్రూపులో రుణం తీసుకున్నాం. గ్రూపు తరుపున రూ.2 లక్షల రుణం తీసుకుని, ప్రతి నెల క్రమం తప్పకుండా గ్రూపు సభ్యులందరం వడ్డీతో సహా అప్పు చెల్లిస్తున్నాం. ప్రభుత్వం వడ్డీ డబ్బులను మా ఖాతాల్లో జమ చేయడం లేదు. ఇప్పటికీ రెండు సంవత్సరాలు అవుతుంది. మాకు వడ్డీని అందించకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం.

– ఎ.శారద, ఎస్‌ఎస్‌జీ సభ్యురాలు, దండేపల్లి,

మార్చి 8న సామూహిక వివాహాలు



మాట్లాడుతున్న గురిజాల రాధాకిషన్‌రావు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణంలో అర్చన టెక్స్ గ్రూప్ అధినేత గురిజాల రాధాకిషన్‌రావు ఏర్పాటు చేసిన గురిజాల ట్రస్ట్ ఆధ్వర్యంలో మార్చి 8వ తేదీన సామూహిక వివాహాలను నిర్వహిస్తున్నట్లు ట్రస్టు సభ్యులు శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. అమ్మాయికి 18, అబ్బాయికి 21 ఏళ్లు దాటి, ఆధార్‌కార్డు, రేషన్ కార్డులతో తమను ఫిబ్రవరి 20వ తేదీలోగా పట్టణంలోని మార్కెట్‌రోడ్డులో గల అర్చన టెక్స్ షాపింగ్‌మాల్‌లో సంప్రదించాలని కోరారు. ట్రస్టు తరుపున 25 జంటలకు మార్చి 8వ తేదీన ఉదయం 11:15 గంటలకు సామూహిక వివాహాలను చేస్తామని, జంటలకు బంగారు పుస్తెలు, వెండి మట్టెలు, వరునికి పెళ్లి బట్టలు, 1 జత బట్టలు, వధువుకు పెళ్లి బట్టలు, ఇరువురి తరుపున బంధువులకు 40 మందికి భోజనాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు శేఖర్, మధుసూదన్‌రావు, గురిజాల రవీందర్‌రావు పాల్గొన్నారు.

8న పోలీస్ వాహనాల విడిభాగాల వేలం

మంచిర్యాలక్రైం: రామగుండం కమిషనరేట్ పరిధిలోని పోలీస్ స్టేషన్లకు సంబంధించి వాహనాల పాత విడిభాగాలను వేలం వేయనున్నట్లు రామగుండం కమిషనర్ విక్రంజిత్ దుగ్గల్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 164 వాహనాలకు సంబంధించిన పాత టైర్లు, ట్యూబులు, బ్యాటరీలతో పాటు వాహనాల విడి భాగాలను ఈనెల 8వ తేదీన పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో వేలం వేయనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల వ్యాపారులు పాల్గొనాలని సూచించారు.

ద్విచక్ర వాహనాలు ఢీ: ఒకరు మృతి

ఇద్దరికి తీవ్ర గాయాలు

కుభీర్(ముథోల్): మండలంలోని రంజిని వద్ద శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. పల్సి గ్రామానికి చెందిన శీలేవార్ దేవన్న(60), శీలేవార్ రాజేందర్(17) రంజిని గ్రామం వద్ద ఉన్న పీర్ల పండుగలో పాల్గొని ద్విచక్రవాహనంపై గ్రామానికి తిరిగి వస్తుండగా పల్సి వైపు నుంచి రంజిని వైపు మోటార్ సైకిల్‌పై వస్తున్న దర్బ్లి సాయినాథ్ వాహనాన్ని ఢీకొన్నారు. ఘటనలో దేవన్న అక్కడికక్కడే మృతి చెందగా తీవ్రగాయాలైన శీలేవార్ రాజేందర్, దర్బ్లి సాయినాథ్‌లను భైంసా ఆసుపత్రికి తరలించగా వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్ ఆసుపత్రికి తరలించారు. మృతుని కుమారుడు గజ్జారాం ఇచ్చిన ఫిర్యాదు మెరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై కె రమేష్ తెలిపారు. అతనికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు.



శీలేవార్ దేవన్న మృతదేహం



గాయపడ్డ రాజేందర్, సాయినాథ్

11ఇసుక ట్రాక్టర్లు సీజ్



ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేస్తున్న తహసీల్దార్

బేల(ఆదిలాబాద్): మండలంలోని సాంగిడి, కాంఫ్రర్‌పూర్ రెవెన్యూ గ్రామాల శివారుల్లోని పెన్‌గంగ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న 11ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు తహసీల్దార్ నందకిశోర్ సింగ్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు శుక్రవారం సాంగిడి, దహెగాం రింగ్ రోడ్డు మార్గంలో నిర్వహించిన ఈ దాడిలో ఈ ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని సీజ్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఒక్కోట్రాక్టర్‌కు రూ.5వేల చొప్పున జరిమానా వేస్తామని, మరోసారి ఈ ట్రాక్టర్లే పట్టుబడితే సంబంధిత వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రాందాస్, వీఆర్వో వామన్, పాల్గొన్నారు.

168 మద్యం సీసాల పట్టివేత



పట్టుకున్న మద్యం సీసాలతో తహసీల్దార్

బేల(ఆదిలాబాద్): మండలంలోని శంకర్‌గూడ, ఉపశ్నాల గ్రామాల మధ్యలో అంతర్రాష్ట్ర రహదారికి పక్కన ఉన్న బెల్టుషాపులలో శుక్రవారం అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా 168మద్యం సీసాలను తహసీల్దార్ నందకిశోర్ సింగ్ పట్టుకున్నారు. ఛీప్ లిక్కర్ క్వాటర్లు 118, బీర్ క్వాటర్లు 50 ఉన్నాయని ఆయన తెలిపారు. వాటి విలువ సుమారు రూ.15వేలు ఉంటుందని ఆయన పేర్కొన్నారు. మద్యం సీసాలతో పాటు, విక్రయిస్తున్న గేడాం అర్జున్, మోరేశ్వర్‌ల వివరాలను ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్‌కు అప్పగించినట్లు ఆయన తెలిపారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు



నిందితున్ని చూపెడుతున్న అధికారులు

ఆదిలాబాద్: పట్టణంలోని ఖుర్షీద్‌నగర్ కాలనీలో శుక్రవారం గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు నిర్వహించిన తనిఖీలో నజర్ అలీ ఒక సంచితో పారిపోతుండగా పట్టుకున్నామన్నారు. ఒక కిలో పొడి గంజాయిని స్వాధీనం చేసుకొని నజర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సై రాజేశ్వర్, సిబ్బంది బాపురావు, రవీందర్, ఈశ్వర్, రాములు ఉన్నారు.

హత్యకేసులో వ్యక్తికి జీవిత ఖైదు

ఆదిలాబాద్/కాగజ్‌నగర్: హత్య కేసులో నేరస్తుడికి జీవితఖైదు విధిస్తూ ఎస్సీ, ఎస్టీ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి జీవీఎన్ భరతలక్ష్మి శుక్రవారం తీర్పు వెల్లడించారు. కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన మహత్మ కార్తీక్‌ను అదే పట్టణానికి చెందిన శంషీర్‌ఖాన్ తన చెల్లిని ప్రేమిస్తున్నాడని కసి పెంచుకుని 2014 ఫిబ్రవరి 20న కొబ్బరి బొండాలు నరికే కత్తితో దాడి చేసి హత్యకు పాల్పడ్డాడు. కార్తీక్ తండ్రి ఫిర్యాదు మేరకు అప్పటి సీఐ రవికుమార్ ఎఫ్ఐఆర్ జారీ చేయగా, డీఎస్పీ సురేష్‌బాబు దర్యాప్తు చేసి చార్జీషీటు దాఖలు చేశారు. ఈ కేసులో అడిషనల్ పీపీ మల్లిఖార్జున్ కోర్టులో 21 మంది సాక్షులను ప్రవేశపెట్టి విచారించగా నేరం రుజువైంది. దీంతో న్యాయమూర్తి నేరస్థుడికి జీవిత ఖైదుతో పాటు రూ. 5 వేల జరిమాన విధిస్తూ తీర్పు వెల్లడించారని లైజన్ అధికారి వెంకటరావు తెలిపారు.

అగ్ని ప్రమాదంలో పత్తి దగ్ధం

రెబ్బెన(ఆసిఫాబాద్): మండలంలోని తుంగెడలో గురువారం రాత్రి ప్రమాదవశాత్తు జరిగిన అగ్నిప్రమాదంలో ఇంట్లో నిల్వ ఉంచిన పత్తి దగ్ధమైంది. గ్రామానికి చెందిన మానెం సాంబయ్య ఇతరుల భూములను కౌలుకు తీసుకుని పత్తిసాగు చేయగా వచ్చిన సుమారు 100 క్వింటాళ్ల పత్తిని ఇంట్లో నిల్వ ఉంచాడు. గురువారం రాత్రి గ్యాస్‌పొయ్యిపై వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు నిప్పు రవ్వలు లేచి పక్కనే నిల్వ ఉంచిన పత్తిపై పడటంతో మంటలు చెలరేగాయి. వెంటనే ఆసిఫాబాద్ ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించి చుట్టు పక్కల నివాసం ఉండే స్థానికుల సహాయంతో మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. ఫైర్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను పూర్తిగా ఆదుపు చేశారు. ప్రమాదంలో సుమారు రూ.70 వేల విలువైన పత్తి దగ్ధం కాగా సుమారు రూ. 2లక్షల విలువైన పత్తిని కాపాడినట్లు ఫైర్ ఆఫీసర్ రవీందర్‌రెడ్డి తెలిపారు. లీడింగ్ ఫైర్‌మెన్ విజయ్‌కుమార్, ఫైర్‌మెన్ నాగరాజు, రవికుమార్, డ్రైవర్ రమేష్ ఉన్నారు.

మట్కా జూదరుల అరెస్టు

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని ఓ మట్కా స్థావరంపై శుక్రవారం దాడి చేసి జూదరులను అరెస్ట్ చేసినట్లు పట్టణ సీఐ జాన్‌దివాకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన వివరాలను వెల్లడించారు. జిల్లా కేంద్రంలోని ఏఎన్‌రెడ్డి కాలనీ శివారులో మట్కా జూదం ఆడుతున్నారన్న సమాచారం తెలుసుకున్న ఎస్సై బాలకృష్ణ, సిబ్బందితో కలిసి అక్కడికి వెళ్లి ముగ్గురు జూదరులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. భైంసాకు చెందిన హీరాలాల్, నిర్మల్‌కు చెందిన గంగాధర్, ప్రకాష్‌లను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి ఒక మారుతి కారు, బైక్, మూడు సెల్‌ఫోన్లు, రూ.42,500 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

రూ.20లక్షల ఫెస్టిసైడ్స్ సీజ్



గోడౌన్‌లో తనిఖీ చేస్తున్న జేడీఏ ఆశ కుమారి

ఆదిలాబాద్‌రూరల్: మావల గ్రామ పంచాయతీ పరిధిలోని ఇండస్ట్రీ ఏరియాలో ఉన్న ఓ జిన్నింగ్ మిల్లులో అనుమతి లేకుండా క్రిమిసంహారక మందులు మార్కెటింగ్ చేస్తున్న ఫెస్టిసైడ్స్‌ను శుక్రవారం వ్యవసాయశాఖ అధికారులు సీజ్ చేశారు. సంఘటన స్థలాన్ని జేడీఏ ఆశ కుమారి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నర్మద కంపెనీకి చెందిన పురుగుల మందులను కేవలం మార్కెటింగ్ చేసుకోవడానికి అనుమతులు ఉన్నాయని, కానీ నిబంధనలకు విరుద్ధంగా చేస్తున్నారని తమకు సమాచారం అందడంతో దాడులు చేసి మందులను సీజ్ చేశామన్నారు. సీజ్ చేసిన మందుల విలువ సుమారు రూ.20 లక్షల వరకు ఉంటుందన్నారు. ఈ దాడుల్లో ఏడీఏ పుల్లయ్య, ఆదిలాబాద్ అర్బన్, రూరల్, మావల ఏవోలు రమేష్, అష్రఫ్, సంధ్యారాణి, వ్యవసాయ శాఖ సిబ్బంది రమేష్, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య



లక్ష్మి మృతదేహం

మామడ(నిర్మల్): మండలంలోని పొన్కల్ గ్రామానికి చెందిన గొనుగొప్పుల లక్ష్మి(32) శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఏఎస్సై నర్సయ్య తెలిపారు. లక్ష్మి భర్త నారాయణ ఉపాధి నిమిత్తం అప్పులుచేసి గల్ఫ్ దేశాలకు వెళ్లాడు. అక్కడ ఉపాధి దొరకకపోవడంతో ఇటీవలే స్వగ్రామం తిరిగివచ్చాడు. దీంతో చేసిన అప్పులు తీర్చేది ఎలానని మనస్తాపం చెందిన లక్ష్మి శుక్రవారం ఇంట్లోనే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు నిర్మల్ పట్టణంలోని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మహిళకు భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఏఎస్సై నర్సయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాయమైన పులిచర్మం!

- కొనసాగుతున్న ఉన్నతాధికారుల విచారణ

బెజ్జూర్(సిర్పూర్): కాగజ్‌నగర్ ఫారెస్టు డివిజన్‌లోని బెజ్జూర్ రేంజ్ కార్యాలయంలో గత సంవత్సరం భద్రపర్చిన పులిచర్మం మాయమైన ఉదంతంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 2016 నవంబర్ 21న మహారాష్ట్ర నుంచి బెజ్జూర్ రేంజి పరిధి మీదుగా ద్విచక్రవాహనంపై పులి చర్మాన్ని తరలిస్తున్నట్లు సమాచారం అందుకున్న ఎఫ్ఆర్వో రాంమోహన్ తమ సిబ్బందితో వెళ్ళి పట్టుకుని కోర్టులో హాజరు పర్చగా, న్యాయమూర్తి పులి చర్మాన్ని భద్రపర్చాలని రేంజ్ అధికారిని ఆదేశించింది. ఈ మేరకు ఆ పులి చర్మాన్ని సెక్షన్ అధికారికి అప్పగించగా ఆయన బీట్ అధికారి రవీందర్‌కు అప్పగించిన్నట్లు తెలుస్తోంది. అయితే సెక్షన్ అధికారి వేణుగోపాల్ విధులకు దూరంగా ఉండటంతో బెజ్జూర్ సెక్షన్ బాధ్యతలను మరొకరికి అప్పగించే సమయంలో ఈ విషయం వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ విషయంపై శుక్రవారం బెజ్జూర్ సెక్షన్ అధికారి రాంమోహన్‌ను ఫోన్‌లో సంప్రదించేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు. కాగజ్‌నగర్ డీఎఫ్‌వో నర్సింహారెడ్డిని సంప్రదించగా పులి చర్మాన్ని గుర్తించడానికి బెజ్జూర్ రేంజి క్యాంపస్‌లో దర్యాప్తు కొనసాగుతోందని, త్వరలోనే విషయం తెలుస్తామని ఆయన స్పష్టం చేశారు.

ఆస్పత్రి ఎదుట బ్యాగుల క్యూ



క్యూలో బ్యాగులతో మెడికల్ రిప్రజెంటివ్‌లు

మంచిర్యాల పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి ఎదుట మెడికల్ రిప్రజెంటివ్‌లు ఇలా బ్యాగులతో క్యూలో నిలబడ్డారు. శుక్రవారం ఈదృశ్యాన్ని సాక్షి తన కెమెరాలో క్లిక్ మనిపించింది.

- గెల్లు నర్సయ్య, మంచిర్యాల సాక్షి ఫొటోగ్రాఫర్

శనివారం । జనవరి । 6 । 2018 సాక్షి

వాతావరణం

రానున్న 24 గంటల్లో పంజాబ్ నుంచి పశ్చిమబెంగాల్ మధ్య ప్రాంతాల్లో దట్టమైన పొగమంచు కమ్ముకుని ఉంటుంది. అండమాన్, నికోబార్ దీవుల్లో మోస్తరు వర్షం కురుస్తుంది. కేరళలో చెదురుమదురు వాన పడే అవకాశం ఉంది. రాజస్తాన్, మధ్యప్రదేశ్‌లలో చల్లని ఈదురు గాలు వీసే అవకాశం ఉంది.

గుంటూరు ఆదిలాబాద్ వాతావరణం వాతావరణం

గరిష్టం కనిష్టం

30.0°/06.2°

జాతీయం

నగరం	గరిష్ట	కనిష్ట
ఢిల్లీ	18.1	07.2
కోల్‌కతా	22.3	11.1
బెంగళూరు	27.2	15.5
ముంబై	29.6	16.8
చెన్నై	29.5	20.5

పట్టణ వాతావరణం

పట్టణం/జిల్లా	గరిష్ట/ కనిష్ట	పట్టణం/జిల్లా	గరిష్ట/ కనిష్ట
ఒంగోలు	31.3/20.1	తిరుపతి	29.9/14.2
కర్నూలు	31.2/18.1	విజయవాడ	29.7/17.0
మహబూబ్‌నగర్	31.2/16.6	ఏలూరు	29.6/19.0
కడప	31.1/15.5	రాజమండ్రి	29.6/19.0
ఖమ్మం	31.0/10.4	తాడేపల్లిగూడెం	29.6/19.0
ఆదిలాబాద్	31.0/06.0	నల్లగొండ	29.6/15.2
అనంతపురం	30.7/16.2	కరీంనగర్	29.6/10.7
నెల్లూరు	30.6/20.8	హైదరాబాద్	29.4/13.3
నిజామాబాద్	30.5/15.5	రంగారెడ్డి	29.4/13.3
మెదక్	30.5/11.0	కాకినాడ	29.0/18.4
వరంగల్	30.2/14.0	విశాఖపట్నం	28.2/19.2
గుంటూరు	30.0/16.2	శ్రీకాకుళం	27.7/15.5
చిత్తూరు	29.9/14.2	విజయనగరం	27.7/15.5


బుల్లితెర www.sakshi.com

SAKSHI TV

ఉ. 07.00 గంటల నుండి ప్రతి గంటకు సాక్షి న్యూస్ బులెటిన్

ఉ.06.30 గుడ్ మార్నింగ్
ఉ.07.30 కేఎస్ఆర్ లైవ్ షో
ఉ.08.00 న్యూస్ ఫీచర్
ఉ.08.30 రీజనల్ న్యూస్
ఉ.09.30 మ్యాగజీన్ స్టోరీ
ఉ.10.30 న్యూస్ ఫీచర్
ఉ.11.30 పొలిటికల్ కారిడార్
మ.12.00 మూవీ మ్యాటర్స్
సా.04.30 మార్గం
సా.05.00 స్పీడ్ న్యూస్
సా.05.30 ఉర్దూ న్యూస్
సా.06.00 రీజనల్ న్యూస్
రా.08.00 సాక్షి న్యూస్
రా.08.30 బతుకు చిత్రం
రా.09.00 న్యూస్ 360
రా.09.30 జ్యూక్ బాక్స్
రా.10.30 మూవీ మ్యాటర్స్

టీవీలో ఈరోజు సినిమాలు




జెమిని మూవీస్
ఉ.07.00 సిరి సిరి మువ్వ
ఉ.09.30 సీతాకోకచిలుక
మ.12.00 రణధీర
సా.06.00 పెళ్లాంతో పనేంటి
రా.09.00 అదృష్టం




మూవీస్ నౌ
ఉ.10.20 శాన్ ఆండ్రియాస్
మ.12.35 క్యాసినో రాయల్
మ.03.30 ద యాక్సిడెంటల్ స్పై
సా.05.15 ఎపిక్ మూవీ
రా.09.00 జర్నీ 2



హెచ్‌బీవో
ఉ.07.28 ఆల్మోస్ట్ హీరోస్
ఉ.10.41 కొల్లాటరల్ బ్యూటీ
మ.12.27 ద డార్క్ నైట్ రైజెస్
సా.05.16 పుస్ ఇన్ బూట్స్
రా.09.00 ద కంజ్యూరింగ్



స్టార్ మూవీస్
ఉ.06.08 హోటల్ ట్రాన్సిల్వేనియా
ఉ.07.55 బేబీస్ డే ఔట్
మ.01.52 డాక్టర్ స్ట్రేంజ్
సా.04.11 చైనీస్ జోడియాక్
రా.09.00 థోర్ 2: ద డార్క్ వరల్డ్



మా మూవీస్
ఉ.09.30 దడ
మ.12.00 సాహసం
మ.03.00 రక్షణ
సా.06.00 మన్మధుడు
రా.09.00 ఊకొడతారా ఉలిక్కిపడతారా



జీ సినిమా
ఉ.04.45 బాంబే టు బ్యాంకాక్
ఉ.08.14 శివలింగ
ఉ.11.08 తారే జమీన్ పర్
మ.02.28 బాఘీ
రా.11.44 ఖేల్ పవర్ కా

తిరుమల సమాచారం

తిరుమలలో శుక్రవారం భక్తుల రద్దీ మోస్తరుగా ఉంది. దర్శనం కోసం భక్తులు వేచి ఉండే వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో 15 కంపార్ట్‌మెంట్లు నిండాయి.

సాయంత్రం 6 గంటలకు అందిన సమాచారం :

గదుల వివరాలు:

ఉచిత గదులు	–	ఖాళీ లేవు
రూ.50 గదులు	–	ఖాళీ లేవు
రూ.100 గదులు	–	ఖాళీ లేవు
రూ.500 గదులు	–	ఖాళీ లేవు

సేవలు

సహస్ర దీపాలంకరణ	–	ఖాళీ లేవు
వసంతోత్సవం	–	ఖాళీ లేవు
ఆర్జిత బ్రహ్మోత్సవం	–	ఖాళీ లేవు



బాసర ఆలయ సమాచారం

బాసర : అన్నదానం రోజు 12.30 గంటలకు ప్రారంభం

శ్రీసరస్వతీ అమ్మవారి ఆలయంలో నిత్యపూజలు ..దర్శన వేళలు

ఉదయం : 04.00 దేవాలయం తెరుచుట, 07.30 గం॥ వరకు శ్రీ అమ్మవారి అభిషేకం, అలంకరణ, హారతి, ప్రసాదాల వితరణ 07.30–12.30గం వరకు సర్వదర్శనం

మధ్యాహ్నం: 12గం॥–12,30 గ॥ వరకు నివేదన హారతి, 12.30 నుండి 2 వరకు ద్వారబంధనం, 2 గంటల నుంచి 6 గంటల వరకు సర్వదర్శన, ఇతర పూజలు

సాయంత్రం : 6.30నుంచి ప్రదోషపూజ, 10.30 గంటలకు మహా– హారతి తీర్థప్రసాదం, ద్వారబంధనం, ఇతర పూజలు

అమ్మవారి ఆలయంలో ముఖ్య పండుగలు

శ్రీవ్యాసపౌర్ణమి–దసరా నవరాత్రోత్సవాలు

శ్రీ వసంత పంచమి – మహాశివరాత్రి

ఫోన్ నంబర్లు ....

గదుల కొరకు	08752–255503
ఈవో కార్యాలయం	255550
కార్యనిర్వహణాధికారి	255903
రైల్వేస్టేషన్	255504
పోలీస్ స్టేషన్	255120
వైశ్యసత్రం	255521
బ్రాహ్మణ సత్రం	255522





Padi-Panta

బూడిద గుమ్మడితో అధిక లాభాలు

చెన్నూర్‌రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో పెరటిలో కాసే బూడిద గుమ్మడి కాయలతో ఎన్నో లాభాలు ఉన్నాయి. బూడిద గుమ్మడిలో మంచి ఔషధ గుణాలు కలిగి ఉన్నాయి. కేవలం దిష్టి తీయడానికి బూడిద గుమ్మడి కాయ ఉపయోగ పడుతుందనుకుంటే పొరపాటే.ఎందుకంటే బూడిద గుమ్మడి కాయతో మనకు మొండి రోగాలను సైతం నయం చే సే మంచి ఔషధ గుణం కలదని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడ పడితే అక్కడ బూడిద గుమ్మడి కాయలు కాస్తాయి, కానీ వీటి విలువ తెలియక కొందరు వాటిని అలాగే వదిలేస్తుంటారు. కానీ హైదరాబాద్, ఇతర పట్టణాల్లో గుమ్మడి కాయలకు మంచి గిరాకీ ఉంటుంది. మన ప్రాంతాల నుంచి గుమ్మడి కాయలను తక్కువ ధరలకు కొని తీసుకెళ్లి అక్కడి మార్కెట్‌లో ఎక్కువ ధరలకు అమ్ముతుంటారు.

లివర్ వ్యాధికి..

బూడిద గుమ్మడి కాలేయం వ్యాధులకు మంచిది. దీని వేరును దంచి అర చెంచా పొడిని వేడి నీటితో కలిపి తాగితే ఉబ్బసం వ్యాధి తగ్గడమే కాక, శ్వాస తీసుకోవడం సులభం అవుతుంది.ఊపిరి తిత్తులకి బలాన్ని ఇవ్వడమే కాక రక్త పుష్టిని కలిగిస్తుంది.అమిబియాసిస్ వ్యాధితో బాదపడే రోగులు పేగుల లోపల రాలి పోయే మ్యూకస్ పొరను తిరిగి నిర్మించడంలోనూ బూడిద గుమ్మడి సహాయ పడుతుంది.

అన్నింటికి మంచిది..

ఎసిడిటితో బాధపడుతుంటే కూరల్లో ఎక్కువగా బూడిద గుమ్మడి కాయను ఉపయోగించాలి.బూడిద గుమ్మడి కాయను ప్రతి రోజు ఆహారంలో భాగం చేసుకుంటే మలబద్ధకం నుంచి విముక్తి కలుగుతుంది. స్థూలకాయం, షుగర్ వ్యాధులతో బాధపడుతున్న వారు రోజు గుమ్మడి కాయను వంటలో ఉపయోగించుకోవాలి. దీనిలో కొవ్వు ఉండదు.విటమిన్స్ అధికంగా ఉంటాయి. కిడ్నీల్లో రాళ్లు ఏర్పడితే రాళ్లను తొలగించడంలో బూడిద గుమ్మడి కాయ ఉపయోగ పడుతుంది. బూడిద గుమ్మడిని వేసవిలో కూరగా వండుకొని తింటే శరీరంలో వేడి తగ్గుతుంది.శరీరానికి చలువను చేకూరుస్తుంది. ప్రతి రోజూ బూడిద గుమ్మడి రసాన్ని తీసుకుంటే పేగుల్లో ఉండే రోగాలు నయం అవుతాయి.ఒక టీ స్పూను బూడిద గుమ్మడి రసాన్ని తీసుకొని అదే వంతు ఉసిరిరసం, కొద్దిగా నిమ్మరసం కలిపి సేవిస్తేఅధిక రక్తస్రావం నుంచి విముక్తి కలిగించడమే కాకుండా శరీరానికి మంచి శక్తిని అందిస్తుంది.



పెరటిలో కాసిన బూడిద గుమ్మడి కాయలు

భవిష్యం

మేషం: ముఖ్య నిర్ణయాలలో మార్పులు వచ్చే అవకాశం ఉంది. అనుకోని ఖర్చులు. ఆకస్మిక ప్రయాణాలు. దైవ దర్శనాలు చేసుకుంటారు. వృత్తి, వ్యాపారాలు మందగిస్తాయి.

వృషభం: పనుల్లో స్వల్ప అవరోధాలు. ప్రయాణాలు చేయాల్సి వస్తుంది. ఆరోగ్య భంగం. రుణాలు చేయాల్సి వస్తుంది. వ్యాపారాలు, ఉద్యోగాలలో నిరాశ.



మిథునం: బాకీలు వసూలు అవుతాయి. ఆలయాలు సందర్శిస్తారు. పరిచయాలు పెరుగుతాయి. ఇంటాబయటా అనుకూలం. వ్యాపారవృద్ధి. ఉద్యోగులకు హోదాలు.

కర్కాటకం: కుటుంబ సమస్యలు. ఆస్తి వివాదాలు. ఆలోచనలు స్థిరంగా ఉండవు. ఆలయాలు సందర్శిస్తారు. వృత్తి, వ్యాపారాలలో ఒడిదుడుకులు.

సింహం: అప్రయత్న కార్యసిద్ధి. పోటీపరీక్షల్లో విజయం. ఆప్తుల నుంచి ఆహ్వానాలు. నూతన కార్యక్రమాలకు శ్రీకారం. వృత్తి, వ్యాపారాలలో అనుకూల పరిస్థితులు.

కన్య: కొత్త రుణాలు చేస్తారు. దూర ప్రయాణాలు చేసే అవకాశం ఉంది. ఆరోగ్య భంగం. బంధువులతో మాటపట్టింపులు. వ్యాపారాలు, ఉద్యోగాలలో ఒత్తిళ్లు.

తుల: ఉద్యోగయత్నాలు కలసివస్తాయి. సంఘంలో గౌరవం. కుటుంబంలో శుభకార్యాలు. ఆర్థికాభివృద్ధి. వృత్తి, వ్యాపారాలు సజావుగా కొనసాగుతాయి.

వృశ్చికం: నూతన ఉద్యోగ యోగం. ముఖ్య నిర్ణయాలు. మీ ఆశయాలు నెరవేరతాయి. స్థిరాస్తి లాభం. వ్యాపారులకు ఊహించని లాభాలు. ఉద్యోగులకు ప్రమోషన్లు.

ధనుస్సు: శ్రమకు ఫలితం కనిపించదు. ఉద్యోగ యత్నాలు నిరాశ కలిగిస్తాయి. ముఖ్యమైన పనులు ముందుకు సాగవు. వ్యాపార, ఉద్యోగాలు నిరుత్సాహపరుస్తాయి.

మకరం: బంధువుల నుంచి సమస్యలు. ఆర్థిక ఇబ్బందులు. ప్రయాణాలు వాయిదా వేస్తారు. వ్యాపారాలలో గందరగోళం. ఉద్యోగులకు బాధ్యతలు పెరుగుతాయి.

కుంభం: కొత్త మిత్రులు పరిచయం అవుతారు. శుభవార్తలు అందుతాయి. వ్యవహారాలలో అనుకూలత. సంఘంలో గౌరవం పెరుగుతుంది. వ్యాపార, ఉద్యోగాలలో సమస్యలు అధిగమిస్తారు.

మీనం: విద్యార్థులు శుభవార్తలు అందుకునే అవకాశం ఉంది. వ్యవహార విజయం. ఆహ్వానాలు, గ్రీటింగ్‌లు అందుతాయి. దైవ దర్శనాలు. వ్యాపారాలు, ఉద్యోగాలలో ఉత్సాహవంతంగా ఉంటుంది.

– సింహంభట్ల సుబ్బారావు



హలో సాక్షి..

మంచిర్యాల టౌన్(ఆర్‌సీ)	9010204423
మంచిర్యాల సిటీ	9603505050
మంచిర్యాల క్రైం	9704646937
మంచిర్యాల అర్బన్	9866342353
మంచిర్యాల అగ్రికల్చర్	9985600781
హాజీపూర్	9849248188
శ్రీరాంపూర్	9030777044
నస్పూర్	9177778751
లక్సెట్టిపేట	9849954456
దండేపల్లి	9963306884
జన్నారం	9492132722

నిర్వీరామంగా చాలీసా పారాయణం

ఇంటింటా హనుమాన్ చాలీసా పారాయణం

- నేటితో 108 వారాలు పూర్తి
- వారంలో రెండు రోజులు
- వెల్లివిరుస్తున్న ఆధ్యాత్మికం



చాలీసా పారాయణం చేస్తున్న భక్తులు(ఫైల్)

జన్నారం: మండలంలో హనుమాన్ చాలీసా పారాయణం నిర్వీరామంగా కొనసాగుతుంది. భక్తుల ఆదరణతో నిత్యం ఇంటింటా పారాయణం జరుగుతుంది. మొదట 24 మందితో మొదలైన చాలీసా పారాయణ భక్తుల సంఖ్య ప్రస్తుతం వంద మందికి చేరింది. 2017 జూలై 7 న ప్రారంభమైన చాలీసా పారాయణం నేటితో 108 వారాలు పూర్తి చేసుకోబోతుంది.

గురుస్వామి భూమన్న స్వామి, కస్తూరి నాగేశ్వర్ ఆధ్వర్యంలో హనుమాన్ భక్తులు మొదటగా ఇంటింటా హనుమాన్ చాలీసా పారాయణం ప్రారంభించారు. 2017 జూలై 7న కస్తూరి నాగేశ్వర్ నివాసంలో మొదటగా చాలీసా పారాయణం ప్రారంభమైంది. 11 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేసి స్వామి వారికి పూజలు చేస్తారు. వారంలో మంగళ, శనివారాలలో ఇంటికో చొప్పున పారాయణం చేస్తున్నారు. ప్రతి వారం ఒకరి ఇంట్లో ఈ కార్యక్రమం కొనసాగుతుంది. అయితే 108 వారాలు పూర్తవుతున్న సందర్భంగా కార్యక్రమాన్ని పెద్దగా నిర్వహించాలని సంకల్పించారు. ఈనెల 6 న 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం, హోమం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడానికి హనుమాన్ భక్త సంఘం నిర్ణయించింది. ఈ క్రమంలో ఏర్పాట్లు పూర్తి చేస్తుంది. లోక కళ్యాణం, మానవుల్లో పెరుగుతున్న అహింస విధానం, శాంతి స్థాపన కోసం ఈ కార్యక్రమం చేపట్టినట్లు భక్తులు పేర్కొంటున్నారు.

మానసిక సంతృప్తి కలుగుతుంది



మొదట కొద్ది మందితోనే చాలీసా పారాయణం ప్రారంభించాం. పారాయణం ప్రారంభంనుంచి నేను ఉన్నాను. భక్తి శ్రద్ధతో పారాయణం చేస్తే మనస్సుకు ఎంతో సంతృప్తి కరంగా, హాయిగా ఉంటుంది.

- కస్తూరి నాగేశ్వర్, భక్తుడు

మంచి జరగాలనే ఉద్దేశ్యంతో



లోకంలో పెరుగుతున్న అహింస, అశాంతి, రూపుమాపి మంచి జరుగాలనే ఉద్దేశ్యంతో హనుమాన్ చాలీసా పారాయణం ప్రారంభించాం. మొదట తక్కువ మందితో ప్రారంభమైనా, స్వామిపై ఉన్న భక్తితో ఇప్పుడు సంఖ్య పెరిగింది. ఉదయం 6.30 గంటల నుంచి 7.30 గంటల వరకు పారాయణం సాగుతుంది. భక్తులు 108వ వారం అధిక సంఖ్యలో పాల్గొనాలి.

- భూమయ్య స్వామి, గురుస్వామి

మరమ్మతు చేయించరూ



లక్సెట్టిపేట: మండలంలోని చెల్లంపేట శివారులో ఉన్న పెద్ద కాలువ కడెం లెఫ్ట్ కెనాల్‌కు లీకేజీ ఏర్పడింది. దీంతో కాలువ నీరు వృథాగా పోతుంది. రబీ సీజన్‌లో పంటలకు నీరందించేందుకు నీటిని విడుదల చేయాల్సి ఉంది. అధికారులు ముందస్తు జాగ్రత్తగా మరమ్మతులు జరిపించడం లేదు. దీంతో పంట పొలాలకు ఉపయోగపడే నీరు వృథాగా పోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు పట్టించుకుని నీరు వృథా పోకుండా చూడాలని కోరుతున్నారు.

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 9010204423

న్యూస్ బాక్స్

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

దండేపల్లి: మండలంలోని ద్వారక గ్రామానికి చెందిన రావనవేని సత్తయ్య అనారోగ్యానికి గురై ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నాడు. సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా రూ.30వేలు మంజూరయ్యాయి. ఈ చెక్కును శుక్రవారం సర్పంచ్ ఇప్ప భూమన్న లబ్ధిదారుడికి అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఇప్ప సురేందర్, వార్డు సభ్యులు అశోక్, శ్రీనివాస్ తదితరులున్నారు.

ఆరోగ్య బీమా కార్డులు అందజేత



కార్డులు అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

దండేపల్లి: మండలంలోని 12మంది మానసిక దివ్యాంగులకు నేషనల్ ట్రస్టు ద్వారా 'నిరామయ ఆరోగ్య బీమా' కార్డులు జారీ అయ్యాయి. వీటిని స్థానిక భవిత కేంద్రంలో డయాసిస్ ఆఫ్ ఆదిలాబాద్ హ్యూమన్ ప్రమోషన్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ వారు శుక్రవారం దివ్యాంగులకు అందజేశారు. ఒక్కొక్కరికి రూ.లక్ష వరకు ఆరోగ్య బీమా వర్తిస్తుందని సంస్థ కో– ఆర్డినేటర్ సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం మల్లేశం, భవిత కేంద్రం ఐఈఆర్టీ రాయమల్లు పాల్గొన్నారు.

మరిన్ని జోన్ వార్తలు 12వ పేజీలో

భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

- ఎమ్మెల్యే దివాకర్‌రావు
- సమ్మక్క– సారలమ్మ జాతర ఏర్పాట్లపై సమీక్ష



సమావేశంలో ఎమ్మెల్యే, వివిధ శాఖల అధికారులు

మంచిర్యాలఅర్బన్: పట్టణంలోని గోదావరి నదీ తీరాన నిర్వహించే సమ్మక్క– సారలమ్మ జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఎమ్మెల్యే దివాకర్‌రావు సూచించారు. గౌతమేశ్వర ఆలయ ఆవరణలో శుక్రవారం జాతర ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. కల్పించాల్సిన సౌకర్యాలు, నీటిసరఫరా, పారిశుధ్య పనులు, స్నానాల గదులు, విద్యుత్ లైట్ల ఏర్పాట్లపై చర్చించారు. ఈవో వెంకటయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వసుంధర, వైస్‌చైర్మన్ నల్ల శంకర్, విశ్వనాథ ఆలయ కమిటీ చైర్మన్ సిరిపురం శ్రీనివాస్, డైరెక్టర్లు గంగాధార్, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, ఏఈ నర్సింహస్వామి, డిప్యూటీ తహసీల్దార్ రవీందర్, విద్యుత్‌శాఖ, అగ్నిమాపక ఉద్యోగులతో పాటు జాతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

- డీఆర్‌వో ప్రియాంక



విద్యార్థులతో డీఆర్‌వో ప్రియాంక

మంచిర్యాలఅర్బన్: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లోనూ రాణించాలని డీఆర్‌వో ప్రియాంక సూచించారు. పట్టణంలోని సాయి అంధుల పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన లూయీ బ్రెయిలీ జయంతి వేడుకల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. అక్షరప్రదాతలను ఎన్నటికీ మరవరాదన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు గీతాలు పాడి అలరించారు. విద్యార్థుల వేషాదరణ ఆకట్టుకుంది. అనంతరం పాఠశాల నిర్వహకులు డీఆర్‌వోను సన్మానించారు. నిర్వహకులు అశోక్‌రావు తదితరులున్నారు.

ప్లాస్టిక్ కవర్లు వాడొద్దు

- మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్



వీధి వ్యాపారులతో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీకాంత్

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీ పరిధిలో వీధి వ్యాపారులు 50 మైక్రాన్ల కంటే తక్కువ గల ప్లాస్టిక్ కవర్లను ఎట్టి పరిస్థితుల్లోనూ వినియోగించవద్దని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ సూచించారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో వీధి వ్యాపారులతో స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన కల్పించారు. కమిషనర్ మాట్లాడుతూ ఈ నెల 8 తర్వాత కేంద్ర బృందం మున్సిపాలిటీలో సర్వే నిర్వహిస్తుందని, ఎక్కడ పడితే అక్కడ చెత్త, ప్లాస్టిక్ వినియోగం ఉంటే స్వచ్ఛ సర్వేక్షణ్ పథకానికి ఎంపిక చేయరని తెలిపారు. ప్రతి ఒక్క వ్యాపారి మున్సిపాలిటీకి సహకరించి, పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేలా చూడాలని కోరారు.

పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించిన దళితులు



పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించిన దళితులు

వాంకిడి(ఆసిఫాబాద్): భీమాకోరెగాంలో దళితులపై జరిగిన దాడికి నిరసనగా శుక్రవారం దళిత సంఘాల ఆధ్వర్యంలో మార్కెట్, వ్యాపార సముదాయాలు, విద్యాసంస్థలు బంద్ చేయించారు. ముందే ఆదివాసీల అల్లర్ల కారణంగా వాంకిడిలో 144 సెక్షన్ కొనసాగుతోంది. ఎలాంటి సమాచారం లేకుండా బంద్ నిర్వహించడంతో బాధ్యులైన అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్ మహోల్కర్ తోపాటు 21 మందిని పోలీసులు అరెస్టు చేశారు. దీంతో ఆగ్రహానికి గురైన దళితులంతా ఏకమై స్థానిక పోలీస్ స్టేషన్‌ను ముట్టడించారు. అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలని పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించారు. విషయం తెలుసుకున్న ఆసిఫాబాద్ డీఎస్పీ సత్యనారాయణ అక్కడికి చేరుకుని వారితో మాట్లాడారు. అనంతరం అరెస్టు చేసిన వారిని పోలీస్‌స్టేషన్‌లో బైండోవర్ చేసి విడుదల చేశారు. దీంతో దళితులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దుర్గం అర్చిక, మహిళలు పాల్గొన్నారు.

గంగాజలంతో తిరుగుపయనం



గోదావరి నీటిని నింపుకుని వస్తున్న మెస్రం వంశీయులు



తిరుగుపయనమైన మెస్రం వంశీయులు

- గోదావరి జలాలతో తిరుగుపయనం

జన్నారం(ఖానాపూర్): ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్‌లో ఈనెల 16న ప్రారంభం కానున్న నాగోబా జాతర సందర్భంగా మెస్రం వంశీయులు గంగాజలం కోసం చేపట్టిన పాదయాత్ర శుక్రవారం జన్నారంకు చేరుకుంది. డిసెంబర్ 25న కేస్లాపూర్‌నుంచి బయలు దేరిన మెస్రం వంశీయులు ఇంద్రవెల్లి, ఉట్నూర్, గాదిగూడ, నార్నూర్, జైనూర్, సిర్పూర్, గంగాపూర్, కడెం, జన్నారం మండలాల్లో పర్యటించి గురువారం రాత్రి నర్సింగాపూర్‌లో బస చేశారు. శుక్రవారం ఉదయాన్నే కలమడుగు గోదావరినది హస్తల మడుగుకు చేరుకుని పుణ్యస్నానం ఆచరించి, నాగోబా దేవతకు అభిషేకం చేసేందుకు నీటిని తీసుకెళ్లే రాగి పాత్రను శుభ్రం చేశారు. అనంతరం గోదావరి ఒడ్డున వంటలు చేసుకుని సామూహిక భోజనాలు చేశారు. అనంతరం శుభ్రం చేసిన పాత్రలో గోదావరి జలాలను నింపుకుని కర్రకు కట్టి పూజలు చేసి తిరుగుపయనం అయ్యారు. ఈనెల 16న గోదావరి జలాలతో నాగోబా దేవతకు అభిషేకం చేసి పూజలు ప్రారంభిస్తామని ప్రధాన్‌లు మెస్రం తుకడోజీ, మెస్రం తిరుపతి, కటోడ మెస్రం హన్మంతు, కోసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకవాడి మెస్రం ధర్ము, గాయికి ఇద్రు, జాడే పుల్లు, ధర్మకర్త మండలి చైర్మన్ మెస్రం శేఖర్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

అటవీశాఖలో అలజడి!

- హైదరాబాద్ విజిలెన్స్ అధికారుల ఆకస్మిక తనిఖీల కలకలం
- ఆందోళనలో అధికారులు, సిబ్బంది



ఖానాపూర్ రేంజ్‌లో గురువారం విజిలెన్స్ అధికారులు

ఖానాపూర్: ఖానాపూర్ అటవీరేంజ్ పరిధిలోని ఖానాపూర్, కడెం, పెంబి మండలాల్లో హైదరాబాద్ విజిలెన్స్ విభాగం అధికారులు తనిఖీలు నిర్వహించడంతో ఆ శాఖలో ఒక్కసారిగా అలజడి రేగింది. బుధవారం రాత్రి ఖానాపూర్ రేంజ్ పరిధిలో గల మందపల్లి సెక్షన్‌లోని నాగాపూర్ బీట్‌లో తొలుత అధికారులు మెరుపు దాడి చేపట్టారు. ఈ సందర్భంగా వివిధరకాల దుంగలు, సైజులు 65 వరకు పట్టుకోవడంతో పాటు కలప కోత యంత్రం ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. నాగాపూర్‌లో రూ.19,413 విలువైన కలపను టింబర్ డిపోకు తరలించారు. గురువారం ఖానాపూర్ మండలం సత్తన్పల్లి పంచాయతీ పరిధిలోని రాంరెడ్డి పల్లెతో పాటు పాత ఎల్లాపూర్ గ్రామాల్లోను తనిఖీలు చేసి పలు కలప దుంగలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కడెం మండలంలో తనిఖీలు చేశారు. నాగాపూర్ తదితర ప్రాంతాల్లో కలప దందాపై స్థానికులు ఇచ్చిన పక్కా సమాచారం మేరకు ఈ దాడులు చేపట్టినట్లు తెలుస్తోంది. విజిలెన్స్ అధికారుల దాడుల సమాచారాన్ని ఉన్నతాధికారులకు నివేదించిన తర్వాత అధికారులు ఎవరిపై చర్యలు తీసుకుంటారోననే చర్చలు సాగుతున్నాయి. ఇటీవల సాక్షిలో కలప అక్రమ దందా, జంతువుల వేట తదితర అంశాలపై వరుసగా వస్తున్న కథనాలతో హైదరాబాద్‌కు చెందిన విజిలెన్స్ అధికారుల బృందం తనిఖీలు చేపడుతున్నట్లు సమాచారం. ఈ విషయమై స్థానిక రేంజ్ అధికారిని సాక్షి వివరణ కొరగా విజిలెన్స్ తనిఖీల్లో కలప లభించింది వాస్తవమేనని అన్నారు. తమకు 17 బీట్‌లకు 6 ఎఫ్‌బీవోలు మాత్రమే ఉన్నారని, సిబ్బంది కొరత కారణంగా విజిలెన్స్ అధికారులు తమకు సహకారంలో భాగంగానే రేంజ్‌లో పర్యటించారని చెప్పడం గమనార్హం. ఏది ఏమైనప్పటికీ విజిలెన్స్ నివేదికపై ఎవరిపై చర్యలు తీసుకుంటారోనని అటవీఅధికారుల్లో అలజడి రేగిందని చెప్పవచ్చు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి వీరయ్య



భూగర్భ జలాలపై తయారు చేసిన ఎగ్జిబిట్‌తో సెవెన్‌హిల్స్ విద్యార్థులు

పంటల విధానంపై ఎగ్జిబిషన్

- ప్రారంభించిన జిల్లా ఏవో వీరయ్య

మంచిర్యాలటౌన్: పంటల సాగు విధానంపై విద్యార్థులకు అర్థమయ్యేలా చేసేందుకు సైన్స్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించడం, విద్యార్థులకు అవగాహన కలిగేలా చేయడంతో వ్యవసాయ రంగంలో మార్పు వస్తుందని జిల్లా వ్యవసాయాధికారి వీరయ్య అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నేషనల్ కౌన్సిల్ ఫర్ సైన్స్ అండ్ టెక్నాలజీ కమ్యూనికేషన్, సొసైటీ ఫర్ అర్బన్, రూరల్ ఎన్‌లైట్‌మెంట్ (స్యూర్) అనే స్వచ్ఛంద సంస్థతో కలిసి మూడు రోజుల సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేయగా జిల్లా వ్యవసాయాధికారి ప్రారంభించారు. విద్యార్థులకు రైతులు చేపడుతున్న వ్యవసాయ అనుభవాలను వివరిస్తే, ప్రస్తుత తరుణంలో వ్యవసాయానికి అవసరమైన సాగునీరు, విద్యుత్, సేంద్రియ సాగుకు అవసరమైన సలహాలు, సూచనలు ఒకరికొకరు పంచుకునేందుకు చక్కని వేదికగా మారిందన్నారు. అనంతరం డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్వెస్టిగేటెడ్ ప్రిన్సిపాల్ జి. పద్మ మాట్లాడుతూ ప్రభుత్వం తరుపున విద్యార్థులు, రైతులను ఒకరికొకరు సమన్వయం చేసుకుని, వ్యవసాయ రంగంలో మార్పులను ఇరువురు తెలుసుకునేలా చేయడమన్నారు. ఇందుకోసం స్వచ్ఛంద సంస్థ స్యూర్‌తో కలిసి శుక్ర, శని, ఆది వారాల్లో సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశామని, అత్యుత్తమ ఎగ్జిబిట్‌కు అవార్డులు సైతం అందించి, విద్యార్థులకు బహుమతులను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు బాబురావు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నారాయణ రెడ్డి, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రచన, ఎంఈవో డి. శ్రీనివాస్ పాల్గొన్నారు.



గల్ఫ్‌లో 87,64,829 మంది భారతీయులు

గల్ఫ్ దేశాల సహకారమండలిలోని (గల్ఫ్ కోపరేషన్ కౌన్సిల్ –జీసీసీ) ఆరు దేశాలలో ప్రవాస భారతీయుల జనాభా 87 లక్షల 64 వేల 829కు చేరిందని లోక్ సభలో జితేంద్ర చౌదరి అడిగిన ప్రశ్నకు విదేశాంగ శాఖ సహాయ మంత్రి వీకే సింగ్ డిసెంబరు 27న లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. సౌదీ అరేబియాలో 32,53,901 మంది, యూఏఈలో 28 లక్షలు, కువైట్‌లో 9,17,970, ఒమన్‌లో 7,83,040, ఖతార్‌లో 6.97 లక్షలు, బహరేన్‌లో 3,12,918 మంది ప్రవాస భారతీయులు ఉన్నారని తెలిపారు. ఆరు గల్ఫ్ దేశాలలో 11,774 మంది భారత సంతతి ప్రజలు ఉన్నట్టు చెప్పారు. ప్రపంచంలోని 208 దేశాలలో ఎన్నారైలు, పీఐఓలు కలిపి 3 కోట్ల 12 లక్షల 33 వేల 234 మంది భారత ప్రవాసులున్నారని ప్రకటించారు. ఇందులో కోటి 33 లక్షల 27 వేల 438 మంది ప్రవాస భారతీయులు, కోటి 79లక్షల 5వేల 796 మంది భారత సంతతి ప్రజలు ఉన్నారని వివరించారు.

ప్రవాసీ భారతీయ దివస్‌కు భారత సంతతి పార్లమెంటేరియన్లు

జనవరి 9న ఢిల్లీలో నిర్వహించనున్న ప్రవాసీ భారతీయ దివస్‌కు ప్రపంచంలోని వివిధ దేశాలలో ఉన్న భారత సంతతికి చెందిన 285 మంది పార్లమెంటేరియన్లను భారత ప్రభుత్వం ఆహ్వానించింది. ఇప్పటివరకు 125 మంది పార్లమెంటేరియన్లు తమ సమ్మతిని తెలియజేశారని విదేశాంగ శాఖలోని ప్రవాసీ భారతీయ వ్యవహారాల శాఖ కార్యదర్శి జ్ఞానేశ్వర్ మూలే తెలిపారు. భారత ప్రభుత్వం దౌత్యాన్ని ప్రజాపక్షం చేసిందని, భారత సంతతితో పరస్పరం అభిప్రాయాలను పంచుకోవడం, మాతృభూమితో వారి బంధాన్ని దృఢపరచడం తమ లక్ష్యమని అయన అన్నారు. విదేశాల్లోని భారతీయుల కోసం తక్షణం స్పందించే ఆన్‌లైన్ వ్యవస్థ 'మదద్' (కాన్సులర్ సర్వీసెస్ మేనేజ్‌మెంట్ సిస్టం) ద్వారా 26 వేల ఫిర్యాదులు వచ్చాయని, ఇందులో 21 వేలు పరిష్కరించామని వివరించారు.

ఖతార్‌లో ఎన్నారైలకు దౌత్య సేవలు

ఖతార్ దేశ రాజధాని దోహాలోని ఇండియన్ ఎంబసీ (భారత దౌత్య కార్యాలయం) అధికారులు ఈనెల 12న శుక్రవారం అల్ బనూష్ క్లబ్‌లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కాన్సులర్ క్యాంపు (దౌత్య సేవల శిబిరం) నిర్వహిస్తారు. ఎన్నారైలు వారి పాస్‌పోర్ట్, దౌత్య సంబంధ సేవలు గురించి, వేతనాలు తదితర సమస్యల గురించి అధికారులకు దరఖాస్తులు సమర్పించవచ్చు. మరిన్ని వివరాలకు ఎంబసీ హెల్ప్‌లైన్ నంబర్ **+97455808254** ఇ–మెయిల్: labour.doha@mea.gov.inకు సంప్రదించవచ్చు.

సౌదీలో 'ప్రవాసీ ప్రజావాణి'

సౌదీ అరేబియాలోని జిద్దా ఇండియన్ కాన్సులేట్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఈనెల 12న శుక్రవారం 'కాన్సులేట్ ఎట్ యువర్ డోర్' (మీ ముంగిట్లోకి దౌత్య కార్యాలయం) కార్యక్రమాన్ని భారత దౌత్య అధికారులు నిర్వహిస్తున్నారు. అభాలోని ఖమీస్ ముషాయిత్‌లో 054 6722909, మక్కాలోని ఇండియన్ హజ్ మిషన్‌లో 012 5603580, నజరాన్‌లో 017 5221949 నంబర్లలో సంప్రదించవచ్చు.

సేకరణ: మంద భీంరెడ్డి, అధ్యక్షులు, ప్రవాసీ మిత్ర

నిర్దిష్ట విధానం కావాలి

- శిక్షణ లేక కూలీలుగా వెళ్తున్న యువత
- సరైన ఉపాధి దొరకక అఘాయిత్యాలు
- కేరళ తరహా విధానం రూపొందించాలి
- వలసదారుల సంక్షేమ, హక్కుల వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు కోటపాటి నర్సింహనాయుడు

ఉపాధి వేటలో ఎడారి దేశాల బాటపడుతున్న నిరుద్యోగ యువత కొందరు నకిలీ ఏజంట్ల చేతుల్లో మోసపోయి నష్టపోతుంటే.. మరికొందరు జీతాలు సరిగా రాక.. అప్పులు తీరక.. అనారోగ్య కారణాలతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని వలసదారుల సంక్షేమ, హక్కుల వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు కోటపాటి నర్సింహనాయుడు అన్నారు. ఇక్కడి నుంచి వెళ్లేవారికి స్కిల్ డెవలప్‌మెంట్ లేకపోవడంతో ఎక్కువ శాతం కూలీ పనులే చేస్తున్నారని అన్నారు. గల్ఫ్ బాధితుల పక్షాన నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ కేంద్రంగా పోరాటాలు చేస్తున్న నర్సింహనాయుడు తన అభిప్రాయాలను 'సాక్షి'తో పంచుకున్నారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

– కొండవీటి సురేష్‌కుమార్, ఆర్మూర్

గల్ఫ్ దేశాలతో పాటు ఇరాన్, ఇరాక్, అఫ్ఘానిస్తాన్, ఇజ్రాయిల్, సింగపూర్, మలేసియా తదితర దేశాలకు తెలంగాణ నుంచి యువత ఉపాధి కోసం వెళ్తున్నారు. కానీ నిరక్షరాస్యులు, శిక్షణ లేనివారు కావడంతో 90 శాతం మంది కూలీలుగానే వెళ్తున్నారు. కేరళ రాష్ట్రీయులు మాత్రం స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణలు పూర్తి చేసుకొని గల్ఫ్ దేశాలకు వెళ్లడంతో మంచి ఉద్యోగాల్లో స్థిరపడుతున్నారు. మనవారికి సరైన శిక్షణ లేక పనులు సరిగా దొరకడం లేదు. దీంతో చేసిన అప్పులు తీరక స్వదేశానికి వచ్చిన వారు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. గల్ఫ్ దేశాల్లోని మృతదేహాలను స్వదేశాలకు తరలించడానికి నెలల తరబడి ఎదురు చూసే దయనీయ స్థితిని చూశాము. 2013లో వలసదారుల సంక్షేమ, హక్కుల వేదికను ఏర్పాటు చేసి కొన్ని గల్ఫ్ బాధితుల కుటుంబాలకు ప్రతి నెల 500 రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశాము. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో గల్ఫ్ మృతుల కుటుంబాలకు లక్ష రూపాయల పరిహారాన్ని అందజేసేవారు. టీఆర్ఎస్ పార్టీ నాయకులు పరిహారాన్ని ఐదు లక్షల రూపాయలకు పెంచు తామని ఎన్నికల సమయంలో ప్రకటించినా ఇప్పటికీ అమలు కాలేదు. అంతే కాదు.. గత


కోటపాటి నర్సింహనాయుడు

ప్రభుత్వాలు ఇచ్చిన తరహాలో లక్ష రూపాయలు కూడా ఇవ్వలేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన 2 జూన్ 2014 నుంచి 2 అక్టోబర్ 2017 నాటికి 431 మంది తెలంగాణ ప్రజలు గల్ఫ్‌లో మృత్యువాత పడ్డట్లు రాష్ట్ర ప్రభుత్వమే అధికారికంగా ధ్రువీకరించింది. వీరిలో ఒక్క కుటుంబానికి కూడా రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి ఆర్థిక సహాయమూ అందజేయలేదు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం కలగజేసుకొని మృతదేహాలను వెంటనే స్వగ్రామాలకు చేర్చుతున్నప్పటికీ వారి కుటుంబాలకు భరోసా కల్పించడంలో విఫలమవుతుతోంది.

కేరళ, పంజాబ్ తరహాలో..

గల్ఫ్ దేశాల్లో సంక్షోభం గురించి తెలియక ఉపాధి వేటలో ఏడారి దేశాలకు వెళ్లి కష్టాలపాలవుతున్న రాష్ట్ర నిరుద్యోగులను ఆదుకోవడానికి ఒక ప్రత్యేక విధానమంటూ లేదు. రాష్ట్ర ప్రభుత్వం ఈ సమస్యపై విధానపరమైన నిర్ణయాన్ని తీసుకోవాల్సిన అవసరం ఉంది. కేరళ, పంజాబ్ రాష్ట్రాల తరహాలో ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయడం, గల్ఫ్ బాధితులను ఆదుకోవడం కోసం కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయడం, ప్రతి ఏటా వంద కోట్ల రూపాయల నిధిని కేటాయించడం లాంటి చర్యలు తీసుకోవాలి. నకిలీ ఏజంట్లను కఠినంగా శిక్షించడంతో పాటు ప్రత్యేక వ్యవస్థ ద్వారా రాష్ట్ర ప్రభుత్వమే విదేశాల్లో ఉద్యోగావకాశాలను తెలియపరచాలి. యువతకు అందుకు తగ్గ శిక్షణ ఇచ్చి ఉపాధి కోసం విదేశాలకు పంపే వ్యవస్థను ఏర్పాటు చేయాలి. గల్ఫ్ దేశాల్లో అనారోగ్యం, ఉద్యోగపరంగా సమస్యలతో నష్టపోయి తిరిగి స్వదేశానికి వచ్చిన వారికి పావలా వడ్డీతో రుణాలు అందజేసి స్వయం ఉపాధి రంగాల్లో ప్రోత్సహించి వారి జీవితాలకు భరోసా కల్పించాలి. గల్ఫ్ దేశాలలో సంపాదించి తెలంగాణ రాష్ట్రానికి మన వాళ్లు ప్రతీ నెల పంపిస్తున్న డబ్బుపై పన్నుల రూపంలో వందల కోట్ల రూపాయలను ఆర్జిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం గల్ఫ్ బాధితుల సంక్షేమం గురించి కూడా ఆలోచించాలి. గల్ఫ్ మృతుల కుటుంబాలకు పింఛన్‌ను అందజేయాలి.

వైద్యం అందని దైన్యం

- దుబాయ్‌లో గాయపడిన సిరిసిల్లవాసి
- అచేతనంగా స్వగ్రామానికి
- ఆదుకునే వారి కోసం ఎదురుచూపు

పాలమాకుల శేఖర్, సిరిసిల్లటౌన్:

ఉన్న ఊర్లో పనుల్లేక పొట్ట చేతబట్టుకుని పోయిన బడుగు జీవి అక్కడ పనికోసం ఎన్నో అవస్థలు పడ్డాడు. ఏదో ఒక పనిలో కుదిరిన ఆయనను విధి వెంటాడింది. నిచ్చెన జారి కిందపడిపోయాడు. ఆ ప్రమాదంలో కాలు విరిగితే పనిలో పెట్టుకున్న కంపెనీ కనీసం వైద్యం కూడా చేయించలేదు. దూర దేశంలో పడిన కష్టాలు ఆయన మాటల్లోనే..

నా పేరు చిలుముల చంద్రశేఖర్. మాది సిరిసిల్ల పట్టణం బీవైనగర్. స్వర్ణకారుడిగా పనిచేస్తూ నా భార్య అరుణ, కొడుకులు సాయికుమార్, తేజలను పోషించుకునే వాడిని. పదేళ్ల క్రితం కులవృత్తికి పనులు తక్కువయ్యాయి. పిల్లల భవిష్యత్తు కోసం దుబాయ్ పోయి సంపాదించాలనుకున్న. కోనరావుపేట మండలం కనగర్తికి చెందిన ఓ ఏజెంటు రూ.1.30లక్షలను తీసుకుని దుబాయ్‌కి పంపిండు. అక్కడ ఆంధ్రాకు చెందిన అన్‌లైసెన్స్‌డ్ ఏజెంటు నన్ను మూడు నెలలు ఏ పనీ లేకుండా తిప్పిండు. చేతిల డబ్బుల్లేకుండా అక్కడ చాలా రోజులు పస్తులుంటూ.. తెలుగు వారి వద్ద తలదాచు కునేటోన్ని. ఆ తర్వాత ఏమైందో గానీ అతని ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి ఎక్కడికో పారిపోయిండు. అక్కడ మనవాళ్లు నా పరిస్థితి తెలుసుకుని ఎక్కడైనా పని ఉంటే చెప్పేటోళ్లు. లేకుంటే రూములోనే ఉండేటోన్ని. కొద్ది రోజులకు మన తెలుగోళ్ల సాయంతో ఓ కంపెనీలో చేరాను. మూడున్నర సంవత్సరాలు కార్పెంటర్ పనిచేసిన. యజమానులు జీతం సరిగా ఇవ్వక పోయేటోళ్లు. కంపెనీలో చేరేటప్పుడు నెలకు రూ.1200 దర్హమ్‌లు ఇస్తానన్నరు. కానీ నాలుగు నెల్లకోసారి కూడా జీతం ఇచ్చేటోళ్లు కాదు. తర్వాత ఖల్లవెళ్లి వీసాతో కార్పెంటర్ పనులే చేసేటోన్ని. నన్ను అక్కడ పనిలో పెట్టిన సబ్‌కాంట్రాక్టర్ నాకు డబ్బులు సరిగా ఇచ్చేటోడు కాదు. కచ్చితంగా జీతం ఇవ్వాలని నిలదీస్తే.. జైలుకు పంపుతానని బెదిరించిండు. ఇట్లా నేను అక్కడ ఏజెంట్ల వద్ద రూ.23వేల దర్హమ్స్ మునిగాను. డిసెంబర్ 5న ఓ భవనంలో సీలింగ్ పనులు చేస్తూ నిచ్చెన జారీ కిందపడి పోయాను. సబ్‌కాంట్రాక్టర్ ఆసుపత్రికి తీసుకుపోయిండు. కేవలం మందులు మాత్రమే ఇప్పించిండు. కాలి ఎముక మూడుముక్కలైందని అక్కడి డాక్టర్లు చెప్పగా.. రూ.10 వేల దర్హమ్స్ ఖర్చయితాయన్నరు. చేసేది లేక నా పరిస్థితిని ఇంటివాళ్లకు చెప్పుకున్నా. పొత్తూరుకు చెందిన రవీందర్‌రెడ్డికి మావాళ్లు చెబితే.. ఆయన గల్ఫ్ కార్మిక నాయకుడు అడవి పదిరకు చెందిన మహేందర్‌రెడ్డి, షార్జాలో ఉన్న ముస్తాబాద్‌కు చెందిన జనగామ శ్రీనివాస్, ఢిల్లీకి చెందిన గిరీష్‌పంత్‌కు సమాచారం ఇచ్చారు. వారి సాయంతో ఎంబసీకి పోయి నా పరిస్థితిని వివరించగా.. ఎంబసీ వారు మానవతా దృక్పథంతో ఉచిత విమాన ప్రయాణ టికెట్ ఇచ్చి పంపారు. కాలికి ఆపరేషన్ చేయించుకోవాలంటే చేతిలో చిల్లిగవ్వలేదు. మంచం పట్టిన నాకు భార్య, పిల్లలు సేవలు చేస్తున్నారు. ఇప్పుడు నేను ఎట్లా నడిచి వారిని సాదుకోవాలి. కరీంనగర్ ఆసుపత్రికి పోతే ఆరోగ్యశ్రీ ఈ ఆపరేషన్‌కు వర్తించదన్నారు. రూ.80వేలు ఖర్చవుతుందట. ప్రభుత్వం ఆదుకోవాలి.


దుబాయ్‌లో చంద్రశేఖర్‌ను పరామర్శిస్తున్న జనగామ శ్రీనివాస్, గిరీష్‌పంత్

ఖేల్

హైజంప్ చేస్తున్న క్రీడాకారిణి



షాట్‌పుట్‌లో పాల్గొన్న క్రీడాకారుడు



షాట్‌పుట్‌లో విసురుతున్న క్రీడాకారిణి



సత్తా చాటారు

ముగిసిన వెటరన్ అథ్లెటిక్స్ పోటీలు

రామకృష్ణాపూర్(చెన్నూర్): మాస్టర్స్ అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రామకృష్ణాపూర్‌లోని సింగరేణి ఠాగూర్ స్టేడియంలో ప్రతిష్టాత్మకంగా రెండు రోజుల పాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి వెటరన్ అథ్లెటిక్ క్రీడా సంబ రాలు శుక్రవారం ముగిశాయి. గురువారం పోటీలు ప్రారంభం కాగా శుక్రవారం సాయంత్రం వరకు కూడా పోటీలు కొనసాగాయి. 40 ఏళ్ల నుంచి 95 వయసు విభాగం వరకు పురుషులు, స్త్రీలకు వేర్వేరుగా నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఆయా జిల్లాల నుంచి సుమా రు 600 మందికి పైగా క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభను చాటారు. 100 మీటర్ల పరుగు, 200 మీటర్లు, 400 మీటర్లు, 800 మీటర్లు, 5 కిలోమీటర్లు, 10 కిలోమీటర్ల పరుగుపందెంతో పాటు 5 కిలోమీటర్ల వాకింగ్, హ్యామర్‌త్రో, జావలీన్‌త్రో, డిస్కస్‌త్రో, షాట్‌పుట్, 400 రిలే, హైజంప్, లాంగ్ జంప్, ట్రిపుల్ జంప్ తదితర అంశాల్లో మొత్తం 27 ఈవెంట్స్‌ను నిర్వహించారు.యువత కంటే రెట్టింపు జోష్‌తో వెటరన్స్ క్రీడల్లో పాల్గొన్నారు. క్రీడల్లో సత్తా చాటారు.



క్రీడాకారులకు బహుమతులు అందిస్తున్న విప్ ఓదెలు

విప్‌చే బహుమతుల అందజేత..

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు బహుమతులు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల ద్వారా క్రమశిక్షణ పెరుగుతుందని అన్నారు. క్రీడలతో క్రమశిక్షణనే కాక విజయం సాధించాలన్న పట్టుదల కూడా పెరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో మాస్టర్స్ వెటరన్ అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, కార్యదర్శి భగవాన్ రెడ్డి, జెడ్పీటీసీ కంభగోని సుదర్శన్‌గౌడ్, క్యాతనపల్లి సర్పంచ్ జాడి శ్రీనివాస్, డీవైఎస్‌వో శ్రీకాంత్‌రెడ్డి, పీఈటీల సంఘం జిల్లా అధ్యక్షుడు మీనారెడ్డి, నాయకులు గాండ్ల సమ్మయ్య, నర్సింగరావు, మేడిపెల్లి సంపత్, ఈశ్వరాచారీ, బైరమల్ల మొగిలయ్య, కుమ్మం సురేందర్, జిలకర మహేశ్, పీఈటీలు బెల్లం శ్రీనివాస్, నాగులు, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఓవరాల్ చాంపియన్‌గా నిలిచిన మేడ్చల్

రాష్ట్రస్థాయి వెటరన్ అథ్లెటిక్స్ పోటీల్లో మేడ్చల్ జిల్లా జట్టు ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. పురుషులు, స్త్రీల విభాగంలో అత్యధిక ఈవెంట్స్‌లో ప్రతిభను కనబరిచి బహుమతులు సాధించిన మేడ్చల్ జిల్లా జట్టుకు పురుషుల చాంపియన్‌షిప్, స్త్రీల చాంపియన్‌షిప్‌తో పాటు ఓవరాల్ చాంపియన్‌షిప్ బహుమతిని నిర్వాహకులు అందచేశారు. కాగా 40 ఏళ్ల నుంచి 95 వయసు విభాగంలో అథ్లెటిక్స్‌లోని ఆయా అంశాల్లో మొదటి రెండు స్థానాల్లో నిలిచిన పురుషులు, స్త్రీలు ఫిబ్రవరి 11 నుంచి 14 వరకు ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని మాస్టర్స్ వెటరన్ అథ్లెటిక్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మారెడ్డి, భగవాన్‌రెడ్డి పేర్కొన్నారు. 297 మంది క్రీడాకారులు (మహిళలు, పురుషులు జాతీయస్థాయికి ఎంపిక కాగా మంచిర్యాలకు చెందిన వారు 16 మంది ఉన్నారు.



సాధించిన మెడల్స్‌తో సింగరేణి ఉద్యోగులు

కిక్ గేమ్ 'సెపక్ తక్రా'

- నేటినుంచి నస్పూర్‌లో అంతర్ జిల్లా సీనియర్స్ పోటీలు

శ్రీరాంపూర్(మంచిర్యాల): క్రీడల్లో కిక్ ఇచ్చే గేమ్‌గా సెపక్ తక్రా చెప్పవచ్చు. విదేశీ క్రీడ అయిన కూడా మన దేశంలో రోజు రోజుకు ఆదరణ పెరుగుతోంది. ముఖ్యంగా సంప్రదాయ క్రీడలకు నిలయమైన తెలంగాణలో కూడా ఈ క్రీడను క్రీడాకారులు అభిమానించి ఆదరిస్తున్నారు. చాలా మంది క్రీడాకారులు ఈ క్రీడలో రాణిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తరువాత మొదటిసారిగా సింగరేణి గడ్డపై రాష్ట్ర స్థాయిలో సీనియర్స్ అంతర్ జిల్లాల పోటీలు జరుగుతున్నాయి. సీనియర్స్‌లో పురుషులు, మహిళలు వేరువేరుగా ఈ పోటీల్లో పాల్గొననున్నారు. నస్పూర్ కాలనీలోని సింగరేణి సేవాభవన్ దీనికి వేదికైంది. నేటి నుంచి జరగనున్న పోటీలకు సుమారు 150 మంది క్రీడాకారులు హాజరువుతున్నారు. దీనికోసం కంపెనీ తనవంతుగా మైదానాలను, లైటింగ్ ఏర్పాటు చేసింది. నేటి సాయంత్రం మొదలై, ఆదివారం సాయంత్రంతో ముగియనున్నాయి.



సెపక్ తక్రా ఆడుతున్న క్రీడాకారులు(ఫైల్)


ఉమ్మడి జిల్లా ఘనత

2006 నుంచి 2010 వరకు జూనియర్స్, సబ్ జూనియర్స్ అంతర్ జిల్లాల పోటీల్లో జిల్లా బాలబాలికల జట్లు చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. 2015లో అంతర్ జిల్లాల సీనియర్స్ విభాగంలో పురుషుల జట్టు చాంపియన్‌షిప్‌ను గెలిచింది. 2002లో హైదరాబాద్‌లో జరిగిన 32వ జాతీయ స్థాయి పోటీల్లో జిల్లా నుంచి పి.శిరీష (శ్రీరాంపూర్), జి.అనిల్‌కుమార్ (గోలేటి) పాల్గొన్నారు. 2003లో హైదరాబాద్ హకీంపేటలో ఉన్న స్పోర్ట్స్ స్కూల్‌లో జిల్లా నుంచి ముగ్గురు క్రీడాకారులు ఎంపికయ్యారు. 2004 నుంచి ఇప్పటివరకు జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి సుమారు 100 మంది క్రీడాకారులు విభాగాల్లో పాల్గొన్నారు

క్రీడా నియమాలు...

పురుషులు, మహిళలు ఇద్దరు కూడా ఆడే క్రీడ ఇది. ప్రతి జట్టులో మొత్తం 5 గురు క్రీడాకారులు ఉంటారు. ఇందులోముగ్గరు ఆడితే ఇద్దరు ఎక్స్‌ట్రా ప్లేయర్‌గా ఉంటారు. ఆటకు మొత్తం 21 పాయింట్లు ఉంటాయి.ఆట లో త్రోయర్, సర్వీస్ పర్సన్, షూటర్ అంటూ 3 రకాలుగా సంబోధిస్తారు.

చక్కగా చెబుతున్నారు



నేను అంతకు ముందు ప్రైవేటు పాఠశాలకు వెళ్లేది.. మా ఊరి పాఠశాలలో గత రెండేళ్ల కిత్రం ఆంగ్ల మాధ్యమం ప్రారంభించారు. దీంతో మా తల్లిదండ్రులు మా ఊరి ప్రాథమిక పాఠశాలకు పంపిస్తున్నా ఇక్కడ ప్రైవేటు పాఠశాల కంటే మంచిగా చెబుతున్నారు. ప్రొజెక్టర్ ద్వారా కూడా పాఠా బోధిస్తున్నారు. కంప్యూటర్ నేర్పిస్తున్నారు. ప పుస్తకాలు, నోట్ బుక్‌లు అన్ని ఫ్రీగానే ఇచ్చార చాలా బాగుంది.

-శిరీష, విద్యార్థిని, 5వతరగతి, రెబ్బన

వేతనంలో 20 శాతం పిల్లలకే..



నాకు నెల నెల వచ్చే వేతనంలో 20 శాతం విద్యార్థుల కోసం ఖర్చు చేస్తున్నాను. పాఠశాలకు వచ్చేది చాలా మంది పేద పిల్లలు కావడంతో వారి కోసం ఖర్చు చేస్తున్నాను. పాఠశాల అభివృద్ధికి దాతలు సహకరించినప్పటికీ నా వంతుగా కూడా విద్యార్థుల కొంత ఖర్చు పెడుతున్నాను. ఆటో చార్జీలు, సాయంత్రం అందించే అల్పాహారానికి, కొంత ఖర్చు భరిస్తున్నాను. విద్యార్థులందరికీ బూట టై, బెల్టు కొనిచ్చాను.

-అర్చన, పాఠశాల హెచ్.

పేదవిద్యార్థుల కోసం..



పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి సహకరించాలనే ఉద్దేశంతో పాఠశాల అభివృద్ధికి స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకున్నాం. వాళ్లు స్పందించి పాఠశాలకు అన్ని రకాల వసతులు కల్పించారు. దీంతో గ్రామస్తు లు తమ పిల్లలను ప్రైవేటుకు పంపకుండా ప్రభుత్వ పాఠశాలకే పంపిస్తున్నారు. పాఠశా లో వసతులు కల్పించినప్పటి నుంచి విద్యార్థు సంఖ్య పెరిగింది. చాలా సంతోషంగా ఉంది.

-సంగనభట్ల రాజేంద్రప్రసాద్, సందాన

చాలా గర్వంగా ఉంది..



మా ఊరి పాఠశాలలో దాతల సహకారంతో మెరుగైన వసతులు కల్పించారు. దీంతో జిల్లాలోని అన్ని పాఠశాలలకంటే మా ఊరి పాఠశాలలో విద్యార్థులు ఎక్కువగా ఉండటం చాలా గర్వంగా ఉంది.

- కొట్టె రాజేశ్వరి, సర్పంచ్, రెబ్బనపల్లి



ఆదర్శం

స్వచ్ఛందం.. సౌకర్యాలు ఘనం



డెస్క్‌బెంచీలపై కూర్చుని విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు

చీకట్లో కూర్చునేకంటే ఆ చీకట్లోనే ఓ చిరుదీపం వెలిగించడం మంచిది అనేది చైనా సామెత. మన సుంటే మార్గముంటుంది. తలుచుకుంటే మనిషి సాధించలేనిది ఏదీ లేదు అనేదానికి ఇదే నిదర్శనం. సర్కారు పాఠశాలల పరిస్థితి ఎలా ఉంటుందో మనకు తెలుసు. కానీ ఇక్కడ మాత్రం కార్పొరేట్‌కు దీటుగా సౌకర్యాలు కల్పించి జిల్లాలోనే అత్యధిక విద్యార్థులున్న పాఠశాలగా తీర్చిదిద్దే క్రమంలో స్వచ్ఛంద సంస్థల సహకారం మరువలేనిది. మంచి పనికి సహాయం తప్పకుండా ఉంటుంది అనడానికి ఇదే ఉదాహరణ. ప్రభుత్వ పాఠశాలలో అన్ని హంగులు సమకూర్చుతూ విద్యార్థుల భవితకు మేమున్నామంటూ ప్రధానోపాధ్యాయురాలు సైతం తనవంతు సహాయం అందించడం గొప్ప విషయం. మామూలు పల్లెటూళ్లో ప్రభుత్వ పాఠశాలకు అన్ని హంగులు దిద్దుతూ విద్యార్థుల అభివృద్ధే ధ్యేయంగా పాఠాలు బోధిస్తూ 170 మంది విద్యార్థులకు విద్యాబుద్ధులు చెబుతున్నారు. పాఠశాల రూపకల్పనలో స్వచ్ఛంద సంస్థల ప్రోత్సాహంతో విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తున్నారు.

దండేపల్లి(మంచిర్యాల): దండేపల్లి మండలంలోని రెబ్బనపల్లి ప్రాథమిక పాఠశాలలో గత ఏడాది 1వ తరగతికి ఆంగ్ల మాధ్యమంతో బోధన ప్రారంభించారు. ప్రస్తుతం 5 తరగతుల వరకు కూడా ఆంగ్ల మాధ్యమంలో బోధిస్తున్నారు. దీంతో గ్రామస్తులతో పాటు పక్క గ్రామాల వారు కూడా తమ పిల్లలను ప్రైవేటుకు పంపకుండా రెబ్బనపల్లి ప్రాథమిక పాఠశాలకు పంపిస్తున్నారు. పాఠశాలలో రెండేళ్ల క్రితం 52 మంది విద్యార్థులు ఉండగా, గత ఏడాది 120 కి చేరుకుంది. ప్రస్తుతం 170 అయ్యింది. జిల్లాలోనే అత్యధిక విద్యార్థులున్న పాఠశాలగా ప్రత్యేక స్థానం సంపాదించుకుంటోంది. జిల్లాలోని పలు పాఠశాలలకు ఆదర్శంగా నిలుస్తోంది.

విద్యార్థులకు అన్ని ఉచితంగానే..

రెబ్బనపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు అన్ని ఉచితంగానే అందిస్తున్నారు. యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, కంపాసు బాక్సులు, బూట్లు, టై, బెల్టు, ఐడీ కార్డులు కూడా అన్ని దాతలు అందిస్తున్నారు. వీటికి తోడు ప్రభుత్వం అందించే మధ్యాహ్న భోజన పథకంతో పాటు సాయంత్రం వేళ పిల్లలకు పోషక పదార్థాలతో కూడిన అల్పాహారాన్ని ఉచితంగా అందిస్తున్నారు. సమీప గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులకు ఆటో చార్జీల్లో కూడా సగం వరకు దాతలు, హెచ్‌ఎం చెల్లిస్తుండగా, మిగతా సగం పిల్లల తల్లిదండ్రులు భరిస్తున్నారు.

స్వచ్ఛంద సంస్థలు అందించిన సౌకర్యాలు..

- పాఠశాల అభివృద్ధికి హైదరాబాద్‌కు చెందిన పలు స్వచ్ఛంద సంస్థలు అభివృద్ధిలో పాలు పంచుకుంటున్నాయి.
- బిగ్‌హెల్ప్ ఎడ్యుకేషన్, బ్రింగ్ ఏ స్మైల్ స్వచ్ఛంద సంస్థ వారు 6 కంప్యూటర్లను అందించారు.
- ఆశ ఇన్‌ట్రస్టు వారు పాఠశాల విద్యార్థులందరికీ నోట్‌బుక్స్ అందించారు.
- వాట(వాషింగ్‌టన్ తెలుగు) వారు 26 బెంచీలను అందించారు.
- క్యూరోప్ స్వచ్ఛంద సంస్థ వారు 10 బెంచీలను, 5 ర్యాక్‌లను,
- ఓయూ ప్రొఫెసర్ నీలకంఠం శుద్ధ జల ప్లాంటును అందించారు.
- పద్మావతి చారిటబుల్ ట్రస్టు హైదరాబాద్ వారు ప్రొజెక్టర్ అందజేశారు.

ప్రైవేటు విద్యావలంటీర్లతో..

పాఠశాలలో రెగ్యులర్ టీచర్లు ఇద్దరే ఉన్నారు. విద్యార్థుల సంఖ్య పెరగడంతో ప్రైవేటుగా నలుగురు విద్యా వలంటర్లను నియమించారు. వీరికి వేతనాలు కూడా స్వచ్ఛంద సంస్థలే చెల్లిస్తున్నాయి.

పక్క గ్రామాల నుంచి విద్యార్థులు..

చాలా గ్రామాల్లో ఆంగ్ల మాధ్యమ చదువుకు పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపిస్తున్నారు. రెబ్బనపల్లి ప్రాథమిక పాఠశాలకు మాత్రం గ్రామంలోని పిల్లలతో పాటు సమీప గ్రామాలైన ఎల్లారం, చింతపల్లి, నెల్కివెంకటాపూర్, ఇప్పలగూడ, చెల్కగూడెం, ముత్యంపేట గ్రామాల నుంచి కూడా విద్యార్థులు వస్తున్నారు. ఇందులో గ్రామానికి చెందిన వారు 100 మంది ఉంటే సమీప గ్రామాల నుంచి వచ్చే వారు మరో 70 మంది విద్యార్థులు ఉండటం విశేషం.

- సర్కారు బడిలో... కార్పొరేట్ వసతులు
- ఆదర్శంగా రెబ్బనపల్లి ప్రాథమిక పాఠశాల
- స్వచ్ఛంద సంస్థల సహకారంతో అభివృద్ధి
- ఆంగ్లమాధ్యమంలో విద్యా బోధన
- ఏటేటా పెరుతున్న విద్యార్థుల సంఖ్య

మెరుగైన వసతులు..


కంప్యూటర్ నేర్చుకుంటున్న విద్యార్థులు

స్వచ్ఛంద సంస్థల సహకారంతో పాఠశాలలోని విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించారు. ఇందులో ముఖ్యంగా విద్యార్థులకు కూర్చునేందుకు డెస్క్ బెంచీలు, ప్రాథమిక స్థాయిలోనే కంప్యూటర్ శిక్షణ, ప్రొజెక్టర్ ద్వారా పాఠాలు, తాగేందుకు మినరల్ వాటర్, గ్రంథాలయం, విద్యార్థులకు ఉచిత యోగా, కరాటే శిక్షణ కూడా నేర్పిస్తున్నారు.


...ం వేళ ప్రత్యేక తరగతులు


అల్పాహారం చేస్తున్న విద్యార్థులు


ప్రొజెక్టర్ ద్వారా పాఠాలు తిలకిస్తున్న విద్యార్థులు



న్యూస్ బాక్స్

పంపిణీకి సిద్ధంగా సీఎంపీఎఫ్ చీటీలు

శ్రీరాంపూర్(మంచిర్యాల): శ్రీరాంపూర్ డివిజన్‌లో కార్మికులకు ఇవ్వాల్సిన సీఎంపీఎఫ్ చీటీలు సిద్ధం అయ్యాయని గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ బ్రాంచి ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2015, 2016కు సంబంధించిన చీటీలు ఆలస్యం అయ్యాయని, దీనిపై తమ సంఘం అధ్యక్షుడు బి.వెంకట్రావు సీఎంపీఎఫ్ అధికారులు, సింగరేణి యాజమాన్యంతో మాట్లాడటంతో పరిష్కారం అయ్యిందన్నారు. వారంరోజుల్లో అన్ని గనులకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

28న మెగా వైద్యశిబిరం

మందమర్రి(చెన్నూర్): మందమర్రి మండల పరిధిలోని సారంగపల్లిలో ఈ నెల 28న సింగరేణి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు డీజీఎం పర్సనల్ గోవిందరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏరియా పరిసర గ్రామాల ప్రజల సంక్షేమం కోసం ప్రత్యేక వైద్యనిపుణులతో శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఉదయం 8:00 నుంచి సాయంత్రం 5గంటల వరకు వైద్యశిబిరం నిర్వహిస్తామన్నారు. వైద్యసేవలు పొందే వారు ఈనెల 6లోగా గ్రామపంచాయతీ కార్యాలయంలో తమపేర్లను నమోదు చేసుకోవాలన్నారు.ఈఅవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అంబేద్కర్ విగ్రహానికి వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మంచిర్యాలటౌన్: మహారాష్ట్రంలోని బీమా కోరెగావ్ గ్రామంలో దళితులపై జరిగిన దాడిని ఖండిస్తూ శుక్రవారం ఐబి చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి ఆర్పీఐ పార్టీ నాయకులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ మాట్లాడుతూ దేశంలో పలుచోట్ల దళితులపై దాడులు జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్పీఐ జిల్లా ఇంచార్జి వేముల ప్రేంసాగర్, జైపాల్‌సింగ్, మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం నాయకులు సెగ్గం ప్రసాద్, కొండ లక్ష్మణ్, గాబ్రియేల్, కామెర క్రాంతి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

లూయిస్‌బ్రెయిలీ జయంతి వేడుకలు

మంచిర్యాలటౌన్: పట్టణంలోని అంధుల పాఠశాలలో శుక్రవారం మమత సభ్యులు లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలను నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అవయవాలన్నింటిలో కళ్లు చాలా ముఖ్యమైనవని, ప్రపంచాన్ని చూడలేక పోయిన వారికోసం లూయిస్ బ్రెయిలీ చేసిన కృషి చాలా గొప్పదని ప్రశంసించారు. అనంతరం పిల్లలకు బియ్యం, కందిపప్పు, చింతపండు అందించారు. మమత అధ్యక్షురాలు నాగమణి, సభ్యులు ఇందిరాదేవి, భాగ్యలక్ష్మి, చంద నాకుమారి, సునీత, పద్మ, చంద్రదత్, అన్నపూర్ణ పాల్గొన్నారు.

సింగరేణిలో క్రీడలకు ప్రోత్సాహమేది?

- మూడేళ్లుగా అందని స్పోర్ట్స్ మెటీరియల్
- కోల్‌ఇండియా వెళ్లినా ఇప్పటికీ కనీసం యూనిఫాం కరువు



సింగరేణి స్థాయి పోటీల్లో ఆడుతున్న క్రీడాకారులు(ఫైల్)

కాసిపేట(బెల్లంపల్లి): సింగరేణిలో నాలుగేళ్లుగా క్రీడాకారులకు ప్రోత్సాహం కరువైంది. కార్మికులను క్రీడలకు దూరంచేసే ప్రయత్నాల్లో భాగంగా యాజమాన్యం కనీస ప్రోత్సాహం అందించడంలేదని క్రీడాకారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కోల్‌ఇండియా, కంపని లెవెల్ క్రీడల్లో రాణించిన కార్మికులకు కనీసం స్పోర్ట్స్ యూనిఫాం మూడేళ్లుగా అందించకపోవడంతో యాజమాన్యం తీరుపై కార్మికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కార్మికుల సంక్షేమానికి కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నామని చెప్తున్న యాజమాన్యం క్రీడాకారులను పట్టించుకోవడంలేదని వారు వాపోతున్నారు. గతంలో సింగరేణిలో ఏరియా స్థాయిలో ఎంపికై రీజియన్ స్థాయిలో, కంపనీస్థాయిలో, కోల్‌ఇండియా పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు ముందస్తుగా క్రీడాసామగ్రి, షూ, అప్పర్, లోయర్, షాట్ లాంటి దుస్తులు అందచేసేవారు. ప్రస్తుతం రెండుసార్లు కోల్‌ఇండియా పోటీల్లో పాల్గొనిరాగా మూడోసారి ఈసంవత్సరం సైతం కంపనీ లెవెల్ పోటీలు, కోల్‌ఇండియా ఈవెంట్‌లు సైతం ముగిసినా నేటికీ వారికి క్రీడాసామగ్రి అందించలేదు. మొదట డిపార్ట్‌మెంట్ల వారిగా ఎంపిక చేసిన క్రీడాకారులు ఏరియాస్థాయిలో క్రీడల్లో పాల్గొంటారు. అందులో రాణించిన వారిని రీజియన్‌స్థాయిలో ఎంపిక చేస్తారు. అక్కడినుంచి కంపనీ లెవెల్ పోటీల్లో పాల్గొంటారు. అందులో రాణించినట్లయితే కోల్‌ఇండియా పోటీల్లో పాల్గొంటారు. సుమా రు ఏరియాకు 200 నుంచి 250 మంది క్రీడాకారులను ఎంపిక చేస్తారు. కంపనీ వ్యాప్తంగా 2,300ల మంది కార్మికులకు షూ, క్రీడాదుస్తులు అందించాలి. వారి నుంచి కంపని స్థాయిలో ఏరియాకు 100 నుంచి 150మంది క్రీడకారులు మొ త్తం 1500 మందికి ఈవెంట్ ఆధారంగా షూ, అప్పర్, లోయర్, టీషర్ట్, ఇతర సామగ్రి అందించాల్సి ఉంది. ఈవెంట్‌లలో భాగంగా కోల్‌ఇండియాకు 100నుంచి150 మంది వరకు కంపని వ్యాప్తంగా ఎంపిక చేస్తారు. వారికి పైసామాగ్రితో పాటు బ్యాగ్, ఇతర సామగ్రి అందించాల్సి ఉన్నా 2015, 2016తో పాటు 2017సంవత్సరానికి సంబంధించిన మెటీరియల్ నేటికీ అందలేదు. కోల్‌ఇండియా పోటీలకు వెళ్లే కార్మికులకు రెండు విభాగాల్లో డ్రెస్, షూ అందించాల్సి ఉండగా ఒక్కవిభాగంలో సైతం అందలేదు.

క్రీడాకారుల ఆగ్రహం

ఈఏడాది క్రీడాషెడ్యూల్ ప్రారంభమై పోటీల నిర్వహణ ముగిసేందుకు వచ్చినా పాత మెటీరియల్ రాకపోవడం పట్ల సింగరేణి క్రీడాకారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కంటే తెలంగాణ రాష్ట్రంలో సింగరేణి పరిస్థితి అధ్వానంగా ఉందని వారు వాపోతున్నారు. మూడేళ్ల క్రితం కొంత ఆలస్యమైనా రెండుసంవత్సరాలవి కలిపి ఒకేసారి ఇచ్చినా నేడు ఇంకా ఇవ్వకపోవడం దారుణమని క్రీడాకారులు పేర్కొంటున్నారు. క్రీడాసామగ్రి కొనుగోలులో ప్రధానపాత్ర వహించే అధికారి, నాయకులు కుట్రలు పన్ని నిధులు దుర్వినియోగానికి పాల్పడే ప్రయత్నాలు చేస్తున్నట్లు క్రీడాకారులు ఆరోపిస్తున్నారు. కోల్‌ఇండియాలో పతకం సాధించినా ఫలితం లేదని సింగరేణి క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యాజమాన్య నిర్ణయమా? లేక అధికారుల నిర్లక్ష్యమా? అనే అంశంపై యాజమాన్యం పూర్తిగా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వారు సూచిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి క్రీడాకారులకు సామగ్రి పంపిణీ చేయడంతో పాటు తగిన ప్రోత్సాహం అందించాలని వారు కోరుతున్నారు.

కార్మికులను మోసగించడం తగదు

జెడ్పీటీసీల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు ఏమాజీ



సమావేశంలో మాట్లాడుతున్న ఏమాజీ

కాసిపేట(బెల్లంపల్లి): స్వప్రయోజనాల కోసం కార్మికులను మోసంచేయడం తగదని జెడ్పీటీసీల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు, బీజేపీ రాష్ట్రకార్యవర్గసభ్యుడు కోయ్యాల ఏమాజీ విమర్శించారు. శుక్రవారం సోమగూడెంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని ఓరియంట్ సిమెంటు కంపనీలో పర్మినెంటు, కాంట్రాక్టు కార్మికుల గుర్తింపుసంఘం కాలంగడిచి ఏళ్లు గడుస్తున్నా ఎన్నికలు నిర్వహించడం లేదన్నారు. కాలపరిమితి ముగిసి రెండేళ్లు కావస్తున్నా ప్రస్తుతం గుర్తింపుసంఘం అధ్యక్షుడిగా కొనసాగుతున్న ఎమ్మెల్సీ రాములు నాయక్ ప్రభుత్వ అండతో ఎన్నికలు అడ్డుకుంటున్నాడని ఆరోపించారు. కంపనీలో కార్మికులకు కనీసవేతనం రూ.18వేలు, సమానపనికి సమానవేతనం సుప్రీంకోర్టు నిర్ణయం అమలు లేదన్నారు. సింగరేణిలో పెంచిన మాదిరి కాంట్రాక్టు కార్మికులకు వేతనాల పెంపులేదన్నారు. తక్షణమే సమస్యలు పరిష్కరించి ఎన్నికలు నిర్వహించనిపక్షంలో కార్మికులను కలుపుకోని ఆందోళనలు ఉధృతం చేయనున్నట్లు ఆయన హెచ్చరించారు. ఈకార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి బి.కేశవరెడ్డి, జిల్లా కార్యదర్శి దూది ప్రకాష్, పర్యావరణసెల్ రాష్ట్ర జాయింట్ కన్వీనర్ కుసుమ భాస్కర్, స్వచ్ఛభారత్ జిల్లా చైర్మన్ కె.గోవర్ధన్, ఉమ్మడి జిల్లాల ఆర్గనైజింగ్ కార్యదర్శి సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

రైల్వేట్రాక్ నిర్వాసితుల ఇళ్లు పరిశీలించిన జేసీ



నిర్వాసిత ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జేసీ సురేందర్‌రావు

శ్రీరాంపూర్(మంచిర్యాల): ఎస్టీపీపీ రైల్వేలైన్‌తో ముంపునకు గురవుతున్న సింగపూర్ ఎస్సీ కాలనీలోని ఇళ్లను శుక్రవారం జాయింట్ కలెక్టర్ సురేందర్‌రావు, ఆర్డీవో శ్రీనివాస్, ఓసీపీ పీవో కవీంద్రతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మిస్సింగ్ ఇళ్లపై నిర్వాసితులు జేసీకి మొరపెట్టుకున్నారు. ఇప్పటికే ట్రాక్ కింద ఇళ్లుపోతున్న నిర్వాసితులకు ప్లాట్లు ఇచ్చామని, కొన్ని ఇళ్లు మిస్సవడంతో డబ్బులు రాలేదన్నారు. అలాంటి వారు మళ్లీ దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి వారం రోజుల్లో డబ్బులు ఇప్పిస్తామన్నారు. రైల్వే పనులకు ఆటంకం లేకుండా నిర్వాసితులు ప్రభుత్వానికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో నస్పూర్ తహసీల్దార్ కుమారస్వామి, సింగపూర్ సర్పంచ్ మల్లేత్తుల రాజేంద్రపాణి, ఓసీపీ రక్షణాధికారి వెంకటేశ్వర్‌రెడ్డి, ఎస్టేట్ అధికారి బాలసుబ్రమణ్యం, ఎంపీటీసీ అగ్గు భాగ్యమల్లేశ్, నాయకులు జనార్దన్, అనసూర్య పాల్గొన్నారు.

ఆర్కే7లో ప్రమోషన్ పత్రాలు అందజేత



ప్రమోషన్ పత్రాలు అందిస్తున్న ఇన్‌చార్జి మేనేజర్ లింగమూర్తి

శ్రీరాంపూర్(మంచిర్యాల): ఆర్కే7 గనిపై శుక్రవారం గని ఇంచార్జి మేనేజర్ పీ లింగమూర్తి కార్మికులకు సర్వీస్ లింక్డ్ ప్రమోషన్లు(ఎస్ఎల్పీ) అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గని వార్షిక ఉత్పత్తి లక్ష్యసాధనలో కార్మికులు కష్టపడి పనిచేస్తున్నారన్నారు. ఇప్పటికే నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యంలో 105 శాతం సాధించామని, దీన్ని 110 శాతానికి పెంచుకోవాలన్నారు. డిప్యూటీ మేనేజర్లు సంపత్, వెంకటేశ్, పిట్ ఇంజనీర్లు రవీంద్ర, రామకృష్ణ, వెంటిలేషన్ అధికారి జగదీశ్వర్‌రావు, సర్వే అధికారి రాజేశ్వర్‌రావు, సంక్షేమాధికారి శివకుమార్, అసిస్టెంట్ పిట్ సెక్రెటరీ నాగయ్య పాల్గొన్నారు.

ఉనికి చాటుకునేందుకే జనార్దన్ ఎత్తుగడలు



మాట్లాడుతున్న విప్

మందమర్రి(చెన్నూర్): తన రాజకీయ జీవితం కనుమరుగు అవుతుందనే మాజీ మంత్రి జనార్ధన్ ఉనికి చాటేందుకే కబ్జా పేరుతో కొత్త ఎత్తుగడ వేస్తున్నాడని ప్రభుత్వ విప్ నల్లాల ఓదెలు అన్నారు. శుక్రవారం విప్ తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జనార్దన్‌పై మండిపడ్డారు. మండల శివారులోని గిరిజన వ్యక్తి భూమిని తాను కబ్జా చేసినట్లు బోడ జనార్దన్ ఆరోపించడం విడ్డూరంగా ఉందన్నారు. అవినీతి చేసినట్లు నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని నిరూపించకపోతే రాజకీయాల నుంచి తప్పుకుంటావా అని సవాల్ విసిరారు. పట్టణంలో కలిసిమెలిసి జీవిస్తున్న గిరిజనులు, గిరిజనేతరుల మధ్య చిచ్చుపెట్టి ఘర్షన వాతావారణం కలిగించే వ్యవహరిస్తున్నాడన్నారు. నిరాధారమైన ఆరోపణలు మానకుంటే నియోజక వర్గ ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. సమావేశంలో మెడిపల్లి సంపత్, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యంమేర ఉత్పత్తి చేయాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సీఎండీ శ్రీధర్

సింగరేణి సీఎండీ శ్రీధర్

గోదావరిఖని(పెద్దపల్లి జిల్లా), కోల్‌బెల్ట్ (భూపాలపల్లి జిల్లా), సింగరేణి (కొత్తగూడెం):

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మిగిలిన మూడు నెలల కాలంలో లక్ష్యాల మేర బొగ్గు ఉత్పత్తి, రవాణా చేయాలని సింగరేణి సీఎండీ ఎన్.శ్రీధర్ సంస్థలోని 11 ఏరియాల జీఎంలను ఆదేశించారు. రానున్న మూడేళ్లలో ప్రారంభం చేయాల్సిన కొత్త గనులపై కూడా ఏరియాల వారీగా హైదరాబాద్ లోని సింగరేణి భవన్‌లో శుక్రవారం ఆయన ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. డిసెంబర్ నెలతో ముగిసిన తొమ్మిది నెలల కాలంలో సాధించిన ప్రగతిని సమీక్షించారు. మిగిలిన మూడు నెలల కాలంలో రోజుకు 2.10లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా జరపాలని సూచించారు. నిర్దేశిత వార్షిక లక్ష్యాలను సాధించి తద్వారా పెరిగిన రాష్ట్ర విద్యుత్ అవసరాలకు తగినంత బొగ్గు అం దించాలన్నారు. డిసెంబర్‌తో ముగిసిన తొమ్మి ది నెలల్లో 420 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేశామని, మార్చి నాటికి మిగిలిన 90 రోజుల్లో మరో 200 లక్షల టన్నుల బొగ్గు ఉత్ప త్తి జరగాలని అన్నారు. డిసెంబర్ చివరి నాటికి గత ఏడాది కన్నా 9శాతం వృద్ధితో 467 లక్షల టన్నుల రవాణా చేశామని, ఇంకా మిగిలిన మూడు నెలల కాలంలో ఇంకా 193 లక్షల టన్నుల రవాణా చేసేందుకు ప్రణాళికలు రూ పొందించాలన్నారు. డిసెంబర్ నెలాఖరుకు గత ఏడాదిపై 28 శాతం వృద్ధితో 282.9 మిలియన్ క్యూబిక్ మీటర్ల ఓబీని తొలగించామని, మిగిలిన మూడు నెలల కాలంలో రోజుకు 14లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ తొలగించాలని చెప్పారు. త్వరలో ప్రారంభించనున్న కొత్త గనులపై కూడా సమీక్ష నిర్వహించారు. ఒడిశా రాష్ట్రంలోని నైనీ బొగ్గు గని ప్రారంభానికి సంబంధించిన ఏర్పాట్లపై కూడా నైనీ బ్లాకు జీఎం విజయరావుకు ఆదేశాలు జారీ చేశారు. పీఅండ్‌పీ డైరెక్టర్ బి.భాస్కర్ రావు, ఆపరేషన్స్ డైరెక్టర్ ఎస్. చంద్రశేఖర్, ఈఅండ్‌ఎం డైరెక్టర్ ఎస్.శంకర్, మార్కెటింగ్ జీఎం బి.కిషన్‌రావు, పీఅండ్‌పీ జీఎం ఆంథోని రాజా, సీడీఎస్ జీఎం జె.నాగయ్య, మెటీరియల్ ప్రొక్యూర్‌మెంట్ జీఎం టి.నాగేశ్వర్‌రావు, జీఎం వై.రాజేశ్వర్‌రెడ్డి, జీఎంలు వైజీకే మూర్తి, టి.వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

16న ఈపీ ఆపరేటర్లకు ఆన్‌లైన్ కౌన్సెలింగ్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో ఉన్న ఆపరేటర్ 105 పోస్టులకు ఈ నెల 16న వివిధ ఏరియాలలో ఆన్‌లైన్ కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు, ఈ కౌన్సెలింగ్ టీబీజీకేఎస్ ఒత్తిడి వలనే యాజమాన్యం నిర్వహించనున్నదని టీబీజీకేఎస్ నాయకులు, ఆకునూరి కనకరాజు తెలిపారు. శుక్రవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ బీ,సీ,డీ గ్రేడ్ ల వారీగా సీనియర్లకు ఉదయం 11.30 గంటలకు, జూనియర్లకు అదేరోజు మధ్యాహ్నం 2.30 గంటలకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్ కౌన్సెలింగ్ కొత్తగూడెం కార్పొరేట్ ఏరియాలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో, ఆర్‌జీ- 1 ఏరియాలోని టీటీసీ సెంటర్‌లో, శ్రీరాంపూర్ ఏరియాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

7న సూపర్ స్పెషాలిటీ వైద్య శిబిరం

సింగరేణి(కొత్తగూడెం): ఈ నెల 7న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 రెండు గంటల వరకు కొత్తగూడెంలోని సింగరేణి ప్రధానాస్పత్రిలో సూపర్ స్పెషాలిటీ వైద్యులు వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు జీఎం పర్సనల్ ఏ.ఆనందరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని కామినేని, యశోద, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల కార్డియాలజిస్ట్, న్యూరాలజిస్ట్, యురాలజిస్ట్, నెఫ్రాలజిస్ట్, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్, అంకాలజిస్ట్ తదితర వైద్య నిపుణులు శిబిరానికి హాజరవుతారని పేర్కొన్నారు. సింగరేణీయులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రవాణాలో అగ్రగామి కొత్తగూడెం


ఆర్‌సీహెచ్‌పీలో బొగ్గు లోడింగ్ దృశ్యం

- రైలు మార్గంలో 53.81 లక్షల టన్నుల బొగ్గు తరలింపు
- రోడ్డుమార్గంలో 15.41 లక్షల టన్నులు..

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా బొగ్గు ఉత్పత్తితోపాటు బొగ్గు రవాణాలో కూడ సింగరేణి వ్యాప్తంగా అగ్రగామిగా నిలుస్తోంది. ఒక్క డిసెంబర్ మాసంలో 10.18 లక్షల టన్ను ల ఉత్పత్తిచేసి రికార్డ్ నెలకొల్పింది. 2017-18 ఆర్థిక సంవత్సరంలో గత ఏప్రిల్ మాసం నుంచి డిసెంబర్ వరకు(9 నెలల కాలంలో) రైలు మార్గం ద్వారా 53, 81,92,858 టన్నులను, రోడ్డు (లారీల ద్వారా) 15,41, 56,052 లక్షల టన్నులు... మొత్తం 69,23, 48,910 టన్నుల బొగ్గును రుద్రంపూర్‌లోని కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ ద్వారా తరలించారు.

బొగ్గు రవాణా వివరాలు

ఏరియాల పేర్లు	రైలు మార్గం ద్వారా రవాణా	రోడ్డు మార్గం ద్వారా..
కొత్తగూడెం	53,81,92,858	15,41,56,052
ఇల్లెందు	22,56,454	8,54,037
మణుగూరు	42,28,809	8,67.300
బెల్లంపల్లి	36,39,73,178	7,67,30.014
మందమర్రి	20,74,06,424	7,33,37,176
శ్రీరాంపూర్	22,29,15,346	18,68,98.349
ఆర్జీ-1	36,07,85,194	26,75,44.415
ఆర్జీ-2	4,45,20,011	3,42,71,414
ఆర్జీ-3	0	0
భూపాలపల్లి	0	25,22,61,572
అడ్రియాల ప్రాజెక్ట్	0	88,273
మొత్తం	27,96,99,941	1,22,62,04,992

ఓసీలకు వ్యతిరేకంగా పోరాడుదాం

ఓపెన్ కాస్టుల వ్యతిరేక పోరాట కమిటీ సమావేశంలో అఖిలపక్షం పిలుపు


సదస్సుకు హాజరైన ప్రజలు


మాట్లాడుతున్న న్యూడెమోక్రసీ నేత మధు

గుండాల(భద్రాద్రి కొత్తగూడెం): గుండాల నుంచి భూపాలపల్లి వరకు విస్తరిస్తున్న ఓపెన్ కాస్టులకు వ్యతిరేకంగా ఉద్యమించాలని అఖిల పక్ష రాజకీయ నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం గుండాలలో జరిగిన ఓపెన్ కాస్టుల వ్యతిరేక పోరాట కమిటీ సమావేశంలో న్యూడెమోక్రసీ, సీపీఎం రాష్ట్ర నాయకులు ఆవునూరి మధు, పోతినేని సుదర్శన్‌రావు మాట్లాడారు. అభివృద్ధి, అవసరాల పేరుతో పాలకులు విధ్వంసపు విధానాలను అవలంబిస్తున్నారని విమర్శించారు. ఓపెన్‌కాస్టుల ద్వారా బొగ్గు వెలికితీస్తే తీవ్రమైన నష్టాలుంటాయని పర్యావరణ వేత్తలు, శాస్త్రవేత్తలు సూచించినా పాలకులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం గుండాల నుంచి భూపాలపల్లి వరకు ఓపెన్‌కాస్టులకు విస్తరించేందుకు ప్రణాళికలు రూపొందిస్తోందన్నారు. సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు ఎస్‌కె సాబీర్‌పాషా, అన్నవరపు కనకయ్య మాట్లాడుతూ ఓసీలతో సహజసిద్ధమైన అడువులు, గోదావరిలోయ పరీవాహక ప్రాంతంలోని సారవంతమైన పచ్చని పంటపొలాలు విధ్వంసమవుతాయని అన్నారు. లక్షలాది ఎకరాల్లో వ్యవసాయం, వందలాధి గ్రామాలు కనుమరుగు అవుతాయన్నారు. ప్రజలు సర్వస్వం కోల్పోతారన్నారు. టీడీపీ నాయకులు వట్టం నారాయణ, తుడుందెబ్బ రాష్ట్ర ప్రచార కార్యదర్శి జవాజీ లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ నాయకులు పోషం నర్సింహారావు, తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్, అఖిలపక్ష నాయకులు బీ.శ్రీను, నిత్యానందం, వి.చంద్రయ్య, కొమరం శాంతయ్య, కోరం సీతారాములు పాల్గొన్నారు.

ర్యాలీకి అనుమతించని పోలీసులు

గుండాల మండల కేంద్రంలో ఓపెన్‌కాస్టుల వ్యతిరేక పోరాట కమిటీ ర్యాలీకి పోలీసులు అనుమతి నిరాకరించారు. 144 సెక్షన్ నేపథ్యంలో ర్యాలీ నిర్వహించొద్దంటూ అడ్డుకున్నారు. దీంతో నాయకులు సదస్సు నిర్వ హించుకుని వెనుదిరిగారు.

బాస్కెట్‌బాల్ పోటీలు ప్రారంభం

కోల్‌బెల్ట్(భూపాలపల్లి జిల్లా): భూపాలపల్లి ఏరియాలో డిపార్ట్‌మెంటల్ స్థాయి బాస్కెట్ బాల్ పోటీలను శుక్రవారం పర్సనల్ మేనేజర్ డాక్టర్ రాజేంద్రకుమార్ ప్రారంభించారు. ఏరియా వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. కేటీకే 1, 5, కేఎల్‌పీ, ఓసీపీ జట్ల మధ్య మ్యాచ్‌లు జరిగాయి. తొలుత పర్సనల్ మేనేజర్ క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో క్రీడల గౌరవ కార్యదర్శి ఎండీ మధార్ సాహెబ్, స్పోర్ట్స్ ఆఫీసర్ పర్స శ్రీనివాస్, కో-ఆర్డినేటర్ బానోతు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి విద్యార్థుల విరాళం

ఇల్లెందుఅర్బన్: హైదరాబాద్‌లోని ఓ అనాథాశ్రమంలోని వికలాంగులకు ఇల్లెందుఏరియా సింగరేణి ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆర్థిక సాయం చేశారు. రూ 56,600 విరాళాలు సేకరించి ఇటీవల వారికి అందజేసి వారి సేవా దృక్పథం చాటుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాల కరస్పాడెంట్, ఏరియా పర్సనల్‌మేనేజర్ లక్ష్మీనారాయణ విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం నిర్మలరాణి, ఉపాధ్యాయులు నారయణ,వీరభద్రం, లక్ష్మీ,రజిత, రవి, తదితరులు పాల్గొన్నారు.


ప్రశంస పత్రాలతో విద్యార్థులు, పాఠశాల యాజమాన్యం

వెండితెర



మంచిర్యాలలో..
శ్రీవెంకటేశ్వర–
హలో
ఏషియన్ శ్రీనివాస –
ఎంసీఏ, (మిడిల్ క్లాస్ అబ్బాయి)
లక్ష్మి – ఒక్క క్షణం
మయూరి – 2 కంట్రీస్
తిరుమల(స్క్రీన్–1)(సీసీసీ)–
ఎంసీఏ, (మిడిల్ క్లాస్ అబ్బాయి)
దేవి(స్క్రీన్–2)(సీసీసీ) –
హలో

స్లేట్ స్కూల్‌లో అటల్ టింకరింగ్ ల్యాబ్

ఉమ్మడి జిల్లా నుంచి ఎంపికైన పాఠశాల

జన్నారం: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడంతో పాటు శాస్త్రవేత్తలుగా తయారు చేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకం అటల్ ఇన్నోవేషన్ మిషన్. ఈ పథకం కింద దేశ వ్యాప్తంగా రూ.900 కోట్ల వ్యయంతో 1500 పాఠశాలల్లో అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు ఏర్పాటు చేయనున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇందుకు జన్నారం మండల కేంద్రంలోని స్లేట్ హైస్కూల్‌ను ఎంపిక చేశారు. ఈ మేరకు అటల్ ఇన్నోవేషన్ మిషన్ డైరెక్టర్ రమనన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు పాఠశాల హెచ్‌ఎం ఏనుగు శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

కేంద్ర ప్రభుత్వం ఈ ల్యాబ్ నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు చేస్తూ, 5 సంవత్సరాలకు నిర్వహణ ఖర్చులకుగాను మరో రూ.10 లక్షలు ఇవ్వనుంది. ఈ ల్యాబ్‌ను మండలంలోని 6 నుంచి 12 వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఉపయోగించుకోవచ్చు. అరుదైన అవకాశం జన్నారానికి దక్కడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ల్యాబ్ ఏర్పాటయితే మండలంలోని విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన పెంచి, వారిలో ఉన్న సృజనాత్మకతను బయటకు తీసే అవకాశం ఉంది.



జన్నారంలో స్లేట్ ఉన్నత పాఠశాల

చాలా ఆనందంగా ఉంది

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే మా పాఠశాలకు అటల్ ఇన్నోవేషన్ మిషన్ పథకానికి ఎంపిక కావడం చాలా ఆనందంగా ఉంది. ఈ మేరకు డైరెక్టర్ నుంచి లెటర్ అందింది. నిధులు మంజూరయితే పాఠశాలలో ల్యాబ్ నిర్మాణం చేయిస్తారు. ఈ అవకాశాన్ని మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులు ఉపయోగించుకుని మేధో శక్తిని పెంపొందించుకోవాలి.

– ఏనుగు శ్రీకాంత్‌రెడ్డి, హెచ్‌ఎం, స్లేట్ హైస్కూల్

ఎస్సీ వర్గీకరణ చేపట్టాల్సిందే

- ఎమ్మార్పీఎస్ నాయకుల డిమాండ్
- బీజేపీ కార్యాలయం ముట్టడి

మంచిర్యాలటౌన్: కేంద్ర ప్రభుత్వం వెంటనే ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని బీజేపీ కార్యాలయాన్ని ముట్టడించారు. సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జి మంత్రి మల్లేష్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతియుతంగా పోరాడుతున్న మందకృష్ణను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్యాయంగా జైల్లో పెట్టాయని అన్నారు. బీజేపీ ఎన్నికల హామీ మేరకు వర్గీకరణ చేపట్టాలని కోరారు. ఆందోళనలో నాయకులు గొడిసెల దశరథం, చెన్నూరి శ్రీనివాస్, గడ్డం బానయ్య, స్వరూప, నిర్మల, అనంత, లక్ష్మి, మహాలక్ష్మి, చంద్రశేఖర్, చందు, మల్లేష్, సారంగం, రాజలింగు తదితరులున్నారు.


బీజేపీ కార్యాలయం ఎదుట ఆందోళన

నస్పూర్: మందకృష్ణను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కుమారస్వామికి వినతిపత్రం అందజేశారు. మందకృష్ణను విడుదల చేయకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని నాయకులు హెచ్చరించారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి చుంచు శంకర్‌వర్మ, మల్లేష్, సమ్మయ్య తదితరులున్నారు.

తైక్వాండోతో ఆత్మ రక్షణ

లక్సెట్టిపేట: తైక్వాండోతో విద్యార్థులకు ఆత్మ రక్షణ కలుగుతుందని ఎంఈవో రవీందర్ పేర్కొన్నారు. మండలంలోని గుల్లకోటలో శ్రీకోదండ రామాలయం ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తైక్వాండో ఉచిత శిక్షణను శుక్రవారం ఎంఈవో ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తైక్వాండో ఆత్మరక్షణగా, శారీరకంగా ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బోగ చంద్రయ్య, కోచ్ వెంకటస్వామి, సుధాకర్, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.


శిక్షణను ప్రారంభిస్తున్న ఎంఈవో

నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇప్పించాలి

మంచిర్యాలటౌన్: జిల్లాలోని నిరుపేదలకు ఇండ్ల స్థలాలు ఇప్పించాలని న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దివాకర్‌రావుకు శుక్రవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి జాడి దేవరాజ్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నారని తెలిపారు. మంచిర్యాల పట్టణం రాజీవ్‌నగర్‌లో 345 సర్వే నంబర్‌లో గల ప్రభుత్వ భూమిలో గత 15 రోజులుగా పేద ప్రజలు గుడిసెలు వేసుకొని జీవనం సాగిస్తున్నారని తెలిపారు. వారికి అవసరమైన స్థలాన్ని కేటాయించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే విషయాన్ని సీఎం దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మేకల రామన్న, నాయకులు ఆర్.సుధాకర్, కొండపర్తి శంకర్, ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కార్యదర్శి మధు, రజక సంఘం జిల్లా కార్యదర్శి జి.సాగర్, భూపోరాట కమిటి సభ్యులు రమేష్, చంద్రరమొగిలి, వెంకటేష్, లక్ష్మణ్, రాజు, ఆదిలక్ష్మి, సువర్ణ, రోజా, వైశాలి, సుమలత తదితరులున్నారు.


ఎమ్మెల్యే దివాకర్‌రావుకు విన్నవిస్తున్న నాయకులు

ఆర్టీసీ డిపో ఎదుట టీఎంయూ ధర్నా

మంచిర్యాలఅర్బన్: ఆర్టీసీ కార్మికుల నూతన వేతన సవరణపై యాజమాన్య మొండివైఖరి, దేశవ్యాప్తంగా రవాణా వ్యవస్థ, డ్రైవర్లకు వ్యతిరేకంగా రాజ్యసభలో బిల్లుపెట్టడాన్ని నిరసిస్తూ శుక్రవారం మంచిర్యాల డిపో ఎదుట టీఎంయూ ధర్నా చేపట్టింది. మధ్యాహ్న భోజన విరామ సమయంలో ధర్నా నిర్వహిస్తూ కార్మిక వ్యతిరేక చర్యలను తీవ్రంగా ఖండించారు. ఆందోళనలో టీఎంయూ డిపో అధ్యక్షుడు తోట సత్తయ్య, కార్యదర్శి శ్రీనివాస్‌రావు, గ్యారేజ్ సెక్రటరీ బాబన్న, నాయకులు నాగరాజ్, రమేశ్, సాబీర్‌పాషా, శ్రీహరి, శంకర్, సమ్మయ్య, సత్తయ్య తదితరులున్నారు.



ధర్నా చేపడుతున్న నాయకులు, కార్యకర్తలు

ఎత్తిపోతల ద్వారా సాగునీరందించాలి

- ఇరిగేషన్ అధికారులను కలిసిన రైతులు

దండేపల్లి: మండలంలోని గూడెం, రంగంపల్లె పంట భూములకు గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఎత్తిపోతల ద్వారా సాగు నీరందించాలని రైతులు డిమాండ్ కోరారు. గూడెం ఎత్తిపోతల పథకం పంప్‌హౌజ్‌ను ఇరిగేషన్ విభాగం రాష్ట్ర చీప్‌ఎగ్జిక్యూటివ్ ప్లానింగ్ అధికారి పెంటారెడ్డి, ఎల్లంపల్లి ఎస్‌ఈ ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల రైతులు అధికారులను కలిసి విన్నవించారు. నిర్మాణ సమయంలో గేట్‌వాల్వ్ ఏర్పాటు చేస్తామని చెప్పి తీరా పథకం ప్రారంభించాక కుదరదని చెప్పారని, ఈ విషయంలో పునరాలోచన చేసి తమ భూములకు సాగు నీరందించేలా చూడాలని కోరారు. అధికారులకు విన్నవించిన వారిలో ఎంపీటీసీ ముత్తె నారాయణ, నాయకులు వల్లంభట్ల శ్రీనివాస్, రవి, రామన్న, బాపు, రాజన్న, సాంబయ్య, సత్యనారాయణ ఉన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం

నస్పూర్: నస్పూర్ గ్రామంలో అబ్దుల్ సమీర్ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నీని ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు శుక్రవారం ప్రారంభించారు. ఆటగాళ్లు క్రీడాస్ఫూర్తి ప్రదర్శించాలని ఈ సందర్భంగా సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ బేర సత్యనారాయణ, సర్పంచ్ వేల్పుల రాజేశ్, ఏఎంసీ వైస్‌చైర్మన్ వంగ తిరుపతి, నాయకులు విజిత్‌రావు, భుజ్జన్న, తేలేటి కిష్టయ్య, హైమద్, దెబ్బటి రామన్న, వాహిద్ పాషా, భీమయ్య, రామస్వామి, శ్రీదేవి, సుధాకర్, రాజ్‌కుమార్ తదితరులున్నారు.

కాంగ్రెస్ దిష్టిబొమ్మ దహనం

మంచిర్యాలసిటీ: రాజ్యసభలో ట్రిపుల్ తలాక్ బిల్లును అడ్డుకుంటున్నారని పేర్కొంటూ బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం కాంగ్రెస్‌పార్టీ దిష్టిబొమ్మ దహనం చేశారు. పట్టణంలో నిర్వహించిన నిరసనలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ముల్కల్ల మల్లారెడ్డి మాట్లాడుతూ ముస్లిం మహిళల శ్రేయస్సు కోసం ప్రవేశ పెట్టిన బిల్లును కాంగ్రెస్ వ్యతిరేకించడం అనైతికమన్నారు. లోకసభలో ఆమోదం పొందిన బిల్లుకు రాజ్యసభలో ఆమోదించడానికి కాంగ్రెస్ ఎందుకు ముందుకు రావడం లేదని ప్రశ్నించారు. ఆందోళనలో మున్నారాజ్ సిసోద్య, అశోక్‌వర్ధన్, మల్లేష్, తుల అంజనేయులు, స్వామిరెడ్డి తదితరులున్నారు.

ఎంఐఎం పోస్టర్ విడుదల

మంచిర్యాలటౌన్: మున్సిపల్ పర్సనల్ లా బోర్డు 26వ ప్రోగ్రామ్ వాల్ పోస్టర్‌ను శుక్రవారం విడుదల చేశారు. పట్టణంలోని మైనార్టీ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఐఎం నాయకులు ఎండీ.షాకీర్ అహ్మద్ మాట్లాడుతూ రేపు ఆదిలాబాద్ జిల్లా మావల చిల్కూరి గార్డెన్‌లో ముస్లిం పర్సనల్ లా బోర్డు సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ రానున్నట్లు వెల్లడించారు. సమావేశంలో పాల్గొనేందుకు ఆసక్తిగల వారు సంప్రదించాలని కోరారు.


రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని వినతి

లక్సెట్టిపేట: విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం మైనార్టీ వెల్ఫేర్ జిల్లా అధికారి శ్యామలాదేవికి వినతిపత్రం అందజేశారు. స్కాలర్‌షిప్‌లు మంజూరు చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కన్వీనర్ దుంపల రంజిత్, ఏఐఎస్‌ఎఫ్ కార్యవర్గ సభ్యులు ఆవునూరి వెంకటేష్ తదితరులున్నారు.

లక్ష్యాల సాధనకు దేశం అమలు చేసే నిబంధనల రాజపత్రం



బొమ్మనబోయిన శ్రీనివాస్,
సీనియర్ ఫ్యాకల్టీ, హన్మకొండ



స్వతంత్ర భారత రాజ్యాంగ నిర్మాణం

పరిచయం: రాజ్యం మనుగడకు ప్రధాన ఆధారం.. రాజ్యాంగం. ప్రతి ప్రజాస్వామ్య దేశానికి రాజ్యాంగం అత్యవసరం. ఒక దేశ ప్రభుత్వ యంత్రాంగ రథచక్రాలు సాఫీగా సాగేందుకు రాజ్యాంగ సూత్రాలు మార్గదర్శకాలుగా పనిచేస్తాయి. రాజ్యాంగం అంటే.. దేశ పాలనా స్వభావం, లక్ష్యాల సాధన కోసం దేశం అమలు చేసే నిబంధనల రాజపత్రం. ప్రజల ఆశలు, ఆశయాలు, ఆకాంక్షలు, ఆసక్తులు, ఆదర్శాలను రాజ్యాంగం ప్రతిబింబిస్తుంది. స్వతంత్ర భారత రాజ్యాంగ నిర్మాణాన్ని, రాజ్యాంగ సభ ఉద్దేశాలను, భారత రాజ్యాంగ విశిష్ట లక్షణాలను ఈ పాఠం స్థూలంగా వివరిస్తుంది. ఈ పాఠ్యాంశ అధ్యయనం ద్వారా విద్యార్థులు భారత రాజ్యాంగ ప్రాథమిక స్వరూపాన్ని సంపూర్ణంగా అవగాహన చేసుకుంటారు.

- బ్రిటీష్ సామ్రాజ్యవాద, వలసవాద పాలన నుంచి భారతదేశం 1947, ఆగస్టు 15న స్వాతంత్ర్యం పొందింది. అయితే స్వాతంత్ర్యానికి ముందే స్వతంత్ర భారత ప్రభుత్వ పాలనా విధానాల రూపకల్పన (రాజ్యాంగం) అవసరాన్ని గుర్తించారు. అందులో భాగంగా రాజ్యాంగ రచనకు 389 మంది మేధావులతో 1946, ఆగస్టులో రాజ్యాంగ సభ (పరిషత్తు) ఏర్పడింది. వీరిలో 292 మంది వివిధ రాష్ట్రాల నుంచి, 93 మంది స్వదేశీ సంస్థానాల నుంచి, 4 గురు చీఫ్ కమిషనర్ (కేంద్రపాలిత) ప్రాంతాల నుంచి ఎన్నికయ్యారు. రాజ్యాంగ సభకు ఎన్నికైన వారిలో వివిధ వర్గాలు, ప్రాంతాలు, పార్టీలకు చెందినవారు ఉన్నారు. రాజ్యాంగ సభకు ఎన్నికైన వారిలో 26 మంది షెడ్యూల్డ్ కులాలకు చెందినవారితోపాటు 9 మంది మహిళలు కూడా ఉన్నారు. మెజార్టీ సభ్యులు మాత్రం భారత జాతీయ కాంగ్రెస్‌కు చెందినవారు కాగా, తర్వాత స్థానంలో ముస్లింలీగ్ పార్టీకి చెందినవారు ఉన్నారు. అయితే 1947, ఆగస్టు 14న దేశ విభజన జరిగి పాకిస్తాన్ ఆవిర్భవించింది. దాంతో పాకిస్తాన్‌కు చెందిన 90 మంది సభ్యులు తగ్గి, రాజ్యాంగ సభ సభ్యుల సంఖ్య 299కు చేరింది. రాజ్యాంగ సభ సభ్యులంతా ప్రజలతో ప్రత్యక్షంగా ఎన్నికవ్వలేదు. అయినప్పటికీ దేశ ప్రజలందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని రాజ్యాంగాన్ని రచించారు. రాజ్యాంగ సభ అధ్యక్షుడిగా బాబూ రాజేంద్రప్రసాద్ ఎన్నికయ్యారు.

ముఖ్యాంశాలు

- రాజ్యాంగంలో పొందుపరచాల్సిన వివిధ అంశాల అధ్యయనానికి కొన్ని కమిటీలను ఏర్పాటు చేశారు. వాటిలో రాజ్యాంగ ముసాయిదా (డ్రాఫ్టింగ్) కమిటీ అతి ముఖ్యమైంది. దీన్ని 1947, ఆగస్టు 29న ఏర్పాటు చేశారు. డా.బి.ఆర్.అంబేద్కర్ నాయకత్వంలోని 6 గురు సభ్యులు గల ఈ కమిటీ రాజ్యాంగ సభ సమావేశాల చర్చల ఆధారంగా రాజ్యాంగాన్ని రూపొందించింది. రాజ్యాంగం 1949, నవంబర్ 26న రాజ్యాంగ సభతో ఆమోదం పొంది 1950, జనవరి 26 నుంచి పూర్తిగా అమల్లోకి వచ్చింది. దీనికి గుర్తుగా ఏటా జనవరి 26న గణతంత్ర (రిపబ్లిక్) దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నాం.
- ముసాయిదా రాజ్యాంగంలో 315 అధికరణలు, 8 షెడ్యూళ్లు ఉండగా, రాజ్యాంగం ఆమోదం పొందే సమయానికి 395 అధికరణలు, 8 షెడ్యూళ్లు ఉన్నాయి. తర్వాత కాలంలో రాజ్యాంగానికి వివిధ సవరణలు చేయడంతో రాజ్యాంగ అధికరణల సంఖ్య 448కు, షెడ్యూళ్ల సంఖ్య 12కు చేరుకున్నాయి. రాజ్యాంగ రచనకు 2 సంవత్సరాల, 11 నెలల, 18 రోజుల సమయం పట్టింది.
- ప్రపంచంలో రెండు రకాల ప్రభుత్వాలు ఉన్నాయి. అవి.. పార్లమెంటరీ తరహా ప్రభుత్వ వ్యవస్థ, అధ్యక్ష తరహా ప్రభుత్వ వ్యవస్థ. ఇండియాలో మొదటి పద్ధతి అమల్లో ఉంది. రెండో తరహా వ్యవస్థకు అమెరికా మంచి ఉదాహరణ.
- ఏకీకృత విధానం (ఏకకేంద్ర), సమాఖ్య విధానమనే రెండు రకాల రాజ్యాంగ రూపాలు ఉన్నాయి. భారత రాజ్యాంగం.. సమాఖ్య లక్షణాలతోపాటు ఏకీకృత లక్షణాలు కూడా కలిగుంది. భారతదేశ రాజ్యాంగంలో అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా దేశాల రాజ్యాంగాల్లో ఉన్న మంచి సమాఖ్య లక్షణాలు లేవు. అదే సమయంలో బ్రిటన్‌లో ఉన్న పూర్తి ఏకీకృత లక్షణాలు కూడా లేవు.
- భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత రాజ్యాంగం.
- భారత రాజ్యాంగం అంటరానితనాన్ని నిషేధించింది. సమాజంలోని అన్ని వర్గాలు సమానంగా అభివృద్ధి చెందాలనే సంకల్పంతో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లను కల్పించారు.
- పరిస్థితులకు అనుగుణంగా నిబంధనల ప్రకారం రాజ్యాంగాన్ని సవరించొచ్చు. 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా రాజ్యాంగ ప్రవేశికలో 'సామ్యవాదం, లౌకికత్వం, సమగ్రత' పదాలను చేర్చారు. ఇది రాజ్యాంగ ప్రవేశికకు చేసిన ఏకైక సవరణ.
- కేశవానంద భారతి వర్సెస్ కేరళ (1973) కేసులో సుప్రీంకోర్టు రాజ్యాంగ మౌలిక సూత్రాల గురించి ప్రస్తావించింది. వీటిని సవరించే అధికారం పార్లమెంట్‌కు లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

4 మార్కుల ప్రశ్న

1. రాజ్యాంగంలో మౌలిక సూత్రాలుంటాయి. అయితే ప్రజలు వ్యవస్థతో తలపడినప్పుడే సామాజిక మార్పు వస్తుంది. ఈ వ్యాఖ్యతో మీరు ఏకీభవిస్తారా? మీ కారణాలను పేర్కొనండి?
(సమకాలీన అంశాలపై ప్రతిస్పందన – ప్రశ్నించడం)

జ: పై వ్యాఖ్యతో నేను పూర్తిగా ఏకీభవిస్తాను. ఏ దేశ రాజ్యాంగంలోఅయినా కొన్ని మౌలిక సూత్రాలుంటాయి. అవి.. రాజ్యాంగ స్వరూపాన్ని, ఉద్దేశాలను ప్రతిబింబిస్తాయి. రాజ్యాంగ ప్రవేశికలో పొందుపర్చిన మౌలిక సూత్రాల లక్ష్యాలకు అనుగుణంగా వ్యవస్థలో మార్పులు రావాలి. దీంతోపాటు ప్రజల ఆకాంక్షలు నెరవేరాల్సిన అవసరం కూడా ఉంది. ప్రజలు రాజ్యాంగ పద్ధతిలో వ్యవస్థతో తలపడినప్పుడే ఈ సామాజిక మార్పు సాధ్యమవుతుంది. నేను ఈ వాస్తవాలతో ఏకీభవించడానికి కారణాలు..

- దేశ సార్వభౌమాధికారం ప్రజల చేతిలో ఉంటుంది. ప్రజలే పాలకులు, ప్రజల కోసం ప్రజలే చట్టాలు చేసుకుంటారు. ప్రజలతో కూడిందే వ్యవస్థ. ఇలాంటి వ్యవస్థలో అభివృద్ధి పూర్వక మార్పులకు ప్రజలు సిద్ధపడాలి.
- లౌకిక, సామ్యవాద సూత్రాలు జాతీయ సమైక్యతను, ప్రజల సంక్షేమాన్ని పెంపొందిస్తాయి. పాలనా వ్యవస్థ వీటిని అమలు చేయాలి. ప్రజలు జాగరూకులై అభివృద్ధి ఫలాలను అందుకోవాలి. పాలనా వ్యవస్థ ప్రజల కోరికలు, ఆకాంక్షలను పట్టించుకోనప్పుడు ప్రజలే ప్రభుత్వాన్ని ప్రశ్నించాలి.
- రాజ్యాంగ సూత్రాల ప్రకారం పౌరులందరికీ సామాజిక, ఆర్థిక రాజకీయ న్యాయాన్ని అందించాలి. అలాగే పౌరుల్లో సమానత్వం, సౌభ్రాతృత్వాలను పెంపొందించాలి. వీటి ఆధారంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. అప్పుడే ప్రజల జీవితాల్లో ఫలప్రదమైన మార్పులు సంభవిస్తాయి. తద్వారా సామాజిక మార్పును ఆశించవచ్చు.
- రాజ్యాంగ మౌలిక సూత్రాలను పాలనా వ్యవస్థ విస్మరించినప్పుడు ప్రజలు సమూహంగా ఏర్పడి సామాజిక వ్యవస్థలో మార్పు కోసం ప్రజాప్రతినిధులతో కూడిన పాలనా వ్యవస్థతో తలపడాల్సి వస్తుంది. రాజ్యాంగం కూడా దీన్నే కోరుకుంటుంది. పాలనా వ్యవస్థకు సామాజిక వ్యవస్థే ఆధారం.

2 మార్కుల ప్రశ్నలు

1. 73వ రాజ్యాంగ సవరణ ద్వారా గ్రామాలకు ఎలాంటి స్వయంప్రతిపత్తి కల్పించారో తెలపండి.
(సమాచార సేకరణ నైపుణ్యం)

జ: భారత రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాల్లో పేర్కొన్న 40వ ప్రకరణ.. పంచాయతీరాజ్ వ్యవస్థ ఏర్పాటు, గ్రామాలకు స్వయం పాలనాధికారాల గురించి ప్రస్తావించింది. దానికి అనుగుణంగా పార్లమెంట్ 1992లో 73వ రాజ్యాంగ సవరణ చేసింది. ఇది 1993, ఏప్రిల్ 24 నుంచి అమల్లోకి వచ్చింది. 73వ రాజ్యాంగ సవరణ.. గ్రామ పంచాయతీలకు స్వయం ప్రతిపత్తిని కల్పించింది. దీంతోపాటు గ్రామ స్వయంపాలనకు అవసరమైన అధికారాలు, విధులు, బాధ్యతలను పంచాయతీ వ్యవస్థలకు కల్పించింది. వాటిలో ముఖ్యమైనవి.. గ్రామసభ ఏర్పాటు, ప్రత్యక్ష ఎన్నికలు, సీట్ల రిజర్వేషన్, మూడంచెల వ్యవస్థ, రాష్ట్ర ఎన్నికల సంఘం, రాష్ట్ర ఆర్థిక సంఘం ఏర్పాటు, నిర్దేశిత పదవీకాలం తదితరాలు.

2. భారత్, అమెరికా సమాఖ్య వ్యవస్థల మధ్య ముఖ్య భేదాలను పేర్కొనండి. *(విషయావగాహన)*

జ: అమెరికా, ఇండియాల్లో సమాఖ్య వ్యవస్థ అమల్లో ఉంది. ఈ దేశాల్లో అనుసరిస్తున్న సమాఖ్య విధానాల్లో స్పష్టమైన తేడాలున్నాయి. అవి..

భారత సమాఖ్య వ్యవస్థ: 1. ఏక పౌరసత్వం, ద్వంద్వ ప్రభుత్వాలు, ఏక న్యాయ వ్యవస్థ, 2. సివిల్, క్రిమినల్ చట్టాల్లో సారూప్యత, ఏక విధానం, 3. అఖిల భారత సర్వీసులు.

అమెరికా సమాఖ్య వ్యవస్థ:
1. ద్వంద్వ పౌరసత్వం, ద్వంద్వ ప్రభుత్వాలు, ప్రత్యేక న్యాయ వ్యవస్థలు. 2. చట్టాల్లో సారూప్యత, ఏక విధానం లేదు 3. ప్రత్యేకంగా వేర్వేరు సర్వీసులు.

3. అధ్యక్ష తరహా, పార్లమెంటరీ తరహా వ్యవస్థల మధ్య తేడా ఏమిటి?

జ: అధ్యక్ష తరహా వ్యవస్థ: దేశ పరిపాలనాధికారాలన్నీ అధ్యక్షుడి చేతిలోనే ఉండే ప్రభుత్వ వ్యవస్థ. అధ్యక్షుణ్ని ప్రభుత్వాధినేత, దేశాధినేత అని కూడా పిలుస్తారు. అధ్యక్షుడు ప్రభుత్వ వాస్తవ కార్యనిర్వహణాధికారిగా ఉంటాడు. **ఉదా:** అమెరికా

పార్లమెంటరీ తరహా వ్యవస్థ: పార్లమెంట్‌లో ప్రజాస్వామ్యబద్ధంగా మెజారిటీ సీట్లు పొందిన పార్టీ లేదా కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది. ప్రభుత్వ కార్యనిర్వాహక అధికారాలను మంత్రిమండలి నిర్వర్తిస్తుంది. ఈ విధంగా శాసననిర్మాణ శాఖ, కార్యనిర్వాహక శాఖల అధికారాల సమన్వయంతో కూడిన వ్యవస్థను పార్లమెంటరీ తరహా ప్రభుత్వ వ్యవస్థ అంటారు. మంత్రిమండలి నాయకుడిని ప్రధానమంత్రి అంటారు. ఆయనే ప్రభుత్వాధినేతగా ఉంటారు. ఆయన సలహాలు, సూచనల మేరకే దేశాధినేత అయిన అధ్యక్షుడు (రాష్ట్రపతి) నడచుకోవాల్సి ఉంటుంది. ఈ వ్యవస్థలో వాస్తవ కార్యనిర్వాహణాధికారి ప్రధానమంత్రి.
ఉదా: బ్రిటన్, ఇండియా

1 మార్కు ప్రశ్నలు

1. రాజ్యాంగ ముసాయిదా సంఘం అంటే ఏమిటి? దాని చైర్మన్ ఎవరు?

జ: రాజ్యాంగ సభ నియమించిన వివిధ కమిటీల నివేదికలపై రాజ్యాంగ సభ తీసుకున్న నిర్ణయాల సారాంశం ఆధారంగా రాజ్యాంగాన్ని రూపొందించే మేధావుల బృందం (కమిటీ). భారత రాజ్యాంగ ముసాయిదా కమిటీ చైర్మన్ డా.బి.ఆర్. అంబేద్కర్.

2. రాజ్యాంగ ప్రవేశిక అంటే ఏమిటి?

జ: రాజ్యాంగ స్థూల స్వరూపాన్ని క్లుప్తంగా పరిచయ వాక్యాలతో చెప్పే పత్రమే రాజ్యాంగ ప్రవేశిక. ఇది రాజ్యాంగ మౌలిక సూత్రాలను తెలుపుతోంది. దీన్ని రాజ్యాంగానికి దర్పణంగా, ముందుమాటగా కూడా పేర్కొంటారు.

3. ఏకీకృత విధానం, సమాఖ్య విధానం మధ్య ప్రధానమైన తేడా ఏమిటి?

జ: ఏకీకృత విధానం: దేశ పాలనాధికారాలన్నీ కేంద్ర ప్రభుత్వానికి మాత్రమే ఉండటం. ఇది ఏకకేంద్ర ప్రభుత్వ వ్యవస్థ ముఖ్య లక్షణం. **ఉదా:** బ్రిటన్.

సమాఖ్య విధానం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య అధికారాలు స్పష్టంగా విభజితమై ఉండటం.
ఉదా: అమెరికా, ఇండియా మొదలైనవి.

4. ఉమ్మడి జాబితా అంటే ఏమిటో తెలపండి.

జ: ఉమ్మడి జాబితా: కేంద్రానికి, రాష్ట్రాలకు ఉమ్మడిగా గల అధికారాలను తెలిపే అంశాల జాబితాను ఉమ్మడి జాబితా అంటారు. సమాఖ్య వ్యవస్థలో కేంద్రం, రాష్ట్రాల మధ్య చట్టాలు చేసే అధికారాలు విభజితమై ఉంటాయి. **ఉదా:** భారత రాజ్యాంగంలోని ఉమ్మడి జాబితాలో 47 అంశాలను పేర్కొన్నారు.

5. రాజ్యాంగ సవరణ అంటే ఏమిటి?

జ: రాజ్యాంగబద్ధంగా దేశ మౌలిక రాజ్యాంగంలో చేసే అవసరమైన మార్పునే రాజ్యాంగ సవరణ అంటారు. సవరణ అంటే రాజ్యాంగంలో అప్పటికే ఉన్న అధికరణలను తొలగించవచ్చు లేదా మార్చవచ్చు, కొత్తవాటిని చేర్చవచ్చు. దేశాభివృద్ధికి అవసరమైన రాజ్యాంగ సవరణలను చట్టసభలు ఆమోదిస్తాయి.

‘నాదేశం నశించే పరిస్థితుల్లో నేను జన్మించాను’



మగ్గం వెంకటరమణరావు
అసిస్టెంట్ ప్రొఫెసర్,
నాగార్జున ప్రభుత్వ డిగ్రీ
కళాశాల, నల్లగొండ



పోటీ పరీక్షల ప్రత్యేకం
వరల్డ్ హిస్టరీ

మాదిరి ప్రశ్నలు

1. కింది వాటిలో ‘అక్షరాజ్య కూటమి’లోని దేశాలేవి?
1) నార్వే, స్వీడన్, డెన్మార్క్
2) ఇటలీ, జర్మనీ, జపాన్
3) అమెరికా, చైనా, స్పెయిన్
4) రష్యా, ఫ్రాన్స్, బ్రిటన్

2. ‘కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ చైనా’ తొలి సమావేశం ఎక్కడ జరిగింది?
1) బీజింగ్ 2) నాన్‌కింగ్
3) షాంఘై 4) పెకింగ్

3. ఇటలీ ఏకీకరణోద్యమంలో కీలక పాత్ర పోషించిన గారీబాల్డీ ఎక్కడ జన్మించాడు?
1) నైస్ 2) టస్కనీ
3) సార్డీనియా 4) వెనిస్

4. ముస్తాఫ కెమాల్ పాషాకు ఉన్న బిరుదు అయిన ‘కెమాల్’ అంటే?
1) వేగు చుక్క 2) పరిపూర్ణుడు
3) రక్షకుడు 4) విమోచకుడు

5. కింది వాటిలో సరైన జత ఏది?
1) హిట్లర్ ఆత్మహత్య -1945
2) ఐక్యరాజ్య సమితి సచివాలయం – న్యూయార్క్
3) ఉదయించే సూర్యుడి భూమి – జపాన్
4) పైవన్నీ సరైనవే

6. అడాల్ఫ్ హిట్లర్ ఎవరి తత్వ సిద్ధాంతాలకు ప్రభావితుడయ్యాడు?
1) హిడెన్‌బర్గ్ 2) ముత్సుహిటో
3) జోసెఫ్ గోబెల్స్ 4) నీషి

7. కింది వాటిలో నల్లమందు యుద్ధాలు ఏయే దేశాల మధ్య జరిగాయి?
1) చైనా – బ్రిటన్
2) జర్మనీ – ఆస్ట్రియా
3) జపాన్ – అమెరికా
4) ఫ్రాన్స్ – ఇటలీ

8. ‘చైనా జాతి పిత’ అని ఎవరిని పిలిచారు?
1) సన్ యెట్ సేన్ 2) చౌ ఎన్ లై
3) చూటే 4) మావో సే టుంగ్

9. రెండో విక్టర్ ఇమ్మాన్యుయేల్ ఏ ప్రాంత పాలకుడిగా కీర్తిగాంచి నిజాయితీపరుడైన రాజుగా ప్రసిద్ధి చెందాడు?
1) సార్డీనియా 2) ఫ్లారెన్స్
3) వెనిస్ 4) సెవాయ్

10. ‘నల్లచేయి’ అనే గుర్తు ఉన్న ‘నరోరా ఒబ్రానా సంస్థ’ ఏ దేశ విప్లవ సంస్థ?
1) బోస్నియా 2) సెర్బియా
3) ఆస్ట్రియా 4) మొరాకో

11. కౌంట్ కవూర్ స్థాపించిన పత్రిక ఏది?
1) పీపుల్స్ అబ్జర్వర్
2) ఇల్ రిసార్జిమెంటో
3) ఇస్క్రా 4) అవంతి

12. ‘మతం లేని రాజ్యం దిక్సూచి లేని నౌక లాంటిది’ అని అన్నదెవరు?
1) మెటర్నిక్ 2) ఆటోవాన్ బిస్మార్క్
3) మొదటి విలియం
4) నెపోలియన్ బోనాపార్టే

13. ఆస్ట్రియా యువరాజు ‘ఆర్చ్‌డ్యూక్ ఫెర్డినాండ్’ను ఎక్కడ హత్య చేశారు?
1) సరాజెవో 2) వార్సా
3) బెర్న్ 4) జెనీవా

14. ఫ్రాన్స్ చక్రవర్తి నెపోలియన్ బోనా పార్టే ‘కంకార్డేట్’ అనే మత ఒప్పందం ఎవరితో చేసుకున్నాడు?
1) పోప్ 10వ లియో
2) పోప్ 6వ అలెగ్జాండర్
3) పోప్ 7వ ఫయిస్
4) పోప్ 5వ ఫయిస్

15. వర్సయిల్స్ సంధి సమావేశంలో పాల్గొన్న ఇటలీ ప్రధాన మంత్రి ఎవరు?
1) ఆర్లాండో 2) జార్జ్ క్లెమెన్సో
3) లాయిడ్ జార్జ్ 4) ఉడ్రో విల్సన్

16. ‘యుద్ధం ప్రష్యన్‌ల జాతీయ పరిశ్రమ’ అని అన్నదెవరు?
1) డాంటన్ 2) మిరాబూ
3) రాబిస్పియర్ 4) లఫాయితే

17. కింది వాటిలో జోసెఫ్ మాజినీ స్థాపించిన సంస్థ?
1) ఎర్ర చొక్కాల దళం
2) నల్ల చొక్కాల దళం
3) తుంగ్ మెంగ్ హుయి విప్లవ సంస్థ
4) యంగ్ ఇటలీ సంస్థ

18. జపాన్‌లో ‘షింటో’ ప్రాచీన మతం. ‘షింటో’ అంటే?
1) విప్లవ భూమి 2) పవిత్ర భూమి
3) దేవతల మార్గం
4) దైవ శాపగ్రస్థ దేశం

19. నెపోలియన్ బోనా పార్టే ఏ తేదీన జన్మించాడు?
1) 1769 ఆగస్టు 15
2) 1779 జనవరి 26
3) 1789 మార్చి 19
4) 1766 అక్టోబర్ 14

20. ‘ఆసియా ఆసియావాసులకే’ అనే నినాదం ఏ దేశానిది?
1) జపాన్ 2) చైనా
3) భారత్ 4) శ్రీలంక

21. నెపోలియన్ బోనాపార్టేకి సంబంధించి కింది వాటిలో సరైంది?
1) 1804లో ఫ్రాన్స్ చక్రవర్తిగా అధికారం చేపట్టాడు
2) రెండో జస్టీయన్‌గా కీర్తి పొందాడు
3) 1815లో వాటర్లూ యుద్ధం చేశాడు
4) పైవన్నీ సరైనవే

22. వ్యాపార నిమిత్తం చైనాలో అడుగుపెట్టిన తొలి ఐరోపావాసులు ఎవరు?
1) బ్రిటిషర్లు 2) ఫ్రెంచ్‌వారు
3) పోర్చుగీస్‌వారు 4) డచ్చివారు

23. నెపోలియన్ బోనాపార్టే ‘భూఖండ విధానం’ ఏ దేశానికి వ్యతిరేకంగా చేపట్టాడు?
1) ప్రష్యా 2) ఇంగ్లండ్
3) రష్యా 3) ఆస్ట్రియా

24. మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో 21 డిమాండ్‌ల పత్రాన్ని జపాన్ ఏ దేశానికి పంపింది?
1) ఇంగ్లండ్ 2) రష్యా
3) ఫ్రాన్స్ 4) చైనా

25. టర్కీ.. నానాజాతి సమితిలో ఎప్పుడు సభ్యత్వం పొందింది?
1) 1932 2) 1934
3) 1936 4) 1938

26. ‘బ్లడ్ అండ్ ఐరన్’ పాలసీ సృష్టికర్త ఎవరు?
1) జోసెఫ్ మాజినీ
2) డాక్టర్ సన్‌యేట్‌సేన్
3) ఆటోవాన్ బిస్మార్క్
4) మూడో నెపోలియన్

27. ‘స్త్రీ సంపూర్ణ వ్యక్తిత్వానికి మాతృత్వం ఎలాంటిదో, సంపూర్ణ వికాసానికి యుద్ధం అలాంటిది’ అని అన్నదెవరు?
1) లెనిన్ 2) స్టాలిన్
3) అడాల్ఫ్ హిట్లర్
4) బెనిటో ముస్సోలినీ

28. నానాజాతి సమితి సచివాలయం కేంద్ర కార్యాలయం ఎక్కడ ఉంది?
1) జెనీవా 2) న్యూయార్క్
3) బెర్లిన్ 4) మాస్కో

29. అడాల్ఫ్ హిట్లర్ స్థాపించిన ‘రహస్య పోలీస్ దళం’ ఏది?
1) రీచ్‌స్టాగ్ 2) థర్డ్ సెక్షన్
3) గెస్టాపో 4) ఆగ్‌పూ

30. నానాజాతి సమితిని ఎప్పుడు స్థాపించారు?
1) 1918 2) 1920
3) 1922 4) 1924

31. ‘ప్రాచ్య విజ్ఞాన కోశం’ అని ఏ దేశాన్ని పిలుస్తారు?
1) శ్రీలంక 2) జపాన్
3) చైనా 4) బర్మా

32. కింది వాటిలో అడాల్ఫ్ హిట్లర్ రాసిన గ్రంథం ఏది?
1) ఏప్రిల్ థీసిస్ 2) మీన్‌కాంప్
3) ద స్టడీ ఆఫ్ ఫిజికల్ కల్చర్
4) దాస్ కాపిటల్

33. బెనిటో ముస్సోలిని.. ఫాసిస్ట్ పార్టీని ఎక్కడ స్థాపించాడు?
1) వెనిస్ 2) మిలాన్
3) ఫ్లారెన్స్ 4) రోమ్

34. ‘కార్బోనరీ’ అంటే?
1) సంగీత బృందం 2) గ్రామీణ రైతులు
3) బొగ్గును కాల్చేవారు
4) యుద్ధ ఖైదీలు

35. ‘టర్కీ టర్కులకే’ అనే నినాదం ఇచ్చిందెవరు?
1) ఇస్మత్ ఇనోను
2) ముస్తాఫ కెమాల్ పాషా
3) అలీ ఫతేహి ఒక్యార్
4) జెనిటో జౌరజ్

36. ఐరోపా ఖండంలో వియన్నా కాంగ్రెస్ సమావేశం ఎప్పుడు జరిగింది?
1) 1815 2) 1817
3) 1819 4) 1821

37. కింది వాటిలో సరైన జత ఏది?
1) ఫ్యూరర్ – అడాల్ఫ్ హిట్లర్
2) ఇల్‌డ్యూస్ – బెనిటో ముస్సోలిని
3) అటాటర్క్ – ముస్తాఫా కెమాల్ పాషా
4) పైవన్నీ సరైనవే

38. పెరల్ హార్బర్ సంఘటన ఏ తేదీన జరిగింది?
1) 1941 డిసెంబర్ 7
2) 1942 డిసెంబర్ 17
3) 1943 ఆగస్టు 16
4) 1944 మార్చి 19

39. ఫాసిస్ట్ పార్టీ చిహ్నాలు ఏవి?
1) సూర్యుడు, నాగలి
2) స్వస్తిక్, నక్షత్రం 3) పావురం, పులి
4) పుల్లల మోపు, గొడ్డలి

40. ‘ఇటలీ జాతీయోద్యమానికి ఆత్మ’ అని ఎవరిని పేర్కొంటారు?
1) మాజినీ 2) గారీబాల్డీ
3) కౌంట్‌కవూర్ 4) విన్సెంట్ జియోబర్టీ

41. చైనాలో ‘బాక్సర్ తిరుగుబాటు’ ఎప్పుడు జరిగింది?
1) 1900 2) 1902
3) 1904 4) 1906

42. కింది వాటిలో సరైన జత ఏది?
1) సమురాయ్ – సైన్యాధికార వర్గం (జపాన్)
2) మంచూ – చైనాను పాలించిన చివరి రాజవంశం
3) 20వ శతాబ్దపు కన్ఫ్యూషియస్ – సన్‌యెట్‌సేన్
4) పైవన్నీ సరైనవే

43. అడాల్ఫ్ హిట్లర్ తన ఆర్థికమంత్రిగా ఎవరిని నియమించాడు?
1) లియోపాల్డ్ 2) బెనెడెట్టి
3) షాట్ 4) వాన్‌రూన్

44. ‘మెయిజీ’ అంటే?
1) విజ్ఞతతో వ్యవహరించడం
2) నియంతృత్వ పాలన
3) పెద్ద భూస్వామ్య వర్గం
4) దైవలోక చక్రవర్తి

45. చౌఎన్‌లై ప్రధానిగా ‘ప్రజా రిపబ్లిక్’ ఏ దేశంలో ఏర్పడింది?
1) జపాన్ 2) చైనా
3) ఆస్ట్రియా 4) ప్రష్యా

46. ఆటోవాన్ బిస్మార్క్ ప్రష్యా చాన్స్‌లర్‌గా ఎప్పుడు పదవీ బాధ్యతలు చేపట్టాడు?
1) 1862 2) 1864
3) 1866 4) 1868

47. ‘నాదేశం నశించే పరిస్థితుల్లో నేను జన్మించాను’ అని అన్నదెవరు?
1) మొదటి విలియం
2) 16వ లూయి 3) ముత్సుహిటో
4) నెపోలియన్ బోనాపార్టే

48. ఫ్రాంక్‌ఫర్ట్ సంధి(1871) ఏయే దేశాల మధ్య జరిగింది?
1) ఫ్రాన్స్, ప్రష్యా 2) ప్రష్యా, డెన్మార్క్
3) డెన్మార్క్, ఆస్ట్రియా
4) ఫ్రాన్స్, ఆస్ట్రియా

49. ‘ఐరోపా జబ్బు మనిషి’ అని ఏ దేశానికి పేరు ఉంది?
1) జర్మనీ 2) టర్కీ
3) ఇంగ్లండ్ 4) ఫ్రాన్స్

50. నెపోలియన్ బోనాపార్టే.. ప్రెస్‌బర్గ్ సంధి ఏ దేశంతో చేసుకున్నాడు?
1) పోలాండ్ 2) డెన్మార్క్
3) రష్యా 4) ఆస్ట్రియా

51. మొదటి ప్రపంచ యుద్ధం జరిగిన కాలం?
1) 1914-1918 2) 1915-1918
3) 1914-1917 4) 1914-1924

52. ‘బ్యాటిల్ ఆఫ్ నేషన్స్’ అని ఏ యుద్ధానికి పేరు?
1) లీప్‌జిగ్ యుద్ధం 2) వాటర్లూ యుద్ధం
3) జీనా యుద్ధం 4) ఆస్టర్లిట్జ్ యుద్ధం

53. ‘పొడెస్టాస్ అనే ప్రభుత్వ ఉద్యోగుల పాలనలో స్థానిక స్వపరిపాలనా సంస్థలు ఏ దేశంలో పనిచేశాయి?
1) జర్మనీ 2) ఇటలీ
3) ఆస్ట్రియా 4) రష్యా

54. ముస్తాఫ కెమాల్ పాషా మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో ఏ ప్రాంతంలో బ్రిటన్ దాడిని తిప్పికొట్టాడు?
1) కైరో 2) అంకారా
3) గాల్లిపోలి 4) టోక్యో

55. నెపోలియన్ బోనా పార్టే.. స్పెయిన్ పాలకుడిగా నియమించిన అతని సోదరుడు ఎవరు?
1) జెరోమ్ 2) టాలీరాండ్
3) ఆర్థర్ వెల్లస్లీ 4) జోసెఫ్

56. రష్యాలో ట్రాట్‌స్కీ, ఆయన అనుచరులు శత్రు సైన్యాలను ఏమని పిలిచేవారు?
1) తెల్ల సైన్యం 2) పచ్చ సైన్యం
3) నీలి సైన్యం 4) ఎర్ర సైన్యం

57. రెండో ప్రపంచ యుద్ధ కాలంలో భారత్‌లో ఏ స్వాతంత్ర్యోద్యమం కీర్తిగాంచింది?
1) శాసనోల్లంఘనోద్యమం
2) సహాయ నిరాకరణోద్యమం
3) సైమన్ కమిషన్ వ్యతిరేక ఉద్యమం
4) క్విట్ ఇండియా ఉద్యమం

58. చైనాను పాలించిన మంచూ రాజవంశ ఆఖరి చక్రవర్తి ఎవరు?
1) పూయీ 2) షియోవాంగ్టీ
3) యువాన్ 4) ముత్సుహిటో

59. జపాన్‌ను తన ఆధీనంలోకి తెచ్చుకుని, (1945) మిత్ర రాజ్యాల సైన్యానికి నాయకత్వం వహించింది ఎవరు?
1) జార్జి వాషింగ్టన్ 2) ట్రూమన్
3) జనరల్ మెకార్థర్
4) ఐసన్ హోవర్

సమాధానాలు

1) 2	2) 3	3) 1	4) 2	5) 4
6) 4	7) 1	8) 1	9) 1	10) 2
11) 2	12) 4	13) 1	14) 3	15) 1
16) 2	17) 4	18) 3	19) 1	20) 1
21) 4	22) 3	23) 2	24) 4	25) 1
26) 3	27) 4	28) 1	29) 3	30) 2
31) 3	32) 2	33) 2	34) 3	35) 2
36) 1	37) 4	38) 1	39) 4	40) 1
41) 1	42) 4	43) 3	44) 1	45) 2
46) 1	47) 4	48) 1	49) 2	50) 4
51) 1	52) 1	53) 2	54) 3	55) 4
56) 1	57) 4	58) 1	59) 3	



నాన్నా చెప్పవా

బుల్లెట్ ప్రూఫ్ రహస్యం ఏమిటి?



బుల్లెట్ ప్రూఫ్ గుండా బుల్లెట్ దూసుకుపోకుండా ఒక రకమైన ప్లాస్టిక్ నిరోధిస్తుంది. దానిని లామినేట్ అంటారు. మొదట గాజు, ఆ తరువాత ప్లాస్టిక్, మళ్ళీ గాజు ఇలా బుట్లెట్ ప్రూఫ్ అమరిక ఉంటుంది. ఇది మామూలు అద్దం కంటే మందంగా ఉంటుంది. ఇందులో మధ్యలో వాడే లామినేట్ ప్లాస్టిక్ పాలీ కార్బనేట్ పదార్థం. ఇది చాలా దృఢమైనదే కాక పారదర్శకంగానూ ఉంటుంది. కవచం వంటి ఈ బుల్లెట్ ప్రూఫ్ గుండా బుల్లెట్ (తూటా) దూసుకు రాలేదు. మొదటి పొర అయిన గాజు లోంచి చొచ్చుకుపోయినా ఆ తర్వాత పొర అయిన పాలీ కార్బనేట్ లామినేట్ బుల్లెట్‌కు గల దూసుకుపోయే శక్తిని అడ్డుకుంటుంది. దీంతో బుల్లెట్ లోనికి చొచ్చుకు పోలేదు.

గాలితో పని లేని జీవులున్నాయా?



ఉన్నాయనే అంటున్నారు పరిశోధకులు. మధ్యధరా సముద్ర గర్భంలో ఏ మాత్రమూ ప్రాణ వాయువు జాడ లేని ప్రాంతంలో కొత్త జీవరాశిని పరిశోధకులు కనుగొన్నట్టు సైన్సు డైలీ ప్రకటించింది. చుట్టూ విషపూరిత సల్ఫైడ్‌లు కలిగిన వాతావరణంలో సముద్రగర్భంలో ఉన్న ఆ జీవులను లోరిసీఫెరా వర్గంలో చేర్చారు. ఈ జీవుల్లో జీవక్రియలు బాగానే సాగుతున్నాయని, అంతే కాకుండా ఏ మాత్రమూ ప్రాణ వాయువు లేని ప్రాంతంలో పునరుత్పత్తి ప్రక్రియ కూడా ఈ జీవుల్లో సజావుగా సాగుతోందని గుర్తించారు. ప్రస్తుతం వీటిపై పరిశోధన కొనసాగుతోంది.


రంగులు వేయండి








పైన ఉన్న వింత మనిషి కింద ఉన్న పండు దగ్గరికి రావాలి. దారి చూపండి.



పైన ఉన్న రెండు బొమ్మల మధ్య 15 తేడాలు ఉన్నాయి. గుర్తించండి.

పూరించండి



పైన కొన్ని బాక్స్‌లు, వాటి కింద కొన్ని బొమ్మలున్నాయి. ప్రతి బొమ్మ ఇంగ్లీషు పేరును మొదటి అక్షరంతో పజిల్‌ను పూర్తిచేయండి. పూర్తయ్యాక వచ్చే పదం మనకు ఎడమవైపున కనిపించే బొమ్మ ఇంగ్లిష్ పదం అవుతుంది. ట్రై చేయండి చూద్దాం!




పూరించండి – జవాబు
Vampire Bat

కింది పజిల్‌లో పక్కన ఉన్న బొమ్మల పేర్లు అడ్డం, నిలువులుగా ఎక్కడ ఉన్నాయో గుర్తించండి.

toy	b	o	a	t	p	p
boat	x	y	b	c	e	o
star	f	s	e	m	a	t
potty	s	t	a	o	c	t
peach	y	a	c	s	h	y
beach	p	r	h	y	o	t

ఎడమవైపున ఉన్న బొమ్మను చూస్తూ కుడివైపున బొమ్మ గీయండి



సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిన్నయ్య

బెల్లంపల్లి: మారుతున్న కాలానుగుణంగా గ్రామీణులు కూడా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని అభివృద్ధి సాధించాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, జిల్లా జాయింట్ కలెక్టర్ సురేందర్‌రావు తెలిపారు.శుక్రవారం బెల్లంపల్లి మండలం ఇంద్రానగర్‌లో నిర్వహించిన ప్రధానమంత్రి డిజిటల్ దిశ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం సాంకేతిక విప్లవం శరవేగంగా విస్తరిస్తోందన్నారు. మారుమూల గ్రామీణ ప్రాంతాల్లోనూ సాంకేతిక రంగం బలపడిందన్నారు. ప్రతి ఒక్కరి చేతిలోనూ సెల్‌ఫోన్ వచ్చేసిందని, ప్రస్తుత కాలంలో ఇంటి వద్దనే ఉండి సెల్ ద్వారా ఆన్‌లైన్‌లో ఏ వస్తువునైనా ఇంటికి రప్పించే అవకాశాలు ఏర్పడ్డాయన్నారు. ఈ పరిస్థితుల్లో గ్రామీణులు డిజిటల్ అక్షరాస్యతపై కనీస అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సాంకేతికంగా అవగాహన పెంచుకున్నాక ఇంటి పట్టునే ఉండి ప్రభుత్వ సేవలు పొందవచ్చన్నారు. గ్రామీణులకు అవగాహన కలిగించడానికి భవిత విద్యార్థులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. భవిత డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ సీహెచ్ భావనరుషి మాట్లాడుతూ భవిత ఎడ్యుకేషనల్ సొసైటీ తరపున బుధాకుర్థు గ్రామాన్ని దత్తత తీసుకున్నామని తెలిపారు. గ్రామంలో 370 ఇళ్లు ఉండగా 500 మందికి డిజిటల్ అక్షరాస్యత కల్పించడం జరుగుతుందన్నారు.14 నుంచి 60 ఏళ్ల వయస్సు కలిగిన ప్రతి ఒక్కరికి డిజిటల్ అక్షరాస్యత కల్పించడానికి సెల్‌ఫోన్ వినియోగంతో సాంకేతిక పరిజ్ఞానం అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సిలువేరి నర్సింగం, ఎంపీపీ సుభాష్‌రావు, సర్పంచ్ వేముల కృష్ణమూర్తి ,ఎంపీటీసీ తార , భవిత కళాశాల ప్రిన్సిపాల్ డి.కన్నారావు, డిజిటల్ నిపుణుడు బాలు పాల్గొన్నారు.

బదిలీ కావడం బాధాకరమే



సబ్ కలెక్టర్, ఆర్డీవోకు సన్మానం చేస్తున్న తహసీల్దార్లు

బెల్లంపల్లి: ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీ కావడం సర్వ సాధారణమెనా బదిలీ బాధను కలిగిస్తుందని బెల్లంపల్లి సబ్ కలెక్టర్ పీఎస్ రాహుల్ రాజ్ తెలిపారు. శుక్రవారం బదిలీపై వెళుతున్న బెల్లంపల్లి ఆర్డీవో వీరన్న, సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్న రాహుల్ రాజ్‌కు ఆత్మీయ సన్మానం నిర్వహించారు. ఈసందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ భూ రికార్డుల ప్రక్షాళన సర్వేను పరిశీలించాక ఆర్డీవో వీరన్న విధులు సమర్థవంతంగా నిర్వహించినట్లు తెలుసుకున్నానని తెలిపారు.సత్వరంగా సర్వే చేయడానికి తీవ్ర కసరత్తు చేసినట్లు గుర్తించానన్నారు. ఆర్డీవో సర్వేను పూర్తి చేయించడంతో తనకు కొంత వెసులుబాటు లభించినట్లు అయ్యిందన్నారు. ప్రస్తుతం దొరికిన సమయాన్ని ఇతర రంగాలకు కేటాయించి అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానన్నారు.ఆర్డీవో పదవీ కాలం దగ్గర పడినా ఏదో ఒక ఉన్నత పదవిని పొందాలని ఆయన ఆకాంక్షించారు. బదిలీపై వెళుతున్న ఆర్డీవో వీరన్న మాట్లాడుతూ బెల్లంపల్లి ఆర్డీవోగా ఏడాది కాలం పని చేశానన్నారు.ఈ కాలంలో విధి నిర్వహణలో ఎవరినైన ఇబ్బంది కల్గించినట్లయితే మన్నించాలని కోరారు.ఎవరిపైనా తనకు దురుద్దేశం లేదన్నారు.ప్రతి ఒక్కరూ తనకు సహకరించారని కృతజ్ఞతలు తెలిపారు. అంతకుముందు రెవెన్యూ డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, డీటీలు, ఇతర ఉద్యోగులు మాట్లాడుతూ వీరన్న వద్ద ఎన్నో విషయాలు తెలుసుకున్నామన్నారు. విధులు ఏ తీరుగా నిర్వహించాలో చాలావరకు ఆయన నుంచి నేర్చుకున్నామని పేర్కొన్నారు. అనంతరం బదిలీపై వెళుతున్న ఆర్డీవో వీరన్న, కొత్తగా విధుల్లో చేరిన సబ్ కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు పూలమాల వేసి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు కె.సురేష్, రామచంద్రయ్య, కవిత, విజయానంద్, సత్యనారాయణ, డీఏవో కిషన్, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు ప్రభుత్వం చేయూత



ఆయిల్ క్యాన్‌లు అందజేస్తున్న విప్ ఓదెలు, కమిషనర్

మందమర్రి(చెన్నూర్): మహిళలు సాధికారతను సాధించే విధంగా ప్రభుత్వం అన్ని విధాల చేయూతను అందిస్తుందని ప్రభుత్వ విప్ నల్లాల ఓదెలు తెలిపారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి విప్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా ఐకేపీ పట్టణ సమాఖ్య సభ్యులు ఏర్పాటు చేసి కొత్త సంవత్సర వేడుకల కేక్‌ను కమిషనర్‌తో కలిసి కట్ చేసి మహిళ సభ్యులకు పంపిణీ చేశారు. అనంతరం గ్రూపు సభ్యులకు ఐకేపీ ఆధ్వర్యంలో సంక్రాంతి పండగను పురస్కరించుకుని డ్వాక్రా గ్రూప్ మహిళలకు ఆయిల్ క్యాన్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్బంగా వారిని ఉద్దేశించి విప్ మాట్లాడారు. 2017–18 ఆర్థిక సంవత్సంలో బ్యాంక్ లింకేజీల ద్వారా రూ.6.50 కోట్లు, స్త్రీ నిధి ద్వారా రూ.5.50 కోట్ల రుణాలు ఇప్పించి తెలంగాణ జిల్లాల్లోనే అత్యధిక రుణాలు ఇప్పించిన ఘనత మన మందమర్రి ఐకేపీ అర్బన్‌కే దక్కుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, మేనేజర్ గంగాధర్, సింగిల్ విండో చైర్మన్ ఎస్ ప్రభాకర్‌రావు, మేడిపల్లి సంపత్, నోముల ఎల్లాగౌడ్, మీనం మల్లయ్య, భూపెల్లి కనకయ్య, కోంగల తిరుపతిరెడ్డి, ఎండీ అబ్బాస్, ప్రసాద్, నర్సింగ్‌లతో పాటు ఐకేపీ టీఎంసీ శ్రీధర్, సీవో శంకరయ్య పట్టణ సమాఖ్య అధ్యక్షులు, ఆర్‌పీలు, సభ్యులు పాల్గొన్నారు.

మున్సిపల్ వాహనాల సీజ్



సీజ్ చేసిన మున్సిపల్ వాహనాలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): రవాణా శాఖా నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న మున్సిపాలిటీకి చెందిన రెండు ఆటో ట్రాలీలు, రెండు ట్రాక్టర్లను మంచిర్యాల జిల్లా రవాణా శాఖా ఆధ్వర్యంలో సీజ్ చేశారు. శుక్రవారం ఉదయం మంచిర్యాల సీనియర్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్(ఎంవీఐ) గుర్రం వివేకానంద్‌రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపాలిటీకి చెందిన పలు వాహనాలను బెల్లంపల్లి చౌరస్తాలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. మున్సిపాలిటీలోని పలు ఆటో ట్రాలీలు, ట్రాక్టర్లు వాహన పన్ను, ఫిట్‌నెస్, పర్మిట్, బీమా లేకుండా తిరుగుతున్నట్లు గుర్తించారు. రెండు ఆటో ట్రాలీలు, రెండు ట్రాక్టర్ల ధ్రువీకరణ పత్రాలు పరిశీలించగా ఎలాంటి పత్రాలు లేవు. దీంతో తక్షణమే స్పందించి వాటిని సీజ్ చేసి ఆర్టీసీ డిపోకు తరలించారు. ఈ వాహనాలకు సంబంధించి డ్రైవర్లకు కూడా డ్రైవింగ్ లైసెన్స్ లేకపోవడంతో ఎంవీఐ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంవీఐ మాట్లాడుతూ మున్సిపాలిటీకి చెందిన వాహనాలు రవాణా శాఖ నుంచి ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు, ఫిట్‌నెస్, పర్మిట్ సర్టిఫికెట్లతో పాటు కనీసం బీమా లేకుండా తిరుగుతున్నాయని పేర్కొన్నారు. ఇక ట్రాక్టర్లు, ఆటో ట్రాలీలు నడుపుతున్న డ్రైవర్లు కూడా డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుతున్నారని ఈ క్రమంలో ఎలాంటి ప్రమాదాలు జరిగినా కార్మికులకు సమస్యలు తప్పవని స్పష్టం చేశారు. వాహన తనిఖీల్లో అసిస్టెంట్ ఎంవీఐ కొమ్ము శ్రీనివాస్ పాల్గొన్నారు.

పనిచేయని ఏటీఎం



భీమారంలో మూసిన ఎస్బీఐ ఏటీఎం

భీమారం: మండల కేంద్రంలోని ఎస్బీఐ ఏటీఎం మూసి ఉండడంతో ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని ఏడు గ్రామ పంచాయతీలకు కలిపి భీమారంలో ఒకే ఏటీఎం ఉంది. నెలల్లో 15 రోజులు కూడా పనిచేయడం లేదని ఖాతాదారులు, పలువురు వాపోతున్నారు. బ్యాంక్ అధికారులు ఇప్పటికైనా స్పందించాలని కోరుతున్నారు.

వాట్సప్ చేయండి

మీ దృష్టికి వచ్చిన సమస్యలు.. మీ చుట్టూ జరిగే అవినీతి అక్రమాలు.. ఆసక్తికర విశేషాలు ఏవైనా సరే... లక్షలాది మందితో పంచుకోవాలనుకుంటున్నారా? అయితే వాటిని మాకు పంపండి. దీనికోసం మీరు చేయాల్సిందల్లా మీరు గమనించిన అంశాల్ని మీ ఫోన్‌లో బంధించి మాకు వాట్సప్ చేయడమే. ప్రాధాన్యతను బట్టి వాటిని మేం ప్రచురిస్తాం. మరెందుకాలస్యం క్లిక్‌మనిపించండి.. వాట్సప్ చేయండి.

మా ఫోన్ నెంబర్ : 8790811433

సమస్యల్లో మామిడిగట్టు



గ్రామంలోని గుంతల రోడ్డు



ప్రమాదకరంగా పాఠశాల భవనం

- అధ్వానంగా రోడ్లు
- ఇబ్బందుల్లో వాహనదారులు
- అసంపూర్తిగా జీపీ కార్యాలయం

గ్రామ ప్రొఫైల్	
కుటుంబాలు	400
జనాభా	1300
ఓటర్లు	900

మందమర్రిరూరల్: మండల కేంద్రానికి 15 కి.మీ దూరంలో ఉన్న మామిడిగట్టు పంచాయతీలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. గ్రామంలోని మౌలిక సదుపాయాలు కరువయ్యాయి. గ్రామంలో అంతర్గత రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. ఏడేళ్ల క్రితం వేసిన సీసీ రోడ్డు గుంతలమయంగా మారింది. దీంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. కొన్ని సమయాల్లో కిందపడిన ఘటనలు కూడా ఉన్నాయి. ఒక్కొక్క చోట ఫీటు లోతు గుంత ఉండడం వల్ల వాహనాలు పాడవుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. దానికి తోడు రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన డ్రెయినేజీ కాల్వలు సైతం పలుచోట్ల పూడికతో నిండింది. దీంతో దుర్వాసనతో గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయంపై గ్రామస్తులు పలుమార్లు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా, గ్రామసభల్లో తీర్మానాలు చేసినా సమస్యలు పరిష్కారం కావడం లేదని వాపోతున్నారు.

ప్రమాదకరంగా పాఠశాల భవనం

గ్రామంలో సుమారు నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించిన ప్రాథమికోన్నత పాఠశాల భవనం ప్రమాదకరంగా తయారైంది. వర్షాకాలంలో భవనం స్లాబ్ పైభాగం నుంచి వర్షపు నీరు చేరుతోంది. ఆ గదిలో పిల్లలకు చదువు చెప్పడం మానేశారు. పాఠశాలను కూల్చేయాలని పదేళ్ల క్రితం నుంచి గ్రామసభల్లో తీర్మానం చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. జీపీ కార్యాలయానికి సొంత భవనం లేకపోవడంతో సమావేశాలకు ఇబ్బందితప్పడం లేదు. నిర్మాణం చేపట్టి ఐదేళ్లు గడుస్తున్నా అసంపూర్తిగా ఉంది.

పట్టించుకోవాలి



గ్రామంలోని అంతర్గత రోడ్లు గుంతలమయంగా మారింది. రోడ్డుకు మరమ్మతు చేయాలని అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. జీపీలో నిధులు లేకపోతే కనీసం గుంతల్లో మట్టి నింపైనా ఇబ్బందులు తీర్చాలి. వాడల్లో కాల్వల్లో పూడిక తీసి దుర్వాసన బారినుంచి కాపాడాలి. – గజ్జె శంకర్, గ్రామస్తుడు

పాఠశాల భవనాన్ని కూల్చండి



40 ఏళ్ల క్రితం నిర్మించిన పాఠశాల భవనం కూలడానికి సిద్ధంగా ఉంది. దాని నుంచి విషసర్పాలు వెళ్తుండడంతో బిక్కుబిక్కు మంటూ పక్క భవనంలో చదువు కొనసాగిస్తున్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి భవనాన్ని కూల్చడానికి అనుమతి ఇవ్వాలని కోరుతున్నాం.
– పాలాజి రామస్వామి, ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపా.

నిధుల కోసం ప్రతిపాదించాం



అంతర్గత రోడ్ల నిర్మాణానికి రూ.20 లక్షలు నిధుల కోసం గ్రామసభల్లో తీర్మానం చేసి అధికారులకు ప్రతిపాదనలు పంపించాం. ప్రమాదకరంగా ఉన్న పాఠశాల భవనాన్ని కూల్చేయడానికి అనుమతి కావాలని ఫిర్యాదు చేశాం. గుంతలు పడ్డ రోడ్ల పూడుస్తాం
– గజ్జె లక్ష్మణ్, సర్పంచ్

కత్తెరసాల, బుద్దారంలో గ్రామసభలు



బుద్దారంలో గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు

చెన్నూర్‌రూరల్: మండలంలోని కత్తెరసాల, బుద్దారం గ్రామాల్లో శుక్రవారం గ్రామసభలు నిర్వహించారు. మూడు నెలల ఆదాయ, వ్యయాలు చదివి ప్రజలకు వినిపించారు. నూతనంగా ఏర్పాటు చేసే జీపీలపై తీర్మానాలు చేశారు. కత్తెరసాలలో ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతీ ఇంటికి మరుగుదొడ్డి నిర్మించుకోవాలని సూచించారు. నూతన పంచాయతీలతో గ్రామాలు అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. సర్పంచ్‌లు దూలం శకుంతల, జనగామ రాజం, ఎంపీటీసీలు నిట్టూరి సుధాకర్, ఉప సర్పంచ్ సౌజన్య, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు ఎస్కే.రఫీ,మాధవ్, టీఆర్ఎస్ నాయకులు దూలం సంతోష్‌గౌడ్, హెచ్ఎంలు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దోమతెరల పంపిణీ

భీమారం: మండలంలోని బూర్గుపల్లి, దాంపూర్‌లో గ్రామంలో వైద్య ఆరోగ్యశాఖ ద్వారా మంజూరైన 300 దోమతెరలను సర్పంచ్ కొత్త కాపు తిరుపతి శుక్రవారం గ్రామస్తులకు పంపిణీ చేశారు. వైద్యసిబ్బంది వేణు, విజయ, వెంకటేశ్వరి పాల్గొన్నారు.

మరిన్ని జోన్ వార్తలు 12వ పేజీలో

ఘనంగా బ్రెయిలీ జయంతి



బ్రెయిలీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు

మందమర్రి: పట్టణంలోని పాత బస్టాండ్‌లో లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలను శుక్రవారం వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రెయిలీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వీహెచ్‌పీఎస్ జాతీయ వర్కింగ్ కమిటీ సభ్యుడు పెద్దపెల్లి సత్యానారాయణ మాట్లాడుతూ అంధులు చదువుకోవడానికి ప్రత్యేక బ్రెయిల్ లిపీ కనుగొన్నారన్నారు. కాంతం రాజు, కె. తిరుపతి, బోగె పోషం, కంచెర్ల రాయమల్లు, దామెర శ్రీనివాస్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

చెరువు ఆక్రమణను అరికట్టాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

భీమారం: మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద ఉన్న ఊర చెరువు ఆక్రమణను అరికట్టాలని టీఆర్ఎస్ మండల యూత్ కమిటీ అధ్యక్షుడు ఆవుల సురేశ్ కోరారు. ఈమేరకు తహసీల్దార్ భూమేశ్వర్‌కు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువుకు ఎంత భూమి ఉంది, ఎంత ఆక్రమణకు గురైందనే విషయాన్ని తేల్చా లని డిమాండ్ చేశారు. గతంలో నీటిపారుదలశాఖ, రెవెన్యూ శాఖ అధికారులు కలిసి సర్వే చేసినట్లు తెలిపారు. అప్పుడు సరిహద్దు రాళ్లు వేయాల్సి ఉన్నా పట్టించుకోలేదన్నారు. దాసరి ప్రకాశ్, చింతల శ్రీనివాస్ పాల్గొన్నారు.



వెండితెర



మంచిర్యాలలో..
శ్రీవెంకటేశ్వర–
హాలో
ఏషియన్ శ్రీనివాస –
ఎంసీఏ, (మిడిల్ క్లాస్ అబ్బాయి)
లక్ష్మి – టైగర్ జిందా హై
మయూరి – విక్రం 10
తిరుమల(స్క్రీన్–1)(సీసీసీ)–
హాలో
దేవి(స్క్రీన్–2)(సీసీసీ) –
ఎంసీఏ, (మిడిల్ క్లాస్ అబ్బాయి)

ఘనంగా కంకుమ పూజలు

భీమారం: ధనుర్మాసం సందర్భంగా మండల కేంద్రంలోని శ్రీ కోదండ రామాలయంలో శుక్రవారం లక్ష్మీదేవికి మహిళలు కుంకుమ పూజలు చేశారు. అనంతరం భక్తులకు ప్రసాదాన్ని అందజేశారు. ప్రతీ సంవత్సరం జనవరిలో లక్ష్మీదేవికి కుంకుమ పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. కుంకుమ పూజ ల్లో మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.



కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

సంకష్ట చతుర్థి పూజలు

రామకృష్ణాపూర్: పట్టణంలోని విజయ గణపతి దేవాలయంలో సంకష్ట చతుర్థి మహోత్సవాన్ని శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉపవాసం ఆచరించిన భక్తులు సాయంత్రం జరిగిన విఘ్నేశ్వర పూజల్లో పాల్గొన్నారు. పూజారులు రాజేంద్రప్రసాద్, శ్రీనివాస్ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న మహిళలు

ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలి

మందమర్రిరూరల్: పట్టణంలోని దొరల బంగ్లాస్ ఏరియాలోని 195 సర్వే నంబర్‌లో రెండున్నర ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని టీఆర్‌ఎస్ నాయకులు ఆక్రమించుకోవాలని చూస్తున్నారని దానిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని కంచె వేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ ఇంతియాజ్ అహ్మద్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు సప్పిడి నరేశ్ మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాన్ని అధికారులు వెంటనే స్వాధీనం చేసుకోకపోతే దీక్ష చేపడుతామన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి మేకల రమేశ్, దళిత మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి రొడ్డ మోహన్, నాయకులు దుర్గరాజ్, రాజు, రాయలింగు, నర్సయ్య, కుమార స్వామి, రాజయ్య పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆధ్యాత్మిక చింతనతో దైవానుగ్రహం

చెన్నూర్: ఆధ్యాత్మిక చింతనతో దైవానుగ్రహం సిద్ధిస్తుందని శృంగేరి శారదాపీఠం ఆస్థాన పౌరానికులు, ప్రవచన నిధి బాచంపల్లి సంతోశ్‌కుమార్ అన్నారు. స్థానిక వేదపండితుడు కసోజ్జల ప్రహ్లాద్‌శర్మ స్వగృహంలో లోక కల్యాణార్థం శుక్రవారం శ్రీ మద్భాగవత సప్తాహ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సంతోశ్‌కుమార్ ప్రవచనలు చేశారు. భక్తులు భక్తి మార్గంలో పయనించాలన్నారు. ఈనెల 11 తేదీ వరకు మద్భాగవత సప్తాహం జరుగుతుందన్నారు. నిర్వాహకులు కసోజ్జల కృష్ణమూర్తిశర్మ, శ్యాంసుందర్‌శర్మ, బాస్కర్‌శర్మ, శ్రీనివాస్‌శర్మ పాల్గొన్నారు.



ప్రవచనాలు చేస్తున్న సంతోశ్‌కుమార్

పశువులకు గాలికుంటు నివారణ టీకా

జైపూర్: మండలంలోని శివ్వారం గ్రామంలో స్థానిక పశువైద్యశాల ఆధ్వర్యంలో శుక్రవారం పశువులకు గాలికుంటు నివారణ టీకా వేసినట్లు స్థానిక పశువైద్యాధికారి నిజాం హుస్సేన్ తెలిపారు. విడతల వారీగా అన్నిగ్రామాల్లో పశువులకు గాలికుంటు నివారణ టీకా వేస్తామన్నారు. స్థానిక సర్పంచ్ చల్ల విశ్వంభర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి సబ్ జూనియర్ పోటీల్లో ప్రతిభ



జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో గెలుపొందిన విజేతతో హెచ్‌ఎం, పీడీలు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన అనిల్‌కుమార్

చెన్నూర్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల, బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు ఇటీవల స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో జరిగిన సబ్ జూనియర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ కనబర్చి ద్వితీయ, తృతీయ స్థానాల్లో గెలుపొందినట్లు పీడీ జయశ్రీ తెలిపారు. 12 ఏళ్లలోపు బాలికల 600 మీటర్ల పరుగుపందెంలో జి.అంజలి, ద్వితీయ, బి.మౌనిక తృతీయ, 10 ఏళ్లలోపు వారికి 600 మీటర్ల పరుగుపందెంలో శృతి తృతీయ, 12 ఏళ్లలోపు వారికి 800 మీటర్ల పరుగుపందెంలో బి.పావని ద్వితీయ, 14 ఏళ్లలోపు బాలుర హైజంప్ విభాగంలో మహేశ్, తృతీయ, 10 ఏళ్లలోపు బాలికల లాంగ్ జంప్‌లో ఎ.లావణ్య ద్వితీయ స్థానాల్లో గెలుపొందారు. జిల్లా స్థాయి పోటీల్లో గెలుపొందిన విజేతలను ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఆశ్రమ పాఠశాల విద్యార్థి ఎంపిక

జిల్లా స్థాయి సబ్ జూనియర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో స్థానిక గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థి డి.అనిల్‌కుమార్ హైజంప్‌లో ప్రథమ స్థానంలో గెలుపొంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు కిషన్‌రావు తెలిపారు. ఈనెల 7,8,9 తేదీల్లో హైదరాబాద్ లాల్‌బహదూర్ స్టేడియంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో అనిల్ కుమార్ పాల్గొంటారన్నారు. డీటీడీవో గంగారం, ఏటీడీవో చంద్ర మోహన్, వార్డెన్ పురుషోత్తం, ఉపాధ్యాయులు అనిల్‌కుమార్‌ను అభినందించారు.

'బోడ' వాస్తవాలు తెలుసుకోవాలి

మందమర్రి: మండల శివారులోని నార్లపూర్ సమీపంలోని ఉన్న సర్వే నంబర్ 387/3 గల మూడున్నర ఎకరాల భూమిపై మాజీ మంత్రి బోడ జనార్దన్ వాస్తవాలు తెలుసుకోని మాట్లాడాలని పట్టేదారు కందుల సారంగరావు అన్నారు. శుక్రవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వారసత్వానికి చెందిన 387/3 సర్వే నంబర్‌లో భూమి గిరిజనులకు చెందిందని బోడ జనార్దన్ చేసిన ఆరోపణలు అవాస్తవమన్నారు. కూన సత్యం అనే వ్యక్తి తన తండ్రి గతంలో తనకున్న భూమిని ఇతరులకు విక్రయించాడన్నారు. అతని భూమి ఎక్కడ ఉందో తెలియక మేము సాగు చేసుకుంటున్న భూమి వద్ద వచ్చి ఇది తనదే అని పంట చేలును ధ్వంసం చేశారాన్నరు. ఇంతకు ముందు ఈ భూమిపై కూన సత్యం కబ్జాకు దిగడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఇరువురి భూమి పత్రాలు పరిశీలించిన బెల్లంపల్లి ఏసీపీ తమ వద్ద ఉన్న పత్రాలనే సరైనవని నిర్ధారించారన్నారు. తమను సాగు చేసుకోమని తెలిపారన్నారు. వాస్తవాలు తెలుసుకోని బోడ జనార్దన్ తన రాజకీయ లబ్ధి కోసం గిరిజన భూమి పేరుతో రాద్ధాంతం చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో నాయకులు గోర్ల రాంచందర్, వెంకటేష్, అందుగుల లక్ష్మణ్, దోమ్మని సత్యనారాయణ, గోపతి మల్లమ్మ, అమరగోండ మల్లమ్మ, తిరుపతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కందుల సారంగరావు

జోన్‌గైడ్

8న జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు

చెన్నూర్‌రూరల్: మండలంలోని సుద్దాల గ్రామంలో టీఆర్‌ఎస్ యూత్ ఆధ్వర్యంలో ఈనెల 8న జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు గ్రామ అధ్యక్షుడు కొటారి దేవేందర్, ఎస్సీసెల్ గ్రామ అధ్యక్షుడు రామగిరి అంజి, నాయకులు కావెరి శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలను ప్రభుత్వ విప్ నల్లాల ఓదెలు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే జట్లు 7లోగా తమ జట్ల పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఎంట్రీ ఫీజు రూ.200 ఉంటుందని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 9640528146, 9912130800 సెల్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.



నిరుపయోగంగా నీటి తొట్టి





నెన్నెల: గ్రామాల్లో ఏర్పాటు చేసిన పశువుల తాగు నీటి తొట్లు నిరుపయోగంగా మారాయి. చెత్తకు, పిచ్చిమొక్కలను నిలయాలుగా ఉంటున్నాయి. నెన్నెల, కోనంపేట, నందులపల్లి, ఆవుడం, మైలారం, గొల్లపల్లి, జంగాల్‌పేట, కుశ్నపల్లి గ్రామాల్లో నీటి తొట్లు నిర్మించారు. కానీ నిర్వహణ మాత్రం మరిచారు. రాబోయే వేసవిని దృష్టిలో పెట్టుకొని నీటి తొట్టిలను వినియోగంలోకి తీసుకురావాలి. **- దుర్గం మల్లేశ్, నెన్నెల**

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 9701909596

పశువుకు టీకా.. లేదిక ధోకా

నెన్నెల: పశువులకు సోకే ప్రాణాంతక వ్యాధులపై నిరంతరం అప్రమత్తంగా ఉండాల్సిందే. పశువులకు చలికాలం ఎక్కువగా వ్యాధులు సోకుతుంటాయి. వీటిపై శ్రద్ధ వహించకపోతే ప్రాణాలు పోయే ప్రమాదం కూడా ఉంటుంది. ఇందులో ఎక్కువగా గాలికుంటు వ్యాధి సోకుతుంది. దీనిపై ఏమాత్రం అజాగ్రత్తగా వ్యవహరించినా రైతన్నకు తీరని వేదన మిగిలుతుంది. అందుకే పశువైద్యాధికారులు ఈ సీజన్‌లో శిబిరాలు నిర్వహిస్తుంటారు. ప్రస్తుతం గ్రామాల్లో శిబిరాలు కొనసాగుతున్నాయి. ముందు జాగ్రత్తగా పశువులకు టీకాలు వేస్తున్నారు.

జంగాల్‌పేటలో పశువుకు టీకా వేస్తున్న వైద్యాధికారి



పశువుల ఆరోగ్యంపై జాగ్రత్త వహించాల్సిందే

- గ్రామాల్లో కొనసాగుతున్న శిబిరాలు
- వినియోగించుకుంటే మేలు

నెన్నెల మండలంలో పశువులు, గేదెలు కలిపి మొత్తం 15 వేల వరకు ఉన్నాయి. మేకలు 6 వేలు, గొర్రెలు 10 వేల వరకూ ఉన్నాయి. వీటికి వ్యాధులు సోకకుండా ముందు జాగ్రత్తగా ఈనెల 13 వరకూ గ్రామాల్లో శిబిరాలు నిర్వహిస్తూ టీకాలు అందజేస్తున్నారు.

గాలికుంటు వ్యాధి లక్షణాలు..

- చీలిక గిట్టలు ఉన్న పశువులకు సంక్రమించే వ్యాధుల్లో గాలికుంటు వ్యాధి ఒకటి. ఆఫ్తో వైరస్ వల్ల ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. ఒక పశువు నుంచి మరో దానికి ఇది తక్కువ కాలంలో సంక్రమిస్తుంది. ఈ వ్యాధితో పశువుల్లో ఉత్పాదక సామర్థ్యం తగ్గి పోతుంది. పశువులు బలహీనంగా ఉండడమే కాకుండా వ్యాధి నిరోధక శక్తి తగ్గుతుంది. సంకర జాతి పశువుల్లో ఎక్కువగా కనిపిస్తుంది.
- వ్యాధి సోకినప్పుడు పశువుల శరీర ఉష్ణోగ్రత 104 నుంచి 106 డిగ్రీల సెల్సియస్ ఉంటుంది.
- నోటి ఇఫితీలియన్, పళ్ల చిగుళ్లు, నాలుక లోపలి ప్రాంతాల్లో బొబ్బలు ఏర్పడి అవి 24 గంటల్లో చితికి పోవడం వల్ల పశువులకు నొప్పి వస్తుంది. దీంతో పశువులు మేత ముట్టవు. నోటి నుంచి చొంగ కారుతుంది.
- పాదుగుపై బొబ్బలు ఏర్పడి ఒక్కోసారి పొదుగుకు వాపు వస్తుంది.
- వ్యాధి సోకిన పశువు పాలను దూడలకు పడితే అవి చనిపోయే ప్రమాదం ఉంది. సుడి పశువుల్లో గర్భస్రావాలు జరుగుతాయి.
- పశువుల్లో రక్తహీనత కనిపిస్తుంది.

శ్వాస కష్టంగా పిల్చుతూ ఎండ వేడిమికి తట్టుకోలేక నీరసిస్తాయి.

చికిత్స ఇలా..

- వ్యాధి సోకిన పశువులను మంద నుంచి వేరు చేసి సత్వరం చికిత్స చేయించాలి.
- పొటాషియం పర్మాంగనేట్ పుళ్లను శుభ్రం చేయాలి. అనంతరం నోటి పుళ్లకు బోరోగ్లిజరిన్, కాలి పుళ్లకు జింక్‌అక్సైడ్, లోదాక్సిన్, హిమాక్స్ లాంటి అంటీమెంట్లు పూయాలి. ఈగలు వాలకుండా వేపనూనే, నిమ్లెంట్‌లాంటి మందులు రాయాలి.

వ్యాధి సోకకుండా ..

- గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు మొదటిసారి మూడు నెలల వయస్సు లోనే వేయించాలి. ఆ తర్వాత ఏటా క్రమం తప్పకుండా వేయించాలి. ఆంబోతులు, దున్నల వీర్యం ద్వారా వ్యాధి వ్యాపిస్తుంది. అందువల్ల వ్యాధి సోకిన వాటిని సుమారు మూడు నెలల పాటు సంపర్కానికి దూరంగా ఉంచాలి.
- పశువుల కొట్టాలను క్రిమిసంహారక మందులతో కాకుండా సోడియం హైడ్రాక్సైడ్ రెండు శాతం ఫార్మాబిన్, నాలుగు శాతం సోడియం, కార్బోనేట్ వంటి మందులతో శుభ్రం చేయాలి.

టీకాలు తప్పక వేయించాలి



గాలికుంటు వ్యాధిని ముందు జాగ్రత్తతో నివారించవచ్చు. ఈ వ్యాధి సోకకుండా ఉండేందుకు పశువులకు తప్పకుండా టీకాలు వేయించాలి. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నాం. ఈనెల 13 వరకూ కొనసాగుతుంది. **- దిలీప్, పశువైద్యాధికారి, నెన్నెల**

న్యూస్ బాక్స్

ఆదివాసీలకు దుప్పట్లు పంపిణీ

కాసిపేట: మండలంలోని పెద్దపూర్ కొలంగూడలో శుక్రవారం నిరుపేద ఆదివాసీలకు ఓరియంట్ ఉద్యోగులు బీవీఎస్‌డి.ప్రసాద్, ప్రభాకర్ దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ జేఏసీ జిల్లాఅధ్యక్షుడు ఆడ జంగు, వార్డుమెంబర్ బాబురావు, గిరిజనులు పాల్గొన్నారు.

చిన్నారిపై కుక్కల దాడి

కాసిపేట: మండలంలోని పెద్దనపల్లి పంచాయతీ లేఅవుట్ కాలనీలో పంబాల శివశ్రేణి అనే నాలుగేళ్ల చిన్నారిపై శుక్రవారం కుక్కలు దాడి చేశాయి. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..చిన్నారి ఉదయం ఇంటి పరిసరాల్లో ఆడుకుంటుండగా కుక్క దాడిచేసి తీవ్ర గాయపరిచాయి. గ్రామంలో కుక్కల బెడద తీవ్రంగా ఉందని వాపోయారు.

ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో స్వచ్ఛభారత్



పిచ్చి మొక్కలు తొలగిస్తున్న జెడ్పీటీసీ సత్తయ్య

కాసిపేట: స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో శుక్రవారం స్వచ్ఛభారత్ నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు రౌతు సత్తయ్య పాల్గొని పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం తొలగించి కాల్చివేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడంతో పాటు మొక్కలు పెంచేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో కార్యాలయ సూపరింటెండెంట్ విజయ్‌కుమార్, లక్ష్మీనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

మరిన్ని జోన్ వార్తలు 12వ పేజీలో

'స్వచ్ఛ సర్వేక్షణ్' పై అవగాహన ర్యాలీ

బెల్లంపల్లి: మున్సిపాలిటీలో శుక్రవారం స్వచ్ఛ సర్వేక్షణ్ పథకంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధి 33వ వార్డులో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజలకు కార్యక్రమంపై అవగాహన కల్పించారు. మున్సి పల్ చైర్‌పర్సన్ సునీతారాణి, కమిషనర్ రాజు మాట్లాడుతూ స్వచ్ఛసర్వేక్షణ్ పై పుర ప్రజలు కనీస అవగాహన కలిగి ఉండాలన్నారు. మున్సిపాలిటీని సుందరంగా ఉంచుకోవాలని, చెత్తా చెదారం లేకుండా చూడాలన్నా రు. కార్యక్రమంలో కౌన్సిలర్ కటకం సతీష్, సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ అధికారులు

సబ్ కలెక్టర్‌ను కలిసిన ప్రవీణ్



సబ్‌కలెక్టర్‌ను సన్మానిస్తున్న ప్రవీణ్

బెల్లంపల్లి: గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రేణికుంట్ల ప్రవీణ్ శుక్రవారం సబ్‌కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన సబ్‌కలెక్టర్‌ను శాలువాతో సన్మానించారు. ప్రవీణ్ వెంట టీఆర్ఎస్ శ్రేణులు అర్జయ్య, సంపత్, నెల్లి రమేశ్ తదితరులున్నారు.

ఎస్సీవర్గీకరణ వెంటనే చేపట్టాలి

బెల్లంపల్లి: ఎస్సీ వర్గీకరణను ప్రభుత్వం వెంటనే చేపట్టాలని ఎమ్మార్పీఎస్ పట్టణ కన్వీనర్ నక్క కృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. వర్గకరణ కోసం పాలక ప్రభుత్వాలు చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదని విమర్శించారు. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే వర్గకరణ బిల్లును ఆమోదించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

లోకల్ వాయిస్

మీటర్లు ఏర్పాటు చేయాలి



కాసిపేట: దుబ్బగూడెంలో విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేయకపోవడంతో చాలా కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల నిర్వహించిన గ్రామసభలో అధికారులు 10 రోజుల్లో కనెక్షన్‌లు ఇస్తామని చెప్పారు. కానీ నేటికి వాటి ఊసెత్త డం లేదు. వెంటనే మీటర్లు ఏర్పాటు చేయాలి. **- శ్రీనివాస్, దుబ్బగూడెం**

సమస్యలు పరిష్కరించాలి



మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఉన్న సమస్యలకు తోడు మధ్యహ్న భోజనం సక్రమంగా లేదు. దీంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇతర ప్రభుత్వ కార్యాలయాల ఇరుకు గదుల్లోనే తరగతులు నిర్వహిస్తున్నారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలి. **- గోలేటి స్వామి, కాసిపేట**



మన బెల్లంపల్లి

సాక్షి మంచిర్యాల
శనివారం | జనవరి | 6 | 2018

వెండితెర



హలో
రామకృష్ణ (బెల్లంపల్లి)
11.15, 2.15, 6.15, 9.15
ఎంసీప
బాలాజీ (బెల్లంపల్లి)
11.15, 2.15, 6.15, 9.15
ఎంసీప
వెంకటరమణ
(కాగజ్‌నగర్)11.00,2.00,
6.00, 9.00

సంపూర్ణ డిజిటల్ అక్షరాస్యత సాధించాలి

• ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య



శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిన్నయ్య

తాండూర్: ప్రధాన మంత్రి గ్రామీణ డిజిటల్ అక్షరాస్యత కార్యక్రమాన్ని విజయవంతం చేసి సంపూర్ణ డిజిటల్ అక్షరాస్యతను సాధించాలని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య సూచించారు. మండల కేంద్రంలోని విద్యా భారతి డిగ్రీ కళాశాలలో డిజిటల్ అక్షరాస్యత శిక్షణ కేంద్రాన్ని ఎమ్మెల్యే శుక్రవారం అధికారి కంగా ప్రారంభించారు. అనంతరం సురభి గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ రాష్ట్రంలోనే ఈ కార్యక్రమాన్ని నియోజకవర్గంలోని బెల్లంపల్లి, తాండూర్‌ల లో ప్రతిష్టాత్మకంగా చేపట్టామన్నారు. టెక్నా లజీని గ్రామీణులకు అందజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటికీ ఇంటర్నెట్ సౌకర్యం అందిస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఒక్కరూ డిజిటల్ అక్షరాస్యులు కావాలని, ఇంటర్నెట్ వినియోగించుకునే స్థాయికి ఎదిగితేనే కార్యక్రమ లక్ష్యం నెరవేరుతుందన్నారు.

కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నర్సింగం, జెడ్పీటీసీ సభ్యుడు మంగపతి సురేష్‌బాబు, వైఎస్ ఎంపీపీ దుర్గం మంగ, సర్పంచ్ పిట్ట పరమేశ్వరి, విద్యాభారతి విద్యాసంస్థల చైర్మన్ సురభి ఆగమరావు, డైరెక్టర్ శరత్ కుమార్, ఎంపీటీసీలు సుబ్బ దత్తు మూర్తి, సిరంగి శంకర్, పసుల ప్రమీల, చౌళ్ల సత్యనారాయణ, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ సల్వాజి మహేందర్‌రావు, టాస్క్ జిల్లా మేనేజర్ సునీల్ కుమార్, రీజినల్ కో ఆర్డినేటర్ బాలు ప్రవరాఖ్య, ఎంపీడీవో భాస్కర్, ఎంఈవో ప్రభాకర్, నాయకులు బానయ్య, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి బావికి కంచె ఏర్పాటు



కంచె ఏర్పాటు చేసి పరిశీలిస్తున్న సీఐ

తాండూర్: పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా మండలంలోని నర్సాపూర్‌లో పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం తాగునీటికి బావిపై కంచె ఏర్పాటు చేశారు. గ్రామస్తుల విన్నపం మేరకు స్పందించిన సీఐ జనార్దన్‌రెడ్డి, మాదారం ఎస్సై రాములు బావి పై ఇనుప కంచె ఏర్పాటు చేయించారు. పోలీసుల సహకారంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఎస్సై సాగర్, జేపీవో రాజేందర్, సింగిల్ విండో డైరెక్టర్ పార్వతిబాయి, తదితరులున్నారు.

'లంబాడాలను తొలగించాలి'



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నెన్నెల: లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించే వరకూ ఆందోళనలు చేపడతామని ఆదివాసీ మన్నేవార్ కొలవార్ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు కమ్మరి భీమయ్య తెలిపారు. శుక్రవారం తహశీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ పెద్దిరాజుకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లంబాడాలకు కుల, ఏజెన్సీ ధ్రువీకరణ పత్రాల జారీ నిలిపివేయాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు కొడిపెశంకర్, మండల అధ్యక్షుడు శ్రీనివాస్, మల్లేశ్ తదితరులున్నారు.

పశువులకు టీకాలు వేయించాలి

• పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి ఎల్లన్న



బెల్లంపల్లిరూరల్: టీకా వేస్తున్న ఎల్లన్న

నెన్నెల: పశువులకు ఎలాంటి వ్యాధులు సోకకుండా ముందు జాగ్రత్తగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి ఎల్లన్న సూచించారు. మండలంలోని జంగాల్‌పేట్‌లో శుక్రవారం నిర్వహించిన శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పశువులను వ్యాధుల బారి నుంచి కాపాడేందుకు ప్రతి ఆరు నెలలకోసారి ఈ టీకాలు వేయిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట మండల పశువైద్యాధికారి డాక్టర్ దిలీప్, సిబ్బంది ఉన్నారు.

భీమిని: మండలంలోని లక్ష్మీపూర్, పొలంపల్లి గ్రామాల్లో నిర్వహించిన పశు వైద్య శిబిరాల్లో ఎల్లన్న పాల్గొన్నారు. రైతులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట జన్కాపూర్ పశువైద్యాధికారి హారిక ఉన్నారు.

బెల్లంపల్లిరూరల్: మండలంలోని మాలగురిజాలలో నిర్వహించిన శిబిరంలో పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి ఎల్లన్న పాల్గొని మాట్లాడారు. మూడు నెలల వయస్సున్న పశువు నుంచి టీకా అందజేయాలని సూచించారు. ఆయన వెంట మండల పశువైద్యాధికారి సుజాత, సర్పంచ్ తిరుపతి ఉన్నారు.

తాండూర్: మండలంలోని అచ్చలాపూర్‌లో నిర్వహించిన శిబిరంలో 253 ఎద్దులు, ఆవులు, 42 గేదెలకు టీకాలు వేసినట్లు రేచినీ పశువైద్యాధికారి నర్సింహారావు తెలిపారు. ఎంపీటీసీ చౌళ్ల సత్యనారాయణ ఉన్నారు.

నిధులు కేటాయించడం హర్షణీయం

బెల్లంపల్లి: సింగరేణి మైదానాలకు నిధులు కేటాయించడం హర్షనీయమని తెలంగాణ స్వామి వివేకానంద వాకర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు వి.బొంద్యాలు, ప్రధాన కార్యదర్శి జి.వెంకటయ్య పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ఏఎంసీ మైదానంలో వారు మాట్లాడుతూ తిలక్ స్టేడియం, నెంబర్- 2 ఏఎంసీ మైదానాల అభివృద్ధి కోసం జీఎం రూ.26.77 లక్షలు మంజూరు చేశారని తెలిపారు. కార్యక్రమంలో శ్రీధర్‌స్వామి, మల్లయ్య, ఎం.సూరిబాపు, బాపు, మొండి, రాజలింగు, వెంకటేష్, శ్రీనివాస్ తదితరులున్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకత పెంచాలి

• ఎల్‌ఈపీ రాష్ట్ర పరిశీలకుడు వామనమూర్తి



బోర్డుపై రాసి విద్యార్థులకు వివరిస్తున్న రాష్ట్ర పరిశీలకుడు వామనమూర్తి

వేమనపల్లి: విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించేలా ఉపాధ్యాయులు విద్యాబోధన చేయాలని ఎల్ఈపీ రాష్ట్ర పరిశీలకులు వై.వామనమూర్తి, దత్తకుమార్ సూచించారు. శుక్రవారం మండలంలోని నీల్వాయి ఎంపీపీఎస్‌ను తనిఖీ చేసి విద్యార్థుల కనీస పఠనా సామర్థ్యం గురించి తెలుసుకున్నారు. ఇంగ్లీష్, గణితంలో విద్యార్థుల ప్రతిభ పెంపు గురించి ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట కోటపల్లి ఎంఈవో జగన్, పాఠశాల హెచ్ఎం అశోక్‌చందర్ ఉన్నారు.

నల్లబ్యాడ్జీలతో వీఆర్ఏల నిరసన



డీటీకి వినతిపత్రం అందజేస్తున్న వీఆర్ఏలు

తాండూర్: కామారెడ్డి జిల్లా కంబపూర్ వీఆర్ఏ బోయిని సాయిలును హత్య చేసిన ఇసుక మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలని వీఆర్ఏ సంఘం మండల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ మానిక్‌రావుకు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందించిన వారిలో రేవెల్లి దిగంబర్, బుర్స గణపతి, సదయ్య, విజయ్, పోశమల్లు, సత్తయ్య, భీమయ్య, తదితరులున్నారు.

రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం



రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

బెల్లంపల్లి: రాజ్యసభలో ట్రిపుల్ తలాక్ బిల్లు ఆమోదించకుండా కాంగ్రెస్ సభ్యులు అడ్డుకున్నారని నిరసన వ్యక్తం చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళనలు చేపట్టారు. పట్టణంలో కాంటా చౌరస్తా వరకూ ర్యాలీ నిర్వహించి ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం చేశారు. నాయకులు మాట్లాడుతూ ముస్లిం మహిళల శ్రేయస్సు కోసం ట్రిపుల్ తలాక్ బిల్లు ప్రవేశ పెడితే కాంగ్రెస్ అడ్డుకోవడం సరికాదన్నారు. నిరసనలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.ఏమాజీ, జిల్లా ప్రధాన కార్యదర్శి కేశవరెడ్డి, జిల్లా కార్యదర్శి ప్రకాష్, పట్టణ అధ్యక్షుడు సోమశేఖర్, నాయకులు ఎం.శ్రీనివాస్, గోవర్ధన్, అరుణ్, విజయ్, నర్సయ్య, శంకర్, ప్రభాకర్, శైలేందర్‌సింగ్ పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ

సాగులో జాగ్రత్తలు పాటించాలి

అంశం : పంటల సాగు- తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ఉప్పులేటి శంకర్, ఏఈవో, తాండూర్



తాండూర్: రైతులు పంటల సాగులో తగు జాగ్రత్తలు పాటించి మంచి దిగుబడులు ఆర్జించాలని మండల వ్యవసాయ విస్తరణ అధికారి(ఏఈవో) ఉప్పులేటి శంకర్ సూచిస్తున్నారు. పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సస్యరక్షణ చర్యలపై 'సాక్షి' ఆయనను పలకరించింది.

సాక్షి: పత్తి రైతులకు మీరిచ్చే సూచనలు?

ఏఈవో: పత్తిని సేకరించిన వెంటనే కర్రను తొలగించి కాల్చివేయాలి. దీని వల్ల పత్తికి ప్రమాదకరంగా మారిన గులాబి రంగు పురుగు లార్వాలు వృద్ధి చెందకుండా అరికట్టవచ్చు. వేసవి దుక్కులు చేపట్టాలి.

సాక్షి: వేసవి దుక్కుల వల్ల లాభాలేంటి.?

ఏఈవో: గడ్డి కలుపు నివారించడంతో పాటు నేల సారవంతమయ్యేందుకు ఉపకరిస్తుంది. అలాగే శత్రు పురుగులు నశిస్తాయి.

సాక్షి: వరినారుపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు.?

ఏఈవో: రబీలో చలి తీవ్రత వల్ల వరినారు సరిగా ఎదగదు. నాట్లు వేసేటప్పుడు నాలుగు పిలకలు నాటుకోవాలి.

సాక్షి: వరిలో సుడిదోమ తాకిడిని నివారించడమెలా.?

ఏఈవో: వరి నారు వేసేటప్పుడు రెండు నుంచి మూడు మీటర్ల ఎడంగా గాలి తాకేటట్లు కాలిబాటలు ఉంచుకోవాలి. యూరియాను తక్కువ మోతాదులో వేయాలి. సంబంధిత మందులు పిచికారి చేయాలి.

శనివారం | జనవరి | 6 | 2018 సాక్షి

ఖేల్


హైజంప్ చేస్తున్న క్రీడాకారిణి


షాట్‌పుట్‌లో పాల్గొన్న క్రీడాకారుడు


షాట్‌పుట్‌లో విసురుతున్న క్రీడాకారిణి

సత్తా చాటారు

ముగిసిన వెటరన్ అథ్లెటిక్స్ పోటీలు

రామకృష్ణాపూర్(చెన్నూర్): మాస్టర్స్ అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రామకృష్ణాపూర్‌లోని సింగరేణి ఠాగూర్ స్టేడియంలో ప్రతిష్టాత్మకంగా రెండు రోజుల పాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి వెటరన్ అథ్లెటిక్ క్రీడా సంబరాలు శుక్రవారం ముగిశాయి. గురువారం పోటీలు ప్రారంభం కాగా శుక్రవారం సాయంత్రం వరకు కూడా పోటీలు కొనసాగాయి. 40 ఏళ్ల నుంచి 95 వయసు విభాగం వరకు పురుషులు, స్త్రీలకు వేర్వేరుగా నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఆయా జిల్లాల నుంచి సుమారు 600 మందికి పైగా క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభను చాటారు. 100 మీటర్ల పరుగు, 200 మీటర్లు, 400 మీటర్లు, 800 మీటర్లు, 5 కిలోమీటర్లు, 10 కిలోమీటర్ల పరుగుపందెంతో పాటు 5 కిలోమీటర్ల వాకింగ్, హ్యామర్‌త్రో, జావలీన్‌త్రో, డిస్కస్‌త్రో, షాట్‌పుట్, 400 రిలే, హైజంప్, లాంగ్ జంప్, ట్రిపుల్ జంప్ తదితర అంశాల్లో మొత్తం 27 ఈవెంట్స్‌ను నిర్వహించారు.యువత కంటే రెట్టింపు జోష్‌తో వెటరన్స్ క్రీడల్లో పాల్గొన్నారు. క్రీడల్లో సత్తా చాటారు.


క్రీడాకారులకు బహుమతులు అందిస్తున్న విప్ ఓదెలు

విప్‌చే బహుమతుల అందజేత..

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు బహుమతులు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల ద్వారా క్రమశిక్షణ పెరుగుతుందని అన్నారు. క్రీడలతో క్రమశిక్షణనే కాక విజయం సాధించాలన్న పట్టుదల కూడా పెరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో మాస్టర్స్ వెటరన్ అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, కార్యదర్శి భగవాన్ రెడ్డి, జెడ్పీటీసీ కంభగోని సుదర్శన్‌గౌడ్, క్యాతనపల్లి సర్పంచ్ జాడి శ్రీనివాస్, డీవైఎస్‌వో శ్రీకాంత్‌రెడ్డి, పీఈటీల సంఘం జిల్లా అధ్యక్షుడు మీనారెడ్డి, నాయకులు గాండ్ల సమ్మయ్య, నర్సింగరావు, మేడిపెల్లి సంపత్, ఈశ్వరాచారీ, బైరమల్ల మొగిలయ్య, కుమ్మం సురేందర్, జిలకర మహేశ్, పీఈటీలు బెల్లం శ్రీనివాస్, నాగులు, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఓవరాల్ చాంపియన్‌గా నిలిచిన మేడ్చల్

రాష్ట్రస్థాయి వెటరన్ అథ్లెటిక్స్ పోటీల్లో మేడ్చల్ జిల్లా జట్టు ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. పురుషులు, స్త్రీల విభాగంలో అత్యధిక ఈవెంట్స్‌లో ప్రతిభను కనబరిచి బహుమతులు సాధించిన మేడ్చల్ జిల్లా జట్టుకు పురుషుల చాంపియన్‌షిప్, స్త్రీల చాంపియన్‌షిప్‌తో పాటు ఓవరాల్ చాంపియన్‌షిప్ బహుమతిని నిర్వాహకులు అందచేశారు. కాగా 40 ఏళ్ల నుంచి 95 వయసు విభాగంలో అథ్లెటిక్స్‌లోని ఆయా అంశాల్లో మొదటి రెండు స్థానాల్లో నిలిచిన పురుషులు, స్త్రీలు ఫిబ్రవరి 11 నుంచి 14 వరకు ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని మాస్టర్స్ వెటరన్ అథ్లెటిక్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మారెడ్డి, భగవాన్‌రెడ్డి పేర్కొన్నారు. 297 మంది క్రీడాకారులు (మహిళలు, పురుషులు జాతీయస్థాయికి ఎంపిక కాగా మంచిర్యాలకు చెందిన వారు 16 మంది ఉన్నారు.


సాధించిన మెడల్స్‌తో సింగరేణి ఉద్యోగులు

కిక్ గేమ్ 'సెపక్ తక్రా'

- నేటినుంచి నస్పూర్‌లో అంతర్ జిల్లా సీనియర్స్ పోటీలు

శ్రీరాంపూర్(మంచిర్యాల): క్రీడల్లో కిక్ ఇచ్చే గేమ్‌గా సెపక్ తక్రా చెప్పవచ్చు. విదేశీ క్రీడ అయిన కూడా మన దేశంలో రోజు రోజుకు ఆదరణ పెరుగుతోంది. ముఖ్యంగా సంప్రదాయ క్రీడలకు నిలయమైన తెలంగాణలో కూడా ఈ క్రీడను క్రీడాకారులు అభిమానించి ఆదరిస్తున్నారు. చాలా మంది క్రీడాకారులు ఈ క్రీడలో రాణిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తరువాత మొదటిసారిగా సింగరేణి గడ్డపై రాష్ట్ర స్థాయిలో సీనియర్స్ అంతర్ జిల్లాల పోటీలు జరుగుతున్నాయి. సీనియర్స్‌లో పురుషులు, మహిళలు వేరువేరుగా ఈ పోటీల్లో పాల్గొననున్నారు. నస్పూర్ కాలనీలోని సింగరేణి సేవాభవన్ దీనికి వేదికైంది. నేటి నుంచి జరగనున్న పోటీలకు సుమారు 150 మంది క్రీడాకారులు హాజరువుతున్నారు. దీనికోసం కంపెనీ తనవంతుగా మైదానాలను, లైటింగ్ ఏర్పాటు చేసింది. నేటి సాయంత్రం మొదలై, ఆదివారం సాయంత్రంతో ముగియనున్నాయి.


సెపక్ తక్రా ఆడుతున్న క్రీడాకారులు(ఫైల్)

ఉమ్మడి జిల్లా ఘనత

2006 నుంచి 2010 వరకు జూనియర్స్, సబ్ జూనియర్స్ అంతర్ జిల్లాల పోటీల్లో జిల్లా బాలబాలికల జట్లు చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. 2015లో అంతర్ జిల్లాల సీనియర్స్ విభాగంలో పురుషుల జట్టు చాంపియన్‌షిప్‌ను గెలిచింది. 2002లో హైదరాబాద్‌లో జరిగిన 32వ జాతీయ స్థాయి పోటీల్లో జిల్లా నుంచి పి.శిరీష (శ్రీరాంపూర్), జి.అనిల్‌కుమార్ (గోలేటి) పాల్గొన్నారు. 2003లో హైదరాబాద్ హకీంపేటలో ఉన్న స్పోర్ట్స్ స్కూల్‌లో జిల్లా నుంచి ముగ్గురు క్రీడాకారులు ఎంపికయ్యారు. 2004 నుంచి ఇప్పటివరకు జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి సుమారు 100 మంది క్రీడాకారులు విభాగాల్లో పాల్గొన్నారు

క్రీడా నియమాలు...

పురుషులు, మహిళలు ఇద్దరు కూడా ఆడే క్రీడ ఇది. ప్రతి జట్టులో మొత్తం 5 గురు క్రీడాకారులు ఉంటారు. ఇందులోముగ్గరు ఆడితే ఇద్దరు ఎక్స్‌ట్రా ప్లేయర్‌గా ఉంటారు. ఆటకు మొత్తం 21 పాయింట్లు ఉంటాయి.ఆట లో త్రోయర్, సర్వీస్ పర్సన్, షూటర్ అంటూ 3 రకాలుగా సంబోధిస్తారు.

ఆదర్శం


డెస్క్‌బెంచీలపై కూర్చుని విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు

స్వచ్ఛందం.. సౌకర్యాలు ఘనం

చీకట్లో కూర్చునేకంటే ఆ చీకట్లోనే ఓ చిరుదీపం వెలిగించడం మంచిది అనేది చైనా సామెత. మనసుంటే మార్గముంటుంది. తలుచుకుంటే మనిషి సాధించలేనిది ఏదీ లేదు అనేదానికి ఇదే నిదర్శనం. సర్కారు పాఠశాలల పరిస్థితి ఎలా ఉంటుందో మనకు తెలుసు. కానీ ఇక్కడ మాత్రం కార్పొరేట్‌కు దీటుగా సౌకర్యాలు కల్పించి జిల్లాలోనే అత్యధిక విద్యార్థులున్న పాఠశాలగా తీర్చిదిద్దే క్రమంలో స్వచ్ఛంద సంస్థల సహకారం మరువలేనిది. మంచి పనికి సహాయం తప్పకుండా ఉంటుంది అనడానికి ఇదే ఉదాహరణ. ప్రభుత్వ పాఠశాలలో అన్ని హంగులు సమకూర్చుతూ విద్యార్థుల భవితకు మేమున్నామంటూ ప్రధానోపాధ్యాయురాలు సైతం తనవంతు సహాయం అందించడం గొప్ప విషయం. మామూలు పల్లెటూళ్లో ప్రభుత్వ పాఠశాలకు అన్ని హంగులు దిద్దుతూ విద్యార్థుల అభివృద్ధే ధ్యేయంగా పాఠాలు బోధిస్తూ 170 మంది విద్యార్థులకు విద్యాబుద్ధులు చెబుతున్నారు. పాఠశాల రూపకల్పనలో స్వచ్ఛంద సంస్థల ప్రోత్సాహంతో విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తున్నారు.

- సర్కారు బడిలో... కార్పొరేట్ వసతులు
- ఆదర్శంగా రెబ్బనపల్లి ప్రాథమిక పాఠశాల
- స్వచ్ఛంద సంస్థల సహకారంతో అభివృద్ధి
- ఆంగ్లమాధ్యమంలో విద్యా బోధన
- ఏటేటా పెరుతున్న విద్యార్థుల సంఖ్య

దండేపల్లి(మంచిర్యాల): దండేపల్లి మండలంలోని రెబ్బనపల్లి ప్రాథమిక పాఠశాలలో గత ఏడాది 1వ తరగతికి ఆంగ్ల మాధ్యమంతో బోధన ప్రారంభించారు. ప్రస్తుతం 5 తరగతుల వరకు కూడా ఆంగ్ల మాధ్యమంలో బోధిస్తున్నారు. దీంతో గ్రామస్తులతో పాటు పక్క గ్రామాల వారు కూడా తమ పిల్లలను ప్రైవేటుకు పంపకుండా రెబ్బనపల్లి ప్రాథమిక పాఠశాలకు పంపిస్తున్నారు. పాఠశాలలో రెండేళ్ల క్రితం 52 మంది విద్యార్థులు ఉండగా, గత ఏడాది 120 కి చేరుకుంది. ప్రస్తుతం 170 అయ్యింది. జిల్లాలోనే అత్యధిక విద్యార్థులున్న పాఠశాలగా ప్రత్యేక స్థానం సంపాదించుకుంటోంది. జిల్లాలోని పలు పాఠశాలలకు ఆదర్శంగా నిలుస్తోంది.

విద్యార్థులకు అన్ని ఉచితంగానే..

రెబ్బనపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు అన్ని ఉచితంగానే అందిస్తున్నారు. యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, కంపాసు బాక్సులు, బూట్లు, టై, బెల్టు, ఐడీ కార్డులు కూడా అన్ని దాతలు అందిస్తున్నారు. వీటికి తోడు ప్రభుత్వం అందించే మధ్యాహ్న భోజన పథకంతో పాటు సాయంత్రం వేళ పిల్లలకు పోషక పదార్థాలతో కూడిన అల్పాహారాన్ని ఉచితంగా అందిస్తున్నారు. సమీప గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులకు ఆటో చార్జీల్లో కూడా సగం వరకు దాతలు, హెచ్‌ఎం చెల్లిస్తుండగా, మిగతా సగం పిల్లల తల్లిదండ్రులు భరిస్తున్నారు.

స్వచ్ఛంద సంస్థలు అందించిన సౌకర్యాలు..

- పాఠశాల అభివృద్ధికి హైదరాబాద్‌కు చెందిన పలు స్వచ్ఛంద సంస్థలు అభివృద్ధిలో పాలు పంచుకుంటున్నాయి.
- బిగ్‌హెల్ప్ ఎడ్యుకేషన్, బ్రింగ్ ఏ స్మైల్ స్వచ్ఛంద సంస్థ వారు 6 కంప్యూటర్లను అందించారు.
- ఆశ ఇన్‌ట్రస్టు వారు పాఠశాల విద్యార్థులందరికీ నోట్‌బుక్స్ అందించారు.
- వాట(వాషింగ్‌టన్ తెలుగు) వారు 26 బెంచీలను అందించారు.
- క్యూరోప్ స్వచ్ఛంద సంస్థ వారు 10 బెంచీలను, 5 ర్యాక్‌లను,
- ఓయూ ప్రొఫెసర్ నీలకంఠం శుద్ధ జల ప్లాంటును అందించారు.
- పద్మావతి చారిటబుల్ ట్రస్టు హైదరాబాద్ వారు ప్రొజెక్టర్ అందజేశారు.

ప్రైవేటు విద్యావలంటీర్లతో..

పాఠశాలలో రెగ్యులర్ టీచర్లు ఇద్దరే ఉన్నారు. విద్యార్థుల సంఖ్య పెరగడంతో ప్రైవేటుగా నలుగురు విద్యా వలంటర్లను నియమించారు. వీరికి వేతనాలు కూడా స్వచ్ఛంద సంస్థలే చెల్లిస్తున్నాయి.

పక్క గ్రామాల నుంచి విద్యార్థులు..

చాలా గ్రామాల్లో ఆంగ్ల మాధ్యమ చదువుకు పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపిస్తున్నారు. రెబ్బనపల్లి ప్రాథమిక పాఠశాలకు మాత్రం గ్రామంలోని పిల్లలతో పాటు సమీప గ్రామాలైన ఎల్లారం, చింతపల్లి, నెల్కివెంకటాపూర్, ఇప్పలగూడ, చెల్కగూడెం, ముత్యంపేట గ్రామాల నుంచి కూడా విద్యార్థులు వస్తున్నారు. ఇందులో గ్రామానికి చెందిన వారు 100 మంది ఉంటే సమీప గ్రామాల నుంచి వచ్చే వారు మరో 70 మంది విద్యార్థులు ఉండటం విశేషం.

మెరుగైన వసతులు..

స్వచ్ఛంద సంస్థల సహకారంతో పాఠశాలలోని విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించారు. ఇందులో ముఖ్యంగా విద్యార్థులకు కూర్చునేందుకు డెస్క్ బెంచీలు, ప్రాథమిక స్థాయిలోనే కంప్యూటర్ శిక్షణ, ప్రొజెక్టర్ ద్వారా పాఠాలు, తాగేందుకు మినరల్ వాటర్, గ్రంథాలయం, విద్యార్థులకు ఉచిత యోగా, కరాటే శిక్షణ కూడా నేర్పిస్తున్నారు.


కంప్యూటర్ నేర్చుకుంటున్న విద్యార్థులు

చక్కగా చెబుతున్నారు



నేను అంతకు ముందు ప్రైవేటు పాఠశాలకు వెళ్లేది.. మా ఊరి పాఠశాలలో గత రెండేళ్ల కిత్రం ఆంగ్ల మాధ్యమం ప్రారంభించారు. దీంతో మా తల్లిదండ్రులు మా ఊరి ప్రాథమిక పాఠశాలకు పంపిస్తున్నారు. ఇక్కడ ప్రైవేటు పాఠశాల కంటే మంచిగా చెబుతున్నారు. ప్రొజెక్టర్ ద్వారా కూడా పాఠాలు బోధిస్తున్నారు. కంప్యూటర్ నేర్పిస్తున్నారు. పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్‌లు అన్ని ఫ్రీగానే ఇచ్చారు. చాలా బాగుంది.

-శిరీష, విద్యార్థిని, 5వతరగతి, రెబ్బనపల్లి

వేతనంలో 20 శాతం పిల్లలకే..



నాకు నెల నెల వచ్చే వేతనంలో 20 శాతం విద్యార్థుల కోసం ఖర్చు చేస్తున్నాను. పాఠశాలకు వచ్చేది చాలా మంది పేద పిల్లలు కావడంతో వారి కోసం ఖర్చు చేస్తున్నాను. పాఠశాల అభివృద్ధికి దాతలు సహకరించినప్పటికీ నా వంతుగా కూడా విద్యార్థులకు కొంత ఖర్చు పెడుతున్నాను. ఆటో చార్జీలు, సాయంత్రం అందించే అల్పహారానికి, కొంత ఖర్చు భరిస్తున్నాను. విద్యార్థులందరికీ బూట్లు, టై, బెల్టు కొనిచ్చాను.

-అర్చన, పాఠశాల హెచ్‌ఎం

పేదవిద్యార్థుల కోసం..



పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి సహకరించాలనే ఉద్దేశంతో పాఠశాల అభివృద్ధికి స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకున్నాం. వాళ్లు స్పందించి పాఠశాలకు అన్ని రకాల వసతులు కల్పించారు. దీంతో గ్రామస్తులు తమ పిల్లలను ప్రైవేటుకు పంపకుండా ప్రభుత్వ పాఠశాలకే పంపిస్తున్నారు. పాఠశాలలో వసతులు కల్పించినప్పటి నుంచి విద్యార్థుల సంఖ్య పెరిగింది. చాలా సంతోషంగా ఉంది.

-సంగనభట్ల రాజేంద్రప్రసాద్, సందాన కర్త

చాలా గర్వంగా ఉంది..



మా ఊరి పాఠశాలలో దాతల సహకారంతో మెరుగైన వసతులు కల్పించారు. దీంతో జిల్లాలోని అన్ని పాఠశాలలకంటే మా ఊరి పాఠశాలలో విద్యార్థులు ఎక్కువగా ఉండటం చాలా గర్వంగా ఉంది.

- కొట్టె రాజేశ్వరి, సర్పంచ్, రెబ్బనపల్లి


సాయంత్రం వేళ ప్రత్యేక తరగతులు


అల్పాహారం చేస్తున్న విద్యార్థులు


ప్రాజెక్టర్ ద్వారా పాఠాలు తిలకిస్తున్న విద్యార్థులు